www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

సోమవారం
05-08-2024

సంపుటి : 01 । సంచిక : 93 । పేజీలు : 12 । వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్




డా॥ కాచం సత్యనారాయణ CMD

## ఫ్యూచర్ సిటీ ప్రకటన వెనుక అసలు స్ట్రాటజీ ఇదే

### ఫోర్త్ సిటీ వెనుక కాంగ్రెస్ భూదందా

- వేల ఎకరాలను సేకరించి దోచుకునే కుట్ర
- కేసీఆర్ కుటుంబ భూదోపిడీపై చర్యలేవి?
- కాంగ్రెస్ కు హిందూ పండగలంటే అంత చులకనెందుకు?
- బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ నడుస్తోంది
- కేంద్రమంత్రి బండి సంజయ్ సంచలన ఆరోపణలు



ఫ్యూచర్ సీటీ వెనుక పెద్ద ఎత్తున భూదందా సాగనుంది..కాంగ్రెస్ నేతలు వేల ఎకరాలను ముందుగానే సేకరించి రియల్ ఎస్టేట్ దందా చేస్తూ వేల కోట్ల ఆస్తులను పోగేసుకునేందుకు సిద్ధమయ్యారు..బీఆర్ఎస్ హయాంలో ధరణి పేరుతో దాదాపు 2 లక్షల కోట్ల కుంభకోణం జరిగింది.కాంగ్రెస్ నేతలు కూడా బీఆర్ఎస్ పార్టీ బాటలోనే నడుస్తూ.. వేల కోట్ల ఆస్తులను దోచుకునేందుకు సిద్ధయ్యారంటూ కేంద్రమంత్రి బండి సంజయ్ సంచలన ఆరోపణలు చేశారు. మహేశ్వరం నియోజకవర్గంలోని గుర్రంగూడలో బోనాల ఉత్సవాలకు చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డితో కలిసి బండి సంజయ్ పాల్గొన్నారు.

## మెట్రోలో ప్రయాణించిన మాజీ ప్రధాని

అధికారులతో ముచ్చటించిన దేవెగౌడ

ఢిల్లీలోని ప్రధాన మంత్రుల మ్యూజియం సందర్శన





## ఆరేళ్లలో ఆరు కి.మీ.
# నిర్మించలేరా!

### ఉప్పల్-నారపల్లి ఫ్లైఓవర్‌పై మంత్రి కోమటిరెడ్డి

- ఇది తెలంగాణ ప్రజలకు అవమానం
- కేసీఆర్, కేటీఆర్ లు సిగ్గుపడాలి
- కాంట్రాక్టర్ల మీద పెట్టి తప్పించుకోవద్దన్న మంత్రి

**విశ్వంభర, హైదరాబాద్:**

ఆరేళ్లలో ఆరు కిలోమీటర్ల ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తి చేయలేక పోవడం సిగ్గుచేటని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి విమర్శించారు. ఇది తెలంగాణ ప్రజలకు అవమానకరమని అన్నారు. హైదరాబాద్ లోని ఉప్పల్ -నారపల్లి మార్గంలో ఎలివేటెడ్ కారిడార్ పనులను మంత్రి వెంకటరెడ్డి ఆదివారం ఎంపీ ఈటల రాజేందర్ తో కలిసి పరిశీలించారు. 2018లో ప్రారంభమైన ఎలివేటెడ్ , పనులు ఇప్పటికీ పూర్తి కాలేదని , నిర్మాణ పనుల వల్ల రహదారి గుంతలమయంగా మారిందని , ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని స్థానికులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆర్ అండ్ బి అధికారుల తీరుపై మంత్రి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. 2018 లో ప్రారంభమైన ఎలివేటెడ్ కారిడార్ పనులు ఇప్పటికీ పూర్తి కాలేదంటే ఆరేళ్ల కాలంలో ఆరు కిలోమీటర్ల వంతెన వేయలేకపోయారంటే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ లు సిగ్గుపడాలని అన్నారు. పదేళ్లు బీఆర్ఎస్ అధికారంలో ఉండి హైదరాబాద్ విశ్వనగరం చేస్తున్నామన్నారని, కానీ 6 ఏళ్లు అయినా ఉప్పల్ ఫ్లైఓవర్ ఎందుకు పూర్తి చేయలేదని ఆయన ప్రశ్నించారు. బ్రిడ్జి నిర్మాణంలో రోడ్లు భవనాల శాఖ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని కోమటిరెడ్డి విమర్శించారు. కాంట్రాక్టర్ పై నిందలు మోపడం కాదని, మీరు చేయాల్సిన పని సక్రమంగా నిర్వర్తించలేకపోయారని అధికారులపై అసహనం ప్రదర్శించారు. త్వరితగతిన పూర్తి చేయడానికి మీ వద్ద ఉన్న ప్రణాళిక ఏమిటి? అని ప్రశ్నించారు. అధికారులు ఇకనైనా సాకులు చెప్పడం మాని, సెప్టెంబరు చివరి కల్లా ఎలివేటెడ్ కారిడార్ టెండరు పనులు పూర్తి చేసేలా మిగతా2లో...


### పర్యాటకాన్ని పట్టించుకోని బీఆర్ఎస్ ప్రభుత్వం

- మేం జాతీయ, అంతర్జాతీయ పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తాం
- మంత్రి జూపల్లి కృష్ణారావు



## అమెరికాలో సీఎం రేవంత్

- ఘనస్వాగతం పలికిన అభిమానులు
- న్యూయార్క్, శాన్ ఫ్రాన్సిస్కో, వాషింగ్టన్ డీసీ, న్యూజెర్సీలో పర్యటించనున్న తెలంగాణ ముఖ్యమంత్రి



## బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు

- 2025 మార్చి నాటికి దేశ వ్యాప్తంగా అందుబాటులోకి..
- కేంద్ర మంత్రి పెమ్మసాని వెల్లడి

2025 మార్చి నాటికి దేశ వ్యాప్తంగా బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలను అందుబాటులోకి తెస్తామని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు జిల్లా తాడికొండలో నూతన దేశీయ బేస్ బ్యాండ్ యూనిట్ను మంత్రి ప్రారంభించారు. పట్టణ ప్రాంతాలతో పాటు మారుమూల గ్రామాలకు ఇంటర్నెట్ సేవలు అందించడమే బీఎస్ఎన్ఎల్ లక్ష్యమన్నారు.





## అప్రమత్తంగా ఉండాలి

నేడు రేడియల్ క్రస్ట్ గేట్ల ఎత్తివేత

నాగార్జున సాగర్ కు భారీగా వరద ప్రవాహం

2లక్షల క్యూసెక్కుల నీటి విడుదల

కృష్ణా పరివాహక గ్రామాలకు

నల్లగొండ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి సూచన

## డిజిటల్ విద్య.. మితిమీరొద్దు

- మొబైల్ డివైజ్ లతో విద్యార్థులకు ప్రమాదకర పరిణామమే
- అభ్యసనపై ప్రతికూల ప్రభావం
- అవసరమైనప్పుడే స్మార్ట్ ఫోన్లను వినియోగించాలి
- 14దేశాల పాఠశాలల్లో నిషేధం
- యునెస్కో తాజా నివేదిక వెల్లడి



**ఢిల్లీ:** పాఠశాల స్థాయిలో సాంకేతికతను అందిపుచ్చుకోవడం సానుకూల అంశమే అయినప్పటికీ దాన్ని మితిమీరిన రీతిలో వినియోగించడం ప్రమాదకర పరిణామమేనని అంతర్జాతీయ నివేదికలు వెల్లడిస్తున్న విషయం తెలిసిందే. మొబైల్ డివైజ్లతో ఎక్కువ సమయం గడపడం విద్యార్థి దృష్టి మరల్చుతుందని, వారి అభ్యసనపై ప్రతికూల ప్రభావం చూపిస్తుందని తాజా నివేదిక వెల్లడించింది. మిగతా2లో...

## రేవంత్ ఆల్ ది బెస్ట్



### రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావాలి

తెలంగాణ ఫస్ట్..ఆ తర్వాతే రాజకీయాలు

**విదేశీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ కి కేటీఆర్ ట్వీట్**

**విశ్వంభర, హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆల్ ది బెస్ట్ చెప్పారు.తెలంగాణ ఆర్థికాభివృద్ధికి, ఉద్యోగ ఉపాధి కల్పనకు దోహదపడే పెట్టుబడులు తీసుకురావడం, వ్యూహాత్మక భాగస్వామ్యాలు చేసుకోవడమే లక్ష్యంగా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు వెళ్లిన విషయం తెలిసిందే. 10 రోజులపాటు అమెరికా, దక్షిణ కొరియాలోని వివిధ నగరాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు వ్యాపార ప్రముఖులతో సమావేశాలు, చర్చలు జరుగనున్నాయి. అయితే సీఎం రేవంత్ అమెరికా పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఐటీ మంత్రి కేటీఆర్ ఇంట్రెస్టింగ్ ట్వీట్ చేశారు. పెట్టబడుల సాధన కోసం అమెరికా పర్యటనకు వెళ్లిన రేవంత్ బృందానికి కేటీఆర్ ఆల్ ది బెస్ట్ చెప్పారు. గత పదేళ్లు అధికారంలో ఉన్న తమ ప్రభుత్వం ఇతర దేశాల్లో ఉన్న ప్రముఖ కంపెనీ ప్రతినిధులతో మిగతా2లో...


మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి




### నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 80 | ₹ 102 |
| **స్కిన్** | **స్కిన్ లెస్** |
| ₹ 148 | ₹ 168 |

## మహిళా పతాకధారిగా..

- ముగింపు వేడుకల్లో వ్యవహరించనున్న మనుభాకర్
- ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ ప్రకటన
- భారత షూటర్‌కు అరుదైన గౌరవం



**విశ్వంభర, స్పోర్ట్స్:** పారిస్ ఒలింపిక్స్ లో రెండు పతకాలు సాధించిన భారత షూటర్ మను భాకర్ కు అరుదైన గౌరవం లభించింది. పోటీల ముగింపు వేడుకల్లో మను భాకర్ మహిళా పతాకధారిగా వ్యవహరించనున్నారు. ఈ మేరకు ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ ప్రకటన విడుదల చేసింది. ఆగస్టు మిగతా2లో...



## హిమాచల్‌లో వరదలు..

- 11కి చేరిన మరణాలు, 40 మంది గల్లంతు
- కొనసాగుతున్న గాలింపు చర్యలు
- భారీ వర్షాల కారణంగా దాదాపు రూ.662 కోట్ల నష్టం

## చీరలో అమ్మతనం..కమ్మదనం..

నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం కృషి

'ది స్పిరిట్ ఆఫ్ వైజాగ్ సొసైటీ' ఆధ్వర్యంలో శారీ వాక్

పాల్గొని మాట్లాడిన ఏపీ హోంమంత్రి అనిత



# పర్యాటకాన్ని పట్టించుకోని బీఆర్ఎస్ ప్రభుత్వం

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో ఎన్నో పర్యాటక క్షేత్రాలు ఉన్నప్పటికీ బీఆర్ ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని పర్యాటక శాఖ మంత్రి మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపించారు. పర్యాటక అధ్యయనంలో భాగంగా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలో ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేల బృందంతో మంత్రి సరళా సాగర్ ప్రాజెక్ట్ ను సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రపంచ స్థాయి పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని అన్నారు. ప్రకృతి రమణీయమైన ప్రదేశాలు, ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, చారిత్రక, వారసత్వ సంపదకు నెలవుగా తెలంగాణ ఉందని తెలిపారు. ఎన్నో అవకాశాలు, వనరులు ఉన్నప్పటికీ గడచిన పది సంవత్సరాల్లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పర్యాటక ప్రాంతాల అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిందని అన్నారు.

**ప్రణాళికలు రూపొందిస్తున్నాం**

సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో ఉన్న పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగా ఉమ్మడి పాలమూరులో పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, పర్యాటకులను ఆకర్షించడం, పర్యాటక ప్రాంతాలను ప్రాచుర్యంలోకి తీసుకురావడం, మౌలిక వసతుల కల్పన, రహదారుల నిర్మాణం, తదితర అంశాలపై అధ్యయనం చేస్తున్నామని వివరించారు. ఆసియా ఖండంలోనే రెండవదైన ఆటోమెటిక్ సైఫాన్ సిస్టం కలిగిన సరళా సాగర్ తో పాటు కోయిల్ సాగర్ ను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని వెల్లడించారు. టెంపుల్ టూరిజంలో భాగంగా కురుమూర్తి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మధుసూదన్ రెడ్డి, వీర్లపల్లి శంకర్, వాకిటి శ్రీహరి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, వంశీ కృష్ణ, కసిరెడ్డి నారాయణ రెడ్డి, రాజేష్ రెడ్డి, మేఘరెడ్డి, అనిరుధ్ రెడ్డి, సీడబ్ల్యూసీ మెంబర్ చల్లా వంశీచంద్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# మెట్రోలో ప్రయాణించిన మాజీ ప్రధాని

**ఢిల్లీ:** జనతాదళ్ (సెక్యులర్) పార్టీ అధినేత, మాజీ ప్రధాని హెచ్డీ దేవెగౌడ ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆదివారం అక్కడి మెట్రోలో ప్రయాణించారు. మాజీ ప్రధాని తమతో ప్రయాణించడంతో ప్రయాణికులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. దేవెగౌడ అధికారులతో ముచ్చటిస్తూ మెట్రో సేవల గురించి తెలుసుకున్నారు. కాగా ఢిల్లీలో ప్రధాని మోదీ ఏర్పాటు చేసిన ప్రధాన మంత్రుల మ్యూజియాన్ని దేవెగౌడ శనివారం సందర్శించారు. దానికి సంబంధించిన విషయాలను సోషల్ మీడియా ఎక్స్ వేదికగా పంచుకున్నారు. "ఢిల్లీలోని ప్రధాన మంత్రుల మ్యూజియాన్ని సందర్శించాను. ఇది ఒక అపూర్వమైన అనుభవం. మన ప్రధానులు దేశ అభివృద్ధికి అందించిన సహకారాన్ని, వారి భిన్న నేపథ్యాలను తెలియజేస్తూ ఈ మ్యూజియం ఏర్పాటు చేయడం అభినందనీయం" అని ఆయన పేర్కొన్నారు. కర్ణాటకలోని మారుమూల గ్రామంలోని పేద రైతు కుటుంబానికి చెందిన తాను దేశ ప్రధాని కావడానికి, ఈ మ్యూజియంలో చోటుదక్కించుకోవడానికి ప్రజలే అండగా నిలిచారని తెలిపారు.

# రేవంత్ ఆల్ ది బెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

పెంచుకున్న సంబంధాలు నేడు రాష్ట్రానికి మేలు చేకూరుస్తున్నాయని చెప్పారు. విరామం లేకుండా పట్టుదలతో తెలంగాణకు భారీ ఎత్తున వీదేశీ పెట్టుబడులు తీసుకొచ్చామని వెల్లడించారు. వాటి పునాదుల మీదే.. నేడు రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు రానుండటం సంతోషకరమని చెప్పారు. మా అధినేత కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి అనుకూలమైన పర్యావరణ వ్యవస్థను రూపొందించేందుకు మేం అధిక ప్రాధాన్యం ఇచ్చాం. టీఎస్ ఐపాస్ లో ప్రభుత్వ వినూత్నమైన విధానాలకు ఆకర్షితులై చాలా సంస్థలు తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడి పెట్టాయి. గత దశాబ్ద కాలంలో రూ.4 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు వివిధ రంగాల్లో 24 లక్షలకు పైగా ప్రైవేట్ ఉద్యోగాలను మేం సృష్టించాం. ఏది ఏమైనా రాజకీయాలు పక్కన పెడితే.. నాకు మరియు బీఆర్ఎస్ పార్టీకి ఎల్లప్పుడూ తెలంగాణ ఫస్ట్. ప్రస్తుత ప్రభుత్వం కూడా ప్రత్యక్ష పెట్టుబడులను తీసుకురావడంలో విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం. మేం స్థాపించిన బలమైన పునాదిపై తెలంగాణ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేస్తారని హృదయపూర్వకంగా ఆశిస్తున్నా జై తెలంగాణ అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు

# హిమాచల్‌లో వరదలు..

**సిమ్లా:** హిమాచల్ లో ఆకస్మిక వరదల కారణంగా గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు 11 మంది చనిపోయినట్లు గుర్తించగా.. 40 మంది ఆచూకీ ఇంకా లభించలేదు. గల్లంతైన వారి కోసం భారత సైన్యంతో పాటు ఎన్డీఆర్ఎఫ్. సీఐఎస్ఎఫ్, ఐటీబీపీ, ఎస్ఆర్ఎఫ్ కు చెందిన 410 మందితో గాలింపు చర్యలు విస్తృతంగా కొనసాగుతున్నాయి. జాగిలాలు, డ్రోన్లు సహా ఇతర పరికరాలతో రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది.భారీ వర్షాల కారణంగా కులులోని నిర్మాండ్, సాయింజ్, మలానాతోపాటు మండీలోని పధార్, శిమ్లాలోని రాంపుర్ డివిజన్లలో వరదలు సంభవించాయి. మణికరన్ ప్రాంతంలోని మలానా-2 పవర్ ప్రాజెక్టలో 33 మంది చిక్కుకోగా వారిని రెస్క్యూ బృందాలు రక్షించాయి. శిమ్లాలోని రాంపుర్లో దాదాపు 20 నుంచి 25 ఇళ్లు కొట్టుకుపోగా, 30 మంది గల్లంతయ్యారు. మొత్తంగా 40మంది ఆచూకీ ఇంకా లభించలేదు.వరద నీరు కాస్త తగ్గడంతో రెస్క్యూ ఆపరేషన్ను ముమ్మరం చేశారు. మరోవైపు రాష్ట్రంలో రుతుపవనాలు ప్రవేశించిన నెల రోజుల్లోనే భారీ వర్షాల కారణంగా దాదాపు రూ.662 కోట్ల నష్టం వాటిల్లినట్లు అధికారులు పేర్కొన్నారు. వర్ష సంబంధిత ఘటనల్లో ఇప్పటివరకు 79 మంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు.

# చీరలో అమ్మతనం..కమ్మదనం..



**విశాఖ:** భారతదేశం అంటే గుర్తుకు వచ్చేది చీరకట్టు, సంప్రదాయం అని ఏపీ హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. చేనేతను ప్రోత్సహిస్తూ 'ది స్పిరిట్ ఆఫ్ వైజాగ్ సొసైటీ' ఆధ్వర్యంలో విశాఖ బీచ్ రోడ్డులో ఆదివారం ఉదయం శారీ వాక్ నిర్వహించారు. సుమారు 8 వేల మంది మహిళలు, విశాఖ యువతులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. చీరలో అమ్మతనం, కమ్మదనం ఉంటుందని తెలిపారు. భావితరాలు ఈ సంప్రదాయాన్ని కొనసాగించాలని కోరారు. మహిళలకు స్ఫూర్తినిచ్చే ఇలాంటి కార్యక్రమం నిర్వహించిన నిర్వాహకులకు ప్రత్యేక అభినందనలు చెప్పారు. చీర నేయడంలో చేనేత కార్మికుల కష్టం ఉంటుందని పేర్కొన్నారు. నేతన్నలు ఇప్పటికీ చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని అనిత తెలిపారు.

# ఫ్యూచర్ సిటీ ప్రకటన వెనుక అసలు స్ట్రాటజీ ఇదే..



**విశ్వంభర, హైదరాబాద్:** అసెంబ్లీ సమావేశాల్లో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన ఫ్యూచర్ సీటీ వెనుక పెద్ద ఎత్తున భూదందా సాగనుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. ఫోర్త్ సిటీ పేరుతో మహేశ్వరం నియోజకవర్గం పరిధిలో కాంగ్రెస్ నేతలు వేల ఎకరాలను ముందుగానే సేకరించి రియల్ ఎస్టేట్ దందా చేస్తూ వేల కోట్ల ఆస్తులను పోగేసుకునేందుకు సిద్ధమయ్యారంటూ సంచలన ఆరోపణలు చేశారు. గత బీఆర్ఎస్ హయాంలో ధరణి పేరుతో దాదాపు 2 లక్షల కోట్ల కుంభకోణం జరిగిందంటూ ఆరోపించారు. దేశంలోనే అతిపెద్ద కుంభకోణం ధరణి అన్నారు. కాగా ఇప్పుడు కాంగ్రెస్ నేతలు కూడా బీఆర్ఎస్ పార్టీ బాటలోనే నడుస్తూ.. వేల కోట్ల ఆస్తులను దోచుకునేందుకు సిద్ధయ్యారని బండి సంజయ్ తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గంలోని గుర్రంగూడలో బోనాల ఉత్సవాలకు చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డితో కలిసి బండి సంజయ్ పాల్గొన్నారు. బోనాల పండుగ వెనుక పెద్ద చరిత్రతో పాటు.. సైంటిఫిక్ రీజన్ కూడా ఉందని బండి సంజయ్ వివరించారు. కానీ.. ఇంత పెద్ద పండుగకు ప్రభుత్వం నిధులివ్వలేదని ఆరోపించారు. సెక్యులరిజం పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక మతానికే కొమ్ముకాస్తూ కోట్లు ఖర్చు చేస్తోందని మండిపడ్డారు. రంజాన్‌కు రూ.33 కోట్లు.. హిందువులను చంపిన తబ్లిగీ జమాతే సంస్థకు 2 కోట్ల 40 లక్షలు విడుదల చేసిన కాంగ్రెస్ అదేదో ఘనకార్యంగా చెప్పుకోవడం సిగ్గు చేటని దుయ్యబట్టారు. హిందువుల పండుగలంటే అంత చులకనా అని ప్రశ్నించారు.

బీఆర్ఎస్ మాదిరిగానే కాంగ్రెస్ కూడా ఎంఐఎం పార్టీకి కొమ్ము కాస్తోందని బండి సంజయ్ ఆరోపించారు. ఇలాగే వ్యవహరిస్తే బీఆర్ఎస్ పార్టీకి పట్టిన గతే కాంగ్రెస్‌కు కూడా పడుతుందంటూ వివరించారు. ఎంఐఎం పార్టీని నమ్ముకుంటే కాంగ్రెస్ నేతలు నట్టేట మునగడం ఖాయన్నారు. 15 నిమిషాల పాటు సమయమిస్తే హిందువులను నరికి చంపుతానన్న అక్బరుద్దీన్ ఒవైసీని తీసుకెళ్లి కొడంగల్ లో పోటీ చేయిస్తామని కాంగ్రెస్ నేతలు ప్రతిపాదించడం సిగ్గు చేటని బండి సంజయ్ పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్ శివారులోని 33 గ్రామపంచాయతీలు, 20 పురపాలక సంఘాలు, 8 కార్పొరేషన్లు, 61 పారిశ్రామిక వాడలు, కంటోన్మెంట్ బోర్డు.. వీటన్నింటినీ గ్రేటర్ హైదరాబాద్‌లో విలీనం చేయాలనే ప్రతిపాదన అర్థం లేనిదని బండి సంజయ్ తెలిపారు. ప్రజలపై పన్నుల భారం మోపేందుకే విలీన కుట్ర చేస్తున్నారన్నారు. 15 ఏళ్ల కిందట హైదరాబాద్ శివారులోని విలీనమైన ప్రాంతాలు ఇప్పటికీ అభివృద్ధికి నోచుకోలేదన్నారు. వాటిని అభివృద్ధి చేయకుండా, కనీస సౌకర్యాలు కల్పించకుండా ఇతర మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, పంచాయతీలను విలీనం చేస్తామనడం అర్థం లేనిదన్నారు. దీనిపై బీజేపీ నాయకత్వం చర్చించి త్వరలోనే తగిన కార్యాచరణను ప్రకటిస్తుందన్నారు.

# అప్రమత్తంగా ఉండాలి

- నేడు రేడియల్ క్రస్ట్ గేట్లను ఎత్తివేత
- నాగార్జున సాగర్ కు భారీగా వరద ప్రవాహం
- 2లక్షల క్యూసెక్కుల నీటి విడుదల
- కృష్ణా పరివాహక గ్రామాలకు
- నల్లగొండ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి సూచన

**విశ్వంభర, నాగార్జున సాగర్:** నాగార్జున సాగర్ జలాశయానికి భారీగా వరద ప్రవాహం కొనసాగుతోంది. సోమవారం ఉదయం రేడియల్ క్రస్ట్ గేట్లను ఎత్తి అధికారులు దిగువకు నీటిని విడుదల చేయనున్నారు. సాగర్ పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా.. ఆదివారం సాయంత్రానికి 576.10 అడుగులకు చేరింది. పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 312.5 టీఎంసీలకు గానూ.. 271.90 టీఎంసీల నీరు నిల్వ ఉంది. సాగర్ జలాశయానికి 3లక్షల 22 వేల క్యూసెక్కుల వరద వస్తోంది. 37,873 క్యూసెక్కులు ఔట్ ఫ్లోగా ఉంది. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి భారీగా వరద నీరు రావడంతో నీటిమట్టం గంటగంటకూ పెరుగుతోంది. సాగర్ దిగువన ఉన్న కృష్ణానది పరివాహక గ్రామాల ప్రజలు, లోతట్టు ప్రాంతాల వాసులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..**

నాగార్జునసాగర్ ప్రాజెక్టు రిజర్వాయర్ పూర్తి నీటి సామర్థ్యంతో నిండే అవకాశం ఉన్నందున సోమవారం ఉదయం 8 గంటలకు నాగర్జున సాగర్ ప్రాజెక్టు రేడియల్ క్రస్ట్ గేట్లను ఎత్తివేయనున్న దృష్ట్యా ప్రాజెక్టు దిగువ భాగంలో ఉన్న ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి సూచించారు. ప్రజలెవరూ నదిలోకి స్నానానికి వెళ్లవద్దని, యువకులు ఈత కొట్టేందుకు నదిలోకి వెళ్లవద్దని, అదేవిధంగా పశువులు, మేకలు, గేదెలు వంటి వాటిని నదిలోకి తీసుకువెళ్ల వద్దని ఆయన కోరారు. ప్రస్తుతం శ్రీశైలం ప్రాజెక్టు నుండి నాగార్జునసాగర్ ప్రాజెక్టు కు భారీ వరద కొనసాగుతున్నదని, ఏ సమయంలోనైనా నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ రిజర్వాయర్ పూర్తి నీటి నిలువ సామర్థ్యానికి చేరుకుంటుందని తెలిపారు.శ్రీశైలం ప్రాజెక్టు నుండి వరద ఉధృతి కొనసాగుతున్న దృష్ట్యా నాగార్జునసాగర్ ప్రాజెక్టు రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం ఏ సమయంలోనైనా చేరుకునే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు.దీనిని దృష్టిలో ఉంచుకొని సోమవారం నాగార్జునసాగర్ ప్రాజెక్టు రేడియల్ క్రస్ట్ గేట్ల ద్వారా సుమారు రెండు లక్షల క్యూసెక్కుల నీటిని దిగువ భాగానికి వదిలి వేయడం జరుగుతున్నదని తెలిపారు. అంతేకాక శ్రీశైలం సాగర్ ప్రాజెక్టు నుండి వచ్చే వరదను దృష్టిలో ఉంచుకుని నీటి విడుదల ఉంటుందని తెలిపారు. అందువల్ల నాగార్జునసాగర్ దిగువ ప్రాంతంలో ఉన్న ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు కింది భాగంలోని ప్రజల ఆస్తి నష్టం ప్రాణ నష్టం వంటివి జరగకుండా సంబంధిత మండలాల, గ్రామాల అధికారులందరూ చర్యలు తీసుకోవాలని, ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# ప్రభుత్వ పెద్దల ప్రోత్సాహంతోనే వైసీపీ శ్రేణులపై దాడులు


## వైఎస్ జగన్ ఫైర్



**విశ్వంభర, తాడేపల్లి:** ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్య ప్రభుత్వ స్థానంలో మూకల పాలన కనిపిస్తోందని మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఆరోపించారు. ఈ రెండు నెలల కాలంలోనే ఏపీ అంటేనే రాజకీయ హింసకు మారుపేరుగా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పరిస్థితిలో ఏ మాత్రం మార్పు రావడం లేదని అన్నారు. ఈ మేరకు టీడీపీ కూటమి ప్రభుత్వంపై జగన్ ట్విట్టర్ (ఎక్స్) వేదికగా విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ప్రభుత్వంలో పెద్దల ప్రోత్సాహంతో జరిగే ఘటనలు, అధికారంలో తమపార్టీ ఉందనే ధీమాతో చేస్తున్న దాడులు, రాజకీయ ప్రేరేపిత దుశ్చర్యలు రాష్ట్రంలో ప్రతిరోజూ జరుగుతూనే ఉన్నాయని జగన్ అన్నారు. నంద్యాల జిల్లాలో నిన్న రాత్రి జరిగిన హత్య, ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో జరిగిన దాడి ఘటనలు వీటికి నిదర్శనాలే అని పేర్కొన్నారు. ప్రజలకిచ్చిన హామీలను ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు నిలబెట్టుకోలేకపోవడంతో ఇలాంటి దుర్మార్గాలకు పాల్పడుతున్నారని అన్నారు. ఎవరూ ప్రశ్నించకూడదని, రోడ్లపైకి రాకూడదని ప్రజలను, వైసీపీ నాయకులు, కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ఈ దారుణాల బాధితులకు అండగా ఉంటూ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ ట్వీట్‌కు #SaveAPFromTDP హ్యాష్‌ట్యాగ్‌ను జోడించారు. నంద్యాల జిల్లాలో శనివారం రాత్రి వైసీపీ నాయకుడిని దారుణంగా హత్య చేశారు. మహానంది మండల పరిధిలోని సీతారామపురంలో వైసీపీ నేత సుబ్బరాయుడిని కొంతమంది దుండగులు రాళ్లతో అత్యంత కిరాతకంగా కొట్టి చంపేశారు. దాదాపు 40 మంది దుండగులు దాడి చేసి హతమార్చినట్లుగా తెలుస్తోంది. గ్రామానికి చెందిన టీడీపీ నాయకులే తన భర్తను చంపేశారని సుబ్బరాయుడు భార్య ఆరోపిస్తుంది. ఈ క్రమంలోనే ఈ ఘటనపై వైఎస్ జగన్ సీరియస్‌గా స్పందించారు.

# అమెరికాలో సీఎం రేవంత్

- ఘనస్వాగతం పలికిన అభిమానులు
- న్యూయార్క్, శాన్ ఫ్రాన్సిస్కో, వాషింగ్టన్ డీసీ, న్యూజెర్సీలో పర్యటించనున్న



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డికి న్యూయార్క్ ఎయిర్ పోర్టులో అభిమానులు సీఎంకు ఘన స్వాగతం పలికారు. ఈ నెల 14 వరకు దాదాపు 10రోజులు అమెరికాలో ఆయన పర్యటించనున్నారు. ప్రధానంగా అమెరికాలోని న్యూయార్క్, శాన్ ఫ్రాన్సిస్కో, వాషింగ్టన్ డీసీ, న్యూజెర్సీలో పర్యటించనున్నారు. ఆ తర్వాత దక్షిణ కొరియాలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటించనున్నారు.తెలంగాణ రాష్ట్రానికి కొత్త పెట్టుబడులు తీసుకొచ్చేందుకు అమెరికా పర్యటనకు సీఎం రేవంత్ వెళ్లారు. ఆయనతోపాటు ఐటీ మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి ఉన్నారు. పర్యటనలో భాగంగా 8 రోజులు అమెరికాలో, రెండు రోజులు దక్షిణ కొరియాలో పర్యటించనున్నారు.ఈ పర్యటనలో భాగంగా పలు కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు చేసుకోనుంది. అయితే సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పెట్టుబడుల కోసం సీఎం రేవంత్ రెడ్డి విదేశాల్లో పర్యటించడం ఇది రెండోసారి కావడం విశేషం. ఇదిలా ఉండగా, సీఎం రేవంత్ రెడ్డ అమెరికా పర్యటన అనంతరం మంత్రి వర్గ విస్తరణ ఉండనుంది. ఈ నెల 14న రాష్ట్రానికి వచ్చిన తర్వాత ఢిల్లీ వెళ్లనున్నారు. ఈ మేరకు ఢిల్లీలో ఏఐసీసీ అగ్రనేతలతో చర్చించనున్నట్లు సమాచారం. క్యాబినెట్ లో 6 ఖాళీలు ఉండగా..మంత్రి వర్గంలోకి ప్రస్తుతం నలుగురిని తీసుకోనున్నారు. మిగతా రెండు బెర్తుల కోసం వివిధ సమీకరణాల ప్రకారం..భర్తీ చేయనున్నట్లు తెలుస్తోంది. అయితే క్యాబినెట్ విస్తరణ జరిగిన వెంటనే పీసీసీ చీఫ్‌ను కూడా నియమిస్తారని సమాచారం.

# డిజిటల్ విద్య.. మితిమీరొద్దు

(మొదటి పేజీ తరువాయి)

టెక్నాలజీపైనే తీవ్ర దృష్టి పెట్టడమనేది భారీ మూల్యం చెల్లించుకోవడమేనని, అభ్యసన ప్రక్రియకు అసరమైనప్పుడు మాత్రమే దాన్ని తరగతుల్లో ఉపయోగించాలని ఐక్యరాజ్యసమితి నివేదిక పేర్కొంది. ఈ క్రమంలోనే దాదాపు 14 దేశాలు పాఠశాలల్లో స్మార్ట్ ఫోన్ల వినియోగాన్ని నిషేధించాయని తెలిపింది. 'విద్యలో సాంకేతికత' అనే అంశానికి సంబంధించి యునెస్కో తాజా నివేదికలో పలు విషయాలు వెల్లడించింది. "మితిమీరిన సాంకేతికత వినియోగం, విద్యార్థుల పనితీరు మధ్య ప్రతికూల సంబంధాన్ని చూపిస్తుందని ప్రోగ్రామ్ ఫర్ ఇంటర్నేషనల్ స్టూడెంట్ అసెస్మెంట్ (PISA) విశ్లేషణలో తేలింది. మొబైల్ డివైజ్లతో ఎక్కువ సమయం గడపడం వల్ల అభ్యసన ప్రక్రియలో ప్రతికూల ప్రభావాలు వచ్చినట్లు అనేక దేశాల నివేదికలు పేర్కొంటున్నాయి. ఈ క్రమంలో పాఠశాలల్లో స్మార్ట్ఫోన్ల వినియోగంపై ఇప్పటికే 14 దేశాలు నిషేధం విధించాయి" అని తాజా నివేదిక పేర్కొంది. తరగతి గది, ఇంట్లో చిన్నారుల చదువులపై స్మార్ట్ఫోన్లు, కంప్యూటర్లు తీవ్ర అంతరాయం కలిగిస్తాయని యునెస్కో అప్రమత్తం చేసింది. "డిజిటల్ టెక్నాలజీని అలవరచుకోవడం వల్ల విద్య, అభ్యసన ప్రక్రియలో ఎన్నో మార్పులు వచ్చాయి. ప్రాథమిక నైపుణ్యాలను నేర్పే క్రమంలో అనేక సంపన్న దేశాలు డిజిటల్ సాంకేతికతను విస్తృతంగా వినియోగిస్తున్నాయి. పేపర్ స్థానంలో స్క్రీన్లు, పెన్నుల స్థానంలో కీబోర్డులు వచ్చేశాయి. కొవిడ్-19తో రాత్రికి రాత్రే విద్యావ్యవస్థలు ఆన్లైన్‌కి మారిపోయాయి" అని ఐక్యరాజ్య సమితి విద్యా బృందానికి చెందిన ఓ నిపుణుడు పేర్కొన్నారు.

# బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు

**విశ్వంభర, గుంటూరు:** 2025 మార్చి నాటికి దేశ వ్యాప్తంగా బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలను అందుబాటులోకి తెస్తామని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు జిల్లా తాడికొండలో నూతన దేశీయ బేస్ బ్యాండ్ యూనిట్ను మంత్రి ప్రారంభించారు. పట్టణ ప్రాతాలతో పాటు మారుమూల గ్రామాలకు ఇంటర్నెట్ సేవలు అందించడమే బీఎస్ఎన్ఎ ఏ లక్ష్యమన్నారు. 4,500 టవర్లు ఏర్పాటు చేసి నాణ్యమైన 4జీ సేవలను ప్రజలకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. విద్యుత్ ఎంత ముఖ్యమో.. నాణ్యమైన ఇంటర్నెట్ సేవలు కూడా అంతే ముఖ్యమన్నారు. ప్రైవేటు సంస్థలు మారుమూల పల్లెలకు ఇంటర్నెట్ సేవలు అందించవని.. లాభాపేక్ష లేకుండా వారికి కూడా బ్రాడ్ బ్యాండ్ సేవలు అందించాలన్నదే ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్దేశమని వెల్లడించారు. ప్రైవేటు సంస్థల ధరల వల్ల ప్రజలు బీఎస్ఎన్ఎల్ వైపు చూస్తున్నారన్నారు. అతి తక్కువ రేట్లలో అందించేందుకు కేంద్ర ప్రణాళిక రచిస్తోందన్నారు. రాజధానిలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు.

# ఆరేళ్లలో ఆరు కి.మీ. నిర్మించలేరా?

(మొదటి పేజీ తరువాయి)

చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**మళ్లీ టెండర్ పిలుస్తాం: 18 నెలల్లో పూర్తి చేస్తాం**

నారపల్లిలో అధికారులతో సమీక్ష సమావేశం అనంతరం మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ మళ్లీ ఉప్పల్ ఫ్లైఓవర్ టెండర్ పిలుస్తామని ప్రకటించారు. ఫ్లై ఓవర్ పూర్తి చేయడానికి మరో రూ. 2, 3 వందల కోట్లు వ్యయం పెరుగుతుందని అన్నారు. 10 రోజుల్లో ఉప్పల్ చౌరస్తా నుంచి ఘట్‌కేసర్ ఓఆర్ఆర్ వరకు రోడ్ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఫ్లై ఓవర్ పనులు దసరా నాటికీ మొదలు పెడతామని వెల్లడించారు. 18 నెలల్లో పనులు పూర్తి చేస్తామని వివరించారు. కమీషన్ల కోసమే కేసీఆర్ కాళేశ్వరం కట్టారని విమర్శించారు. ఉప్పల్ ఫ్లైఓవర్‌ను గాలికి వదిలేశారని ధ్వజమెత్తారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మంత్రి పదవి కోసం బీఆర్ఎస్‌లోకి వెళ్లారని చెప్పారు. డిసెంబర్‌లో మూసీ పనులు మొదలు పెడతామని స్పష్టం చేశారు.. నవంబరు ఒకటో తేదీ అంబర్‌పేట ఫ్లై ఓవర్ ప్రారంభిస్తామని చెప్పారు. 3 నెలల్లో విజయవాడ - హైదరాబాద్ జాతీయ రహదారి 6 లైన్ల రోడ్ పూర్తి చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు.

# మహిళా పతాకధారిగా..



(మొదటి పేజీ తరువాయి)

11న ఒలింపిక్స్ ముగింపు వేడుకలు జరగనున్నాయి. ఇప్పటి వరకు భారత్ మూడు కాంస్యాలను మాత్రమే సాధించింది. ఇందులో రెండు బాకరే కావడం విశేషం. మరో షూటర్ సరబ్ జోత్ సింగ్ కాంస్యం గెలిచాడు. మరోవైపు పురుష పతాకధారి ఎవరనేది ఇంకా ఖరారు కాలేదు.ఒకే ఒలింపిక్స్లో రెండు పతకాలు గెలిచిన మను బాకర్ అరుదైన ఘనత సాధించింది. 1900 ఒలింపిక్స్లో నార్మన్ ప్రిచర్డ్ రెండు రజతాలను గెలిచారు. ఇప్పుడు నార్మన్ తర్వాత రెండు పతకాలను సాధించిన అథ్లెట్ గా బాకర్ నిలిచింది. మహిళల 10మీ మహిళల ఎయిర్ పిస్టల్లో, సరబ్ జోత్ సింగ్ తో కలిసి 10మీ ఎయిర్ పిస్టల్ మిక్స్ టీమ్ విభాగంలో కాంస్యాలు గెలుచుకున్న సంగతి తెలిసిందే. 25 మీటర్ల పిస్టల్ విభాగంలో నాలుగో స్థానంలో నిలిచి తృటిలో మరో కాంస్య పతకాన్ని కోల్పోయారు. లేకపోతే మూడు పతకాలు సాధించిన ఏకైక భారత్ క్రీడాకారిణిగా అవతరించేది. ఆ అవకాశం కాస్త మిస్ చేసుకుంది.



# మంత్రి కోమటిరెడ్డి నల్గొండలో స్పెషల్ అట్రాక్షన్

- ఫాగింగ్ బుల్లి బైకును నడుపుతూ ప్రజల యోగ క్షేమాలపై ఆరా

**విశ్వంభర, నల్గొండ :** మంత్రి కోమటిరెడ్డి నల్గొండ జిల్లాలో రెండు రోజులుగా సుడిగాలి పర్యటన చేపట్టారు. ప్రజాదర్బార్ నిర్వహిస్తూ ప్రజల సమస్యలు పరిష్కరిస్తున్నారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తూ బీజీ బీజీగా గడుపుతున్నారు. మరోవైపు ఇలా బుల్లి బైకును స్వయంగా నడిపి కార్యకర్తల్లో జోష్ నింపుతున్నారు. 19వ వార్డు కౌన్సిలర్ కుమారుడు గోగుల గణేష్ , వార్డులోని యువకులు కలిసి ఏకంగా దోమల నివారణ కోసం అనువుగా ఉండే ఫాగింగ్ మిషన్ తో కూడిన బుల్లి బైకును రెడీ చేసారు. ఈ సందర్భంగా తమ అభిమాన నాయకుడు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నల్గొండ పర్యటనలో ఉండటంతో మంత్రి చేతుల మీదు గా ప్రారంభం చేయించాలని గణేష్, వార్డు యువకులంతా మంత్రి క్యాంపు కార్యాలయానికి వచ్చి మంత్రికి విషయం వివరించారు. దీని ద్వారా చిన్న చిన్న గల్లీల్లో కూడా ఫాగింగ్ కు అనువుగా ఉండేలా బుల్లి బైకు ను రెడీ చేశామని, ఫాగింగ్ మిషన్ లో ఒక్కసారి కెమికల్ నింపి ఆన్ చేస్తే వార్డ్ అంత కవర్ చేసుకునేలా ఫాగింగ్ మిషన్ ను తయారు చేశామని వారు మంత్రికి వివరించారు.బుల్లి బైక్ నీ నడుపుతూ ప్రజల యోగ క్షేమాలు అడిగి తెలుసుకోవడంతో బుల్లి ఫాగింగ్ బైక్ స్పెషల్ అట్రాక్షన్ గా మారింది.

# తిరుమలలో వయోవృద్ధుల దర్శనంపై పుకార్లను నమ్మవద్దు: టీటీడీ

**విశ్వంభర,తిరుమల :** తిరుమలలో వయోవృద్ధుల దర్శనానికి సంబంధించి సోషల్ మీడియాలో కొంతకాలంగా చక్కర్లు కొడుతున్న తప్పుదోవ పట్టించే వార్తలు అవాస్తవమని టీటీడీ పేర్కొంది. ప్రతిరోజు వెయ్యి మంది వయోవృద్ధులు, దివ్యాంగుల కోసం టీటీడీ ప్రతి నెల 23 మధ్యాహ్నం 3 గంటలకు మూడు నెలల ముందుగానే ఆన్‌లైన్ కోటా(Online) ను విడుదల చేస్తోందని వెల్లడించింది.తిరుమలలోని తిరుమల నంబి ఆలయానికి ఆనుకుని ఉన్న సీనియర్ సిటిజన్, పీహెచ్‌సీ లైన్ ద్వారా ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటలకు శ్రీవారి దర్శనానికి వయోవృద్ధులు, దివ్యాంగులకు అనుమతిఇస్తున్నామని స్పష్టం చేశారు. భక్తులు సరైన సమాచారానికి టీటీడీ అధికారిక వెబ్‌సైట్ www.tirumala.org, https://ttdevastanams.ap.in ను మాత్రమే సంప్రదించాలని అధికారులు కోరారు.తిరుమలలోని శ్రీవారి ఆలయ నాలుగు మాడ వీధుల్లోని గ్యాలరీలను టీటీడీ అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి ఆదివారం సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 4 నుంచి 12 వరకు జరుగనున్న నేపథ్యంలో నాలుగు మాడ వీధుల్లో ఉన్న వివిధ ప్రవేశ, బయటకు వెళ్లే దారి, హారతి పాయింట్ల గురించి తెలుసుకోవడానికి అన్ని గ్యాలరీలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.వాహన మండపం నుంచి ప్రారంభమై నాలుగు మాడ వీధు-



ల్లోని గ్యాలరీలు, తిరుమల నంబి ఆలయం వద్ద కదిలే వంతెన, ఇతర సంబంధిత సమాచారాన్ని అధికారులు అదనపు ఈవోకు వివరించారు. ఆయన వెంట ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, విజివో నంద కిషోర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.






# కరాటే లో సత్తా చాటిన చందూర్ విద్యార్థులు

**విశ్వంభర, చందూర్ :** జాతీయ స్థాయి కరాటేలో చందూర్ కి చెందిన విద్యార్థులు సత్తా చాటారు . జపాన్ కరాటే అసోసియేషన్ అఫ్ ఇండియా ఆధ్వర్యంలో నకిరేకల్ మండల కేంద్రంలో ఆదివారం జరిగిన పది సంవత్సరాల లోపు 38 వ షాటో ఖాన్ జాతీయ స్థాయి కరాటే పోటిల్లో గీత విద్యాలయంనాకు చెందిన సంకోజు సాయి ప్రణయ్ , సంకోజు మణిదీప్, కారింగు అభిరామ్ లు , అలాగే కృష్ణవేణి పాఠశాలకు చెందిన ఇరిగి భాను తేజ విద్యార్థులు కాంస్య పతకాలు సాధించారు. ఈ పోటీలో గెలుపొందిన విద్యార్థులకు నకిరకల్ నియోజకవర్గ శాసనసభ్యులు వేముల వీరేశం మెడల్స్ అందజేశారు. అతి తక్కువ సమయంలోనే విద్యార్థులకు అత్యుత్తమ శిక్షణ ఇచ్చి పతకాలు సాధించే దిశగా తయారు చేసిన కారింగు రవి ని ఎమ్మెల్యే వేముల వీరేశం మెమెంటో అందజేసి అభినందించారు. చందూర్ విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించడం పట్ల పలువురు స్థానికులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాస్టర్స్ రాపోలు సుదర్శన్, అంతటి సోములు గౌడ్, నగేష్ గౌడ్ విద్యార్థులు పాల్గొన్నారు.




# శ్రీశైలంలో భక్తుల సందడి.. కిటకిటలాడిన శ్రీగిరులు

**విశ్వంభర, శ్రీశైలం:** శ్రీశైల క్షేత్రం ఆదివారం భక్తులతో సందడిగా కనిపించింది. వరుసగా వారాంతపు సెలవులు రావడంతోపాటు శ్రీశైలం జలాశయం గేట్లను ఎత్తిన విషయం తెలిసిందే. దాంతో స్వామి అమ్మవార్ల దర్శనంతో పాటు.. జలాశయం అందాలను చూసేందుకు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. ఈ క్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులు, పర్యాటకులతో క్షేత్ర పురవీధులు కిటకిటలాడుతున్నాయి. ఆదివారం తెల్లవారుజాము నుంచి భక్తులకు సర్వదర్శనాలు కల్పించినట్లు ఈవో పెద్దిరాజు తెలిపారు.స్వామివారి గర్భాలయ అభిషేకాలు, సర్వదర్శనాలు, అమ్మవారి శ్రీచక్ర కుంకుమార్చనల్లో భక్తులు పాల్గొన్నారని పేర్కొన్నారు. ఆలయానికి వస్తున్న భక్తులు దేవస్థానం సిబ్బందితో సహకరించాలని ఈవో



పెద్దిరాజు కోరారు. రాత్రి సమయంలో వచ్చిన భక్తులకు కనీస వసతి సదుపాయాలు కూడా అందుబాటులో లేకపోవడం ఇబ్బందులుపడాల్సి వస్తుందని పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటు హోటల్స్ కాకుండా దేవస్థానం ప్రధాన కూడళ్ల వద్ద ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి అల్పాహారాన్ని అందజేయాలని భక్తులు కోరారు.




# శ్రీశైలం నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

**అవుట్ ఫ్లో 9.69లక్షల క్యూసెక్కులు..**

**విశ్వంభర, శ్రీశైలం:** ఎగువ నుంచి శ్రీశైలం జలాశయానికి భారీగా వరద కొనసాగుతున్నది. దాదాపు 4లక్షల క్యూసెక్కులకుపైగా వరద పోటెత్తుతున్నది. దీంతో అధికారులు డ్యామ్ పది క్రస్ట్ గేట్లను 15 అడుగుల మేరకు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టు క్రస్ట్ గేట్ల ద్వారా 2,42,628, విద్యుదోత్పత్తి ద్వారా మరో 20,824 క్యూసెక్కుల వరద వస్తున్నది. అలాగే, సుకేశుల జలాశయం నుంచి 1,37,099 క్యుసెక్కులు వరద శ్రీశైలానికి చేరుతున్నది. ప్రస్తుతం జలాశయానికి మొత్తం 4,00,491 క్యూసెక్కుల వరద వస్తోన్నది. ఆదివారం సాయంత్రం వరకు రిజర్వాయర్‌కు 4,87,451 క్యుసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం జలాశయం నుంచి క్రస్ట్ గేట్ల ద్వారా 9,69,250 క్యుసెక్కులు సాగర్‌కు విడుదల చేస్తున్నారు. కుడిగట్టు, ఎడమగట్టు విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నది. విద్యుత్ కేంద్రాల ద్వారా 58,461 క్యూసెక్కుల వరద దిగుకు వెళ్తున్నది. భారీ వరదతో సాగర్ నిండుకుండను తలపిస్తున్నది. సోమవారం ఉదయం 8 గంటలకు సాగర్ గేట్లను ఎత్తివేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

# అస్తిత్వ చైతన్య నవల 'పుట్టుమచ్చ'

భారత జాతి చరిత్ర,సం స్కృతిలో కులం ప్రముఖ పాత్ర వహిస్తుంది. అన్ని మతాలలో కొన్ని శాఖలు ఉన్నప్పటికీ హిందూమతంలో చాతుర్వర్ణ వ్యవస్థ బలంగా వేళ్ళూనుకుని ఉంది .అంతా సమానమే అని చెప్పినప్పటికీ ఈ దేశంలో ఆర్థిక సమానత్వం లేదు. తద్వారా శ్రమదోపిడి ,కులవృత్తుల పేరుతో జరిగింది .అది నేటికీ గొర్రెలను, బర్రెలను ,చేపలను వలలను, ఇవ్వడం ద్వారా పాలక వర్గాలు అధికారికంగా దోపిడీని కొనసాగిస్తూనే ఉన్నాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ కుల వ్యవస్థ ను నిర్మూలించాలనే భావనలోంచే ,రచనలు వివిధ అణగారిన , నిమ్న, దళిత ,కుల అస్తిత్వ రచయితలు పుట్టుకొచ్చారు.అందులో భాగంగానే బోయ జంగయ్య కూడా ఈ మార్గంలోనే పుట్టుమచ్చ, జాతర,జగడం,నవలలు రాశాడు అని చెప్పవచ్చు.




కుల వృత్తుల జీవితాలను అతి సహజంగా మన కళ్ళముందు కదిలేలా మనకు తెలిసిన తను చూసిన జీవితాలను కథలుగా నవలలుగా చిత్రించిన ప్రత్యేకమైన శైలి అతనిది దళిత వాద దృక్పథంతో రచనలు చేసిన కథ నవలా శిఖరం అతడు. అంబేద్కర్ ఆలోచన విధానం తోనే సమాజంలో మార్పు వస్తుందని ఆయన మార్గంలోనే తన రచనలు సమాజానికి అందించారు. నిజమైన బతుకు అక్షర జ్ఞానం వల్లనే మారుతుందని నమ్మిన కుల నిర్మూలన చదువు వల్ల కలిగే ఉన్నత స్థానం ఆత్మగౌరవాన్ని వ్యక్తిత్వాన్ని పెంపొందిస్తుందని ఆర్థిక స్థిరత్వాన్ని కలిగిస్తుందని నమ్మాడు సమాజంలో జరిగే తన రచనలలో ఎత్తి చూపి వాటన్నిటికీ విరుగుడు ముందు చదివే అని పూర్తిగా నమ్మినవాడు బోయ జంగయ్య.ఈ కుల వ్యవస్థ ను నిర్మూలించాలనే భావనలోంచే ,రచనలు వివిధ అణగారిన , నిమ్న, దళిత ,కుల అస్తిత్వ రచయితలు పుట్టుకొచ్చారు.అందులో భాగంగానే బోయ జంగయ్య కూడా ఈ మార్గంలోనే పుట్టుమచ్చ అనే నవలను రాశారు.

బోయ జంగయ్యనల్లగొండ జిల్లా రామన్నపేట తాలూకా లోని పంతంగి గ్రామంలో ఎల్లమ్మ మల్లయ్య దంపతులకు 1942 అక్టోబర్ 1న జన్మించాడు. ఆయన దళిత సామాజిక వర్గానికి చెందిన వాడు. తెలంగాణలోని కులవివక్ష కు గురవుతూ నలిగిపోతున్న జీవితాలు దోపిడీకి గురవుతున్న జీవితాల ప్రతినిధిగా మనం బోయ జంగయ్య ను చుడవచ్చు. స్వాతంత్ర్యానంతరం చదువుకున్న తొలి తరానికి చెందిన దళితుడు బోయ జంగయ్య.. చిన్ననాటి నుంచి కులం విధించిన అవమానాలను ఎదుర్కొని బడిలో అడుగుపెట్టాడు. ఎన్నో కష్టాలు అనుభవించి ఉన్నత చదువుచదివాడు.

1963లో కష్టసుఖాలు నాటకం తన తొలి పుస్తకం గా ప్రచురించారు . ఆయన కలం లో నుండి అనేక రచనలు వెలువడ్డాయి. ఆ తర్వాత విస్తృతంగా విశిష్టమైన కవితల్ని రాశారు. లోకం, గొర్రెలు(1981), ఎచ్చరిక(1984) ,దున్న రంగులు(1984) చీమలు (1996) తెలంగాణ వెతలు (1998) పూజ కథలు (2000) బొమ్మలు (2002) ఉప్పు నీరు (2002) ఇప్పపూలు (2003) ఆమె (2004) మొదలైన కథా సంపుటాలు ప్రచురించారు. మనసులోని క్రూరత్వాన్ని ప్రతీకాత్మకంగా చెప్పడానికి జంతువుల కంటే వికృతంగా ప్రవర్తించే దోపిడీదారుల గురించి గొర్రెలు కథలో రాశారు . అంబేద్కర్, గుర్రం జాషువా, కె.ఆర్. నారాయణన్ జీవిత చరిత్ర లను, రాశారు. వీటితో పాటు బాలల కోసం ప్రత్యేకించి బడిలో చెప్పని పాఠాలు, గుజ్జనగూళ్ళు, ఆటలు పాటలు, చిలకపలుకులు మొదలైన వ్రాశారు..

అంబేద్కర్ కు అసలు సిసలు వారసుడు బోయ జంగయ్య అని చాలామంది సాహితీవేత్తల అభిప్రాయం. తను ఏది నమ్మాడో అదే చేశాడు . దానినే రాశాడు .కుల వ్యవస్థలో కింద నలిగిపోతున్న వారు ఆత్మవిశ్వాసంతో అక్షర సేద్యం తో విజయం వైపు నడవాలని ఆకాంక్షించినజంగయ్య మే 8, 2016న మరణించారు.

**పుట్టుమచ్చ నవల పాత్ర చిత్రణలు:**

**మోతి:** ప్రస్తుత సమాజంలో బ్రతక నేర్చిన స్త్రీగా, రచయిత ఈ పాత్రను తీర్చిదిద్దాడు. నిజానికి ఒక గిరిజన స్త్రీ అయినప్పటికీ, దేశ కాల పరిస్థితులు తెలిసిన గొప్ప జ్ఞానిగా మోతీని ఈ నవలలో చూడవచ్చు. తన పనులు తాను చేసుకుంటూ, ఇతరులకు ఇబ్బందికలుగకుండా, నడుచుకునే మానవతా మూర్తిగా, మనం చెప్పుకోవచ్చు. రచయిత సూర్యాపేట దగ్గర్లో ఉన్న రాంపూర్ తండా వాసి గా మోతీని పరిచయం చేయడంలో ఆ ప్రాంతంపై రచయిత కు పట్టు ఉందని ,భావించవచ్చు. మోతి రాజకీయ నాయకురాలిగా ఎదగాలని, తనవారికి చేతనైనంత సాయం చేయాలనే ఆలోచన ఉన్న మనిషి . వివాహ బంధం వల్ల మనం అనుకున్న మార్పు జీవన విధానంలో రాదు అని నమ్మే వ్యక్తి గా చిత్రించబడింది.

"దీపాలు వెలిగే వేళ ఆమని ఎక్కువగా పిలుస్తుండే వాళ్ళు"అని రచయిత మోతీని ఉద్దేశించి చెప్పే మాటల్లో రాత్రివేళ ఆమె వారికి సంతృప్తినిస్తుందని,పనిచేస్తుందని అర్థం వచ్చే విధంగా చెప్పడం జరిగింది. సహజంగానే గిరిజన స్త్రీలు అందంగా ఉంటారు. ఆమెను చూసినప్పుడల్లా సీతాకోకచిలుక గా, వనమయూరి గా అభివర్ణించడం లో ఒక రచయిత వారి కట్టు ,బొట్టు, సంప్రదాయ వస్త్రధారణ ,ను వర్ణించడంలో శ్రద్ధ వహించాడు. మోతి గంగను పరిచయం చేసుకున్న సందర్భంలో ఆమె అన్న మాటలను బట్టి వ్యక్తిత్వాన్ని పాఠకుడు అర్థం చేసుకునే అవకాశం నవల ప్రారంభంలోనే ఉంది. మోతి కి వయసుకు మించిన అనుభవం తెలివి సమాజంలో ఉన్న మనుషులను చదవడం వల్లనే కలిగింది.

"పిచ్చిదానా ! రాజకీయాలంటే ఏదో పాప కూపం అనుకుంటున్నావు దాని మజా తెలియదు నీకు పదవులు వరిస్తాయి అంతస్తులు పెరుగుతాయి. ఆపైన దండలు, దండాలు చూస్తంలే" , అనడంలో మోతికి రాజకీయాల మీద ఉన్న అవగాహన వాటి వల్ల జరిగే పనులు ,ఆర్థిక లావాదేవీలు, గౌరవం, అన్ని విషయాలు తెలిసిన ఒక భావి రాజకీయ నాయకురాలిగా, మోతిని చూడవచ్చు. మోతి మంచి, చెడు, మానవత్వం ఉన్న గిరిజన స్త్రీ, అనడానికి మోతి గంగ కూతురు గురించి చెప్పిన మాటలు చూస్తే అర్థం అవుతుంది."పాప గురించి ఏదో ఒకటి చేద్దాం అది మన మధ్య పెరగొద్దు", అంటే మోతి చేసే పని సరైనది కాదని ఆ బాటలో గంగ కూతురును రాద్దని , తన భవిష్యత్తు బాగుండాలని ,తమ బాటలో నడిచి జీవితం పాడు చేసుకోవద్దని చెప్పిన మంచి మనిషి గా మనం చూడవచ్చు .మొత్తంగా తను అనుకున్న బాటలో నడిచి నలుగురికి ధైర్యాన్నిచ్చే పనిచేసిన ధైర్యవంతురాలు అని చెప్పవచ్చు.

గంగ కూతురుని మిషనరీ స్కూల్లో చేర్పించడం గాని ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా నిర్వాసితులు అయిన వాళ్లకు పట్టాలు , ఇండ్లు ఇప్పించటంలో గాని తన స్వార్థం లేని ఒక మంచి మనసున్న మహిళగా మూతిని గుర్తించాలి నేటి సమాజంలో ఇలాంటి ఆలోచనలు ఉన్న ఎంతో మంది స్త్రీలను మనం చూస్తూ ఉంటాం కానీ అనుకున్న లక్ష్యం కోసం సర్వం త్యాగం చేసి వివాహాన్ని వదిలేసి సమాజాన్ని కుటుంబాన్ని ఎదిరించి కష్టాలను ఎదురొడ్డి మార్చుకుని జీవించడం అనేది అందరికీ సాధ్యం కాని విషయం కానీ ఈ విషయంలో అది జరిగింది .అందుకే మోతీ గంగకు ఆదర్శం అయ్యింది తన కుల కట్టుబాట్లను తెంచుకుని తన అస్తిత్వం గుర్తింపు రాజకీయాల్లోనే ఉందని గ్రహించి అటువైపు ప్రయాణించి మారుమూల రామ్ సింగ్ తండా నుంచి ఢిల్లీ కేంద్ర రాజకీయాల్లో కులాన్ని కుటుంబాన్ని సమాజాన్ని ఎదిరించి ధైర్యంగా నిలబడిన ఆదర్శమూర్తిగా దీని అర్థం చేసుకోవడంలో సందేహ పడాల్సిన అవసరం లేదని చెప్పవచ్చు. మూతి అంటేనే ముత్యం ఆమె మలినం లేని హృదయంతో స్వచ్ఛమైన మనసు కలిగిన మంచి స్నేహితురాలిగా కూడా మనం భావించవచ్చు .

**గంగ:** నాగార్జునసాగర్ ఆనకట్ట పూర్తయి హైడ్రో ఎలక్ట్రిక్ ఉత్పత్తి హౌస్ నిర్మాణం మొదలు కావడంతో గంగా వాళ్ళ అత్త యంకమ్మా పని నిమిత్తం కూలీగా అక్కడికి వచ్చిన తర్వాత గంగా తల్లిదండ్రులు అక్క అందరూ అక్కడికి చేరుకున్నారు.గంగా సమాజంలో అందరిలాగే ఆనందంగా గౌరవంగా తనకు నచ్చిన పని చేసుకుని బ్రతికితే చాలు అనుకునే ఒక సగటు అమ్మాయి. కానీ నీ అమ్మాయి పుట్టిన కులమే తన జీవితాన్ని నాశనం చేస్తుందని తెలియదు కన్న తల్లిదండ్రులు స్థితిని దగ్గరుండి నేర్పిస్తారు పసి జీవితాలతో పడుపువృత్తి చేయించే కులం ఒకటి మన హిందూ మతం లో ఉందని తను ఆ కులంలోనే పుట్టిందని అప్పటిదాకా ఆమెకు తెలియలేదు."గంగా బడికి పోవడం మానేసెయ్? అంది తల్లి రంగి

ఎందుకు? అని ప్రశ్నించింది గంగ.ఎందుకు? అని ప్రశ్నిస్తే నేను తల్లిని గాని నీవు బిడ్డవు ఉంది ఏమీ అర్థం కాలేదు అదే విషయం ప్రశ్నించినట్టు చూస్తూ తన ఈడు వాళ్ళందరూ బడికి ఎందుకు పోకూడదు అనుకుంది మనసులో. ఏంది ఆ చూపులు చెప్పిన గా బడికి బంద్ అని అంది తల్ల". అప్పుడు తమ ఇంట్లో ఉన్న ఆడవాళ్లు అందరూ చేసే పనులు గుర్తుకు వచ్చి గుండె బరువెక్కింది మనసు మౌనంగా రోదించింది అమ్మ పెద్దమ్మ చిన్నమ్మ చివరకు అక్క అందరూ చేసే పని తాను చేయలేని అని తేల్చి చేసుకుంది గట్టిగా తను వృత్తి నుంచి దూరంగా వెళ్లాలనుకున్నా ఒక మానసిక సామాజిక పరివర్తన ఆదర్శ భావాలున్న అమ్మాయిగా మనం చూడవచ్చు.

పుట్టుమచ్చ నవలలోని ప్రధాన పాత్ర గంగ కథ మొత్తం గంగా పాత్ర చుట్టూ తిరుగుతుంది కులం నుంచి తాను ప్రేమించిన నాయుడు మోసం చేసి వెళ్లిపోవడంతో తన జీవితం అయింది అయినా గతాన్ని తలచుకుంటూ ఒంటరిగానే ముందడుగు వేసి తన జీవిత గమనాన్ని తానే వెతుక్కుంది. గంగ పాత్ర చిత్రణలో రచయిత అన్ని కోణాలను సృష్టించాడు పాఠశాల జీవితం మోసపోవడం తల్లి ప్రేమ స్నేహం సేవాగుణం సహాయ సహకారాలు కుటుంబ భరోసా ఆదర్శ వివాహాలు సాహిత్య పఠనం సమాజ మార్పులు అన్నీ కూడా పాత్ర అనుభవించిన తీరు పాఠకుల ను మంత్రముగ్ధుల్ని చేస్తుంది అనడంలో సందేహం లేదు.

బోయ జంగయ్య గంగ , ఎస్ఐ ఆధ్వర్యంలో జరిగిన పెళ్లికి ఎస్ఐ గారితో చెప్పిన మాటలు వింటే సమాజంలో మార్పు జరగాలి అనే బలమైన కోరిక రచయితకు ఉన్నట్టు తెలుస్తుంది. "ప్రేమించుకోవడం నేరం కాదు దాని వెనుక ముందు ఆలోచించుకోవాలి దురదృష్టం ఏమిటంటే మన దేశంలో కుల పట్టింపులు డబ్బుల దర్పం వంటి అడ్డంకులు ఉన్నంతవరకు ప్రేమికుల ప్రేమ అంత సజావుగా సాగదు మరీ వీటిని చూసి అడుగేయాలి సుమా", అని సమాజంలో ఉన్న కులాల పట్టింపులను వివరించారు

ఊళ్లో ఉండే స్త్రీలు ఆర్థికంగా నిలదొక్కుకుంటే సమాజములో గౌరవ నుండి ఆత్మవిశ్వాసం పెరుగుతుందని తన ఇంట్లో పనిచేసే పనిమనిషి తో పాటు ఊరిలో చాలా మందికి ఇళ్లు కట్టించి కారంపొడి తయారీపై ఇప్పించి తమ కాళ్ల మీద తాము నిలబడేటట్టు చేసింది."స్త్రీకి సంపాదన లేక బలహీనురాలు గా మారిపోతుంది ఆమెకు ఆలోచనలున్న ఆర్థికంగా చేయూత కావాలి",ఈ విషయం మీదనే గంగ, ప్రభుత్వాల సహాయ సహకారాలు ఉండాలని తద్వారా మహిళా సాధికారత సాధ్యమవుతుందని , స్త్రీ సాధికారత గురించి ఆలోచించిన మహిళగా గంగ ను చెప్పవచ్చు.

**రంగి:** దేవుడు మనల్ని ఒళ్ళు అమ్ముకుని బతకాలని ఇచ్చిండు. అందుకే ఎన్ని ఇబ్బందులు ఉన్నా వేరే పని చేయలేను, అని నమ్మి అదే రొంపిలోకి తన కూతురు జమున ను దింపింది. చిన్న కూతురు గంగ పారిపోయి ,గర్భవతిగా రావడం తట్టు లేకపోయింది. చివరకు తన నివాసం వదిలి వేరే గ్రామంలోతన పెద్ద కూతురు తో కలసి సొంత పని చేసుకుని బతుకుతుంది.

**జమున:** శివను ఇష్టపడింది, కానీ తమ కులం లో పెళ్లిళ్లు ఉండవని తెలిసీ తల్లి బలవంతం తో , పడుపు వృత్తి చేసింది .తన చెల్లిని ఈ వృత్తిలోకి దింపొద్దు ,అని భావించింది . చివరకు ఒక ముస్లిం యువకుడిని పెళ్లి చేసుకోవడానికి సిద్ధపడింది.

**వెంకమత్త:** నాగార్జునసాగర్ ఆనకట్ట కట్టడానికి కూలీగా పని చేసింది. తన తమ్ముడు, మరదలును తీసుకొచ్చి పడుపువృత్తి చేయించింది . గంగ ప్రసదవించడం కోసం తాపత్రయపడి ,పుట్టిన బిడ్డను సాగింది.

**వెంకటస్వామి:** సీనియర్ పోలీసు ఆఫీసరు . గంగ నాయుడుతో కలిసి లేచి పోయినప్పుడు, ప్రతి ఇల్లూ ,ప్రతి గ్రామం తిరిగి సోదా చేశాడు. రంగి దగ్గరకు అప్పుడప్పుడు వస్తుండేవాడు.

**నాయుడు:** కాంట్రాక్టర్ కింద గుమాస్తాగా పనిచేసిన నాయుడు ,కాంట్రాక్టర్ ను అని చెప్పి, గంగ ను తీసుకెళ్లి పెళ్లి చేసుకుని , గంగ గర్భం దాల్చిన తర్వాత వదిలేసి వెళ్లిపోయాడు. చివరకు నాగార్జున సాగర్ కాలువలో అనాథ శవమై తేలాడు.

**జాన్సన్:** ఫ్రీలాన్స్ జర్నలిస్ట్. విదేశీయుడు .తను ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్య విడాకులు ఇచ్చింది. గంగ చేసే కుటీర పరిశ్రమ 'కాకా పొడి' కోసం అప్లై చేసాడు .తన సేవా కార్యక్రమాన్ని ఐ.రా.స.కు పంపి ఉత్తమ సమాజ సేవిక అవార్డు వచ్చేందుకు కృషి చేశాడు చివరకు గంగ ను ఇష్టపడ్డాడు.

**సాగరి:** గంగ కూతురు . తన తల్లి హాస్టల్లో వదిలేసిందని, తన మీద కోపం పెంచుకుంది . గతం అంతా చెప్పిన తల్లి ని ప్రేమగా చూస్తుంది. మన కులం ఒక పుట్టు మచ్చ, అని అది పోదని భావించి మదర్ థెరిసా బాటలో సమాజ సేవ ను ఎంచుకుంది.

దుర్గ పనులు దొరకక బెజవాడ వెళ్లి కూలి చేసుకుంటున్న సమయంలో, ఆసామి కొడుకు చేత 13 సంవత్సరాల వయస్సులోనే అత్యాచారానికి గురైన ఒక మహిళ. తన తల్లిదండ్రులతో చెప్పుకొని మనసు గాయ పడి, దగాపడిన ఒక చెల్లెలు. చివరకు పెళ్లి చేసుకొని గంగ ఇంట్లో పనిమనిషిగా చేరి, తన సొంత మనిషి గా నమ్మకాన్ని పూర్తి చేసుకున్న పాత్ర గా దుర్గ కనిపిస్తుంది.

**సుశీల:** మిర్యాల గూడెం లో ఖాళీ సీసాల అమ్ముకునే మహిళ. తను కూడా పడుపువృత్తి కులానికి చెందిన మహిళ. తన అక్క ఆ వృత్తి లో చివరకు రోగాలతో చనిపోయిందని, తను ఆ వృత్తిలోకి దిగలేదు. పాత సామాన్లు, సీసాలు అమ్మి తన వృత్తిని మరిచి బ్రతుకును మార్చుకున్న మహిళగా మనం సుశీలను చూడవచ్చు.

ఈ విధమైన పాత్ర చిత్రణలతో పుట్టుమచ్చ నవల మొత్తం కూడా కులం రూపు మాసి పోవాలనే తపన ప్రతి పాత్రలో కనిపిస్తుంది. తమ బ్రతుకులు సమాజంలో గౌరవంగా ఉండాలనే కోరికలతో పాత్రలు పనిచేస్తుంటాయి.

లచ్చి కోడే , సీత, శాంతమ్మ, విమలక్క, మొదలైన వి ఈ నవలలో మరికొన్ని పాత్రలు..


అన్ని కూడా కింది కులాలకు చెందిన వారు వచ్చిన పనులు చేసి నచ్చినట్టు జీవించటమే నిజమైనజీవితం .ప్రతి నిత్యం పోరాటం చేయాల్సి రావడమే కులం చేసిన గాయం అని గుర్తు చేసుకున్న పాత్రలు బోయ జంగయ్య పాత్ర చిత్రణ తో పాటు సన్నివేశ కల్పనలు గా కుక్కలను ,పందులను, కోతులను , పాములను సందర్భానుసారంగా వాటి కోణాన్ని పాత్రల మనో భావాలకు ఆలోచనలకు అనుగుణంగా తీర్చిదిద్దారు. ఒక సందర్భంలో ఏడు తరాలు నవలను పరిచయం చేస్తాడు రచయిత. మరొక చోట మొదటి పంతులమ్మ గా సావిత్రిబాయి పూలే ను పరిచయం చేస్తాడు. అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని విజ్ఞానపు విషయాలను గుర్తుకు తెస్తాడు. గంగా ,జాన్సన్ ఒకరినొకరు ఇష్ట పడి కుల, మత దేశ కాల పరిస్థితులను మార్చి వేసే దిశగా ముగింపు ఇచ్చాడు."అంబేద్కర్ బొమ్మ ను చుసిప్పుడు గంగ, అంబేద్కర్ స్త్రీ జాతి మేలు కోసం ప్రవేశ పెట్టిన హిందూ కోడ్ బిల్లు ను వ్యతిరేకించిన వాళ్లు గుర్తుకు వచ్చారు. విగ్రహం కింద బోధించు, సమీకరించు ,వ్యతిరేకించు అన్న పదాలు కనిపించినయి."కూతురు సాగరి తో మనం చచ్చేదాకా కులమనే పుట్టుమచ్చ ఉంటుందని చెప్పించిన రచయిత, చివరకు జాన్సన్ చేత, మార్పు ను చూపించాడు . సమాజం ప్రపంచీకరణలో భాగంగా మారుతుందని దాన్ని ఆహ్వానించాలని చెప్పినట్టుగా కుల నిర్మూలన జరగాలని మనకు అర్థమవుతుంది .

ఈ నవల ద్వారా సమాజం మారుతుందని సావిత్రిబాయి పూలే అంబేద్కర్ ఆలోచనా విధానాలకు అనుగుణంగా కుల నిర్మూలన జరుగుతుందని కులం అనే పుట్టుమచ్చ నశించాలని బలంగా కోరుకున్నాడు బోయ జంగయ్య గారు .అణగారిన కులాలు అక్షర జ్ఞానం నేర్చుకున్నప్పుడే కులం అనే పుట్టుమచ్చ నశిస్తుందని రచయిత గట్టిగా నమ్మాడు...



- డా. మెంతబోయిన సైదులు
9010910956

# సకల కళల పేటి - దోరవేటి



తెలుగుజాతి చరిత్రలో ఒకే వ్యక్తిలో సాహిత్యం సంగీతం, కళలు , క్రీడలు ...ఇలా బహుముఖ ప్రజ్ఞ కలిగి తెలుగు సాహితీలోకానికి ఆశ్చర్యం అద్భుతం అనిపించిన వారిని చూశారా! ఆ ఆశ్చర్యానికి అద్భుతానికి నిలువెత్తు నిదర్శనం అనదగిన వారు దోరవేటి అనే కలం పేరు కలిగిన ఉప్పరి చెన్నయ్య.

రంగారెడ్డి జిల్లా, నేటి వికారాబాద్ జిల్లా ధారూర్ పూర్వ నామం దోరవేటి. తాను పుట్టి పెరిగిన ఊరు పేరు నే తన కలం పేరుగా మార్చుకున్న విశిష్ట సాహితీవేత్త దోరవేటి.1961 ఫిబ్రవరి 11వ తేదీన ఉప్పరి అడివయ్య ఈశ్వరమ్మ పుణ్యదంపతులకు దోరవేటి జన్మించారు. పేద కుటుంబంలో జన్మించినా మొక్కవోని దీక్షతో సమస్యలకు ఎదురీదుతూ తాను ఒక వృక్షం గా ఎదిగి ఎందరికో తన నీడన ఆశ్రయమిచ్చిన గొప్ప మానవతా మూర్తి.

శతకం, ఖండకావ్యం, గేయం, కీర్తన, కథ, నవల, జీవిత చరిత్ర, పరిశోధన, విమర్శ, వ్యంగ్య వ్యాసం, నాటిక, బుర్రకథ.... ఒక వ్యక్తిలో ఇన్ని ప్రక్రియల సృజన సాధ్యమేనా? ఇవన్నీ ఆయనకు ఎలా అలవడ్డాయి? అని ఆలోచించినప్పుడు నిరంతర సాధనతో దేనినైనా సాధించవచ్చు అంటారు దోరవేటి. ముఖ్యంగా తాను ఏకసంథాగ్రహి. ఒకసారి విన్నా చూసినా ఇట్టే పట్టేయడం ఆయన నైజం.

దోరవేటి బహుముఖప్రజ్ఞాశాలి. పైన పేర్కొన్న సాహిత్య ప్రక్రియలతో పాటు సంగీతంలో మురళీగానం, మద్దెల, హార్మోనియం, తబల, తాళాలు, గాత్ర సంగీతం మొదలైన విభాగాలలో వీరు అందెవేసిన చేయి. చిత్రలేఖనంలో దోరవేటి నిష్ణాతులు.సుమారు వంద పుస్తకాలకు ముఖ చిత్రాలు గీశారు. తన పుస్తకాలకు తానే ముఖచిత్రాలు అంతర చిత్రాలు గీసుకుంటారు . ఒక వ్యక్తిని ఎదురుగా కూర్చోబెట్టుకుని ఐదు నిమిషాలలో ఆ వ్యక్తిని పెన్సిల్ ఆర్ట్ లో చిత్రించగల నేర్పరి. ఉద్యోగం రాక మునుపు కొంతకాలం వికారాబాదులో సైన్ బోర్డ్ ఆర్టిస్టుగా కూడా చేశారు. ఉద్యోగ జీవితంలో మొదట క్రాఫ్ట్ టీచర్ గా ఉద్యోగం లోకి ప్రవేశించి ఎందరో విద్యార్థులను చిత్రకారులుగా తీర్చిదిద్దారు. అనంతరం ప్రథమశ్రేణి తెలుగు పండితుడిగా సాహితీ సేద్యం చేశారు. 2009 నుంచి 2015 వరకు పాఠ్యపుస్తకాల నిర్మాణంలో చిత్రకారుడిగా కూడా సేవలందించారు.

దోరవేటిలో ఉన్న మరొక విశిష్టమైన కళ అవధానం. అష్టావధాని గా అనేక అవధానాలు చేశారు. మలుగ అంజయ్య అవధాని తో కలిసి జంట అవధానాలు చేశారు. ఇటీవల కరోనా కాలంలో సైతం ఆన్లైన్ అవధానాలు దిగ్విజయంగా చేసి పండితుల ప్రశంసలందుకున్నారు. దోరవేటి నృత్య కళల్లో కూడా సుప్రసిద్ధులు. భరతనాట్యం కూచిపూడి మొదలైన నృత్యాలను అద్భుతంగా ప్రదర్శించగలరు. తన పదవీ విరమణ రోజు కూడా అద్భుతమైన భరత నాట్యం చేయగలిగారు అంటే వారి నృత్య నిపుణతను అర్థం చేసుకోవచ్చు. అనేక నాటకాలలో నాటికలలో స్వయం గా నటించడమే కాక వాటికి దర్శకత్వం కూడా వహించారు. జానపద కళారూపం అయిన బుర్రకథ ప్రదర్శనలో దోరవేటి అసమాన ప్రతిభను ప్రదర్శిస్తారు. ప్రస్తుతం ఏడవ తరగతి విద్యార్థులకు పాఠ్యాంశంగా ఉన్న సీత ఇష్టాలు బుర్రకథ వీరు రాసినదే. 2012లో యాదగిరిగుట్టలో రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ శిక్షణ శిబిరం జరుగుతున్నప్పుడు వీరి ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం వీరి దర్శకత్వంలో శామీర్ పేట విద్యార్థినులచే ఈ బుర్రకథను ప్రదర్శింప చేసి రాష్ట్ర విద్యా సాంకేతిక సంస్థ దీనిని చిత్రీకరించి విద్యార్థులకు డిజిటల్ పాఠ్యాంశంగా కూడా అందించారు. ఈ ప్రదర్శనకు జాతీయస్థాయి పురస్కారం రావడం గమనార్హం. క్రికెట్ చదరంగం బ్యాడ్మింటన్ టేబుల్ టెన్నిస్ మొదలైన క్రీడల్లో నిష్ణాతులు. నేటికీ ఆరు పదుల వయసు దాటినా ప్రతి సాయంత్రం రోజు రెండు గంటలు బ్యాట్మింటన్ ఆడడం వీరి అలవాటు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా, వ్యాఖ్యాతగా సభలను రంజింప జేస్తాడు. ఇన్ని ప్రత్యేకతలు ఉన్న వ్యక్తి కనుకనే వీరిని చూస్తే ఆశ్చర్యం అద్భుతం అనిపించకమానదు.

దోరవేటి ఇన్ని రంగాలలో నైపుణ్యం ఒక ఎత్తు, సాహిత్యంలో వీరి సృజన మరొక ఎత్తు. అనేక ప్రక్రియలలో సుమారు 30కి పైగా పుస్తకాలు రచించారు. వీరి రచనల్లో నేస్తం శతకం, బసవ పంచ శతి, సాంబ శివ శరణం శతకం, విరుల బాట శతకం మొదలైన శతకాలు ఉన్నాయి. ఖండ కావ్యాలలో అంజలి సాలంకృత ఖండకావ్యం, అంజలి 2 శ్రమ దేవోభవ మొదలైన ఖండకావ్యాలు పేరెన్నికగన్నవి. వీరి తొలి గ్రంథం హృదయస్పందన గేయ సంపుటి. అనంతరం సాయి సంకీర్తనావళి రాశారు వీరి కథలలో గ్రామీణ జీవనాన్ని ప్రతిబింబించే పల్లె కథలు, సామాజిక స్పృహతో రాసిన అమృత ఝరీ, కాపాడే దేవతలు, నాన్న కు జేజే, జెరజూస్కో, సంబంధం, కానుక మొదలైన కథా సంపుటాలు ఉన్నాయి. ఉపాధ్యాయ నేపథ్యాన్ని కలిగిన కథల సంపుటి ఆచార్యదేవోభవ. దేశ భక్తి ప్రధానంగా కలిగిన చారిత్రక కథలు చరితార్థులు. తెలంగాణ కవుల ఔన్నత్యాన్ని తెలిపే కథలు మన కవులు మహాకవులు. ఈ విధంగా సుమారు పది కథాసంపుటాలు ప్రచురించారు. వివిధ పత్రికలలో ప్రచురితమైన గ్రంథ రూపంలో రాని అనేక కథలున్నాయి .

దోరవేటి స్నేహం ఇతివృత్తంగా రాసిన నవల జీవనది. ఇద్దరు స్నేహితుల జీవిత కాలపు స్నేహం ఈ నవలలో ప్రతిబింబిస్తుంది. దోరవేటి రాసిన సుప్రసిద్ధ చారిత్రక నవలలు మరో శివాజీ, అసమాన వీరుడు అనురాగ దేవత. దోరవేటి రాసిన పిల్లల నవల బూచా డొచ్చాడు. దోరవేటి వివిధ దిన మాస పత్రికలో రాసిన ధారావాహికలు పయన మెచటికోయి, నవ భారతం, కలల కాసారం,శంఖారావం.

దోరవేటి తెలంగాణ లో ప్రసిద్ధ వాగ్గేయకారుడు రాకమచర్ల వేంకటదాసు జీవిత చరిత్ర రాశారు.దోరవేటి రాసిన సుప్రసిద్ధ పరిశోధనా గ్రంథం భారతీయ కళలు. వీరి విమర్శ గ్రంథం పద్యం రసనైవేద్యం అనేక ముద్రణలు పొంది తెలుగు పాఠకుల అభిమానాన్ని చూరగొన్నది. వీరు రాసిన చదవేస్తే వ్యంగ్య వ్యాసావళి లో రామ లింగం పాత్ర సాక్షి వ్యాసాలలో జంఘాలశాస్త్రి పాత్రను గుర్తుకు తెస్తుంది. శరణు బసవ పేరుతో మీరు రాసిన వచన కావ్యం బసవేశ్వరుడి చరిత్రను అత్యద్భుతంగా ఆవిష్కరిస్తుంది. వీరి మరొక ప్రసిద్ధ శైవ కావ్యం ప్రభు లింగ విభూతి. ఈ విధంగా దోరవేటి పలు ప్రక్రియలలో గొప్ప రచనలు చేశారు.

దోరవేటి చేస్తున్న సాహితీకృషిని గుర్తించి అనేక సంస్థలు తగు పురస్కారాలు ఇచ్చి గౌరవించాయి. 'అమృతఝురి' కథాసంపుటి 2000 సం. ఉత్తమ కథ 'సోహన్లాల్ బల్ద్ వా' అవార్డు, సాహితీ సమితి తాండూర్ వారిచే 'హృదయ స్పందన' గేయ కావ్యానికి 2004 సం. ఓగేటివారి ఉత్తమ సాంస్కృతిక సాహిత్య అవార్డు, 'పద్యం రసనైవేద్యం' వ్యాస సంపుటికి 2007 2008 సంవత్సరానికి రాష్ట్ర విద్యా పరిశోధన సంస్థ ( ఎస్సీఈఆర్టీ) వారిచే ప్రథమ బహుమతి, 'సంబంధం' కథల సంపుటికి 2008 సంవత్సరానికి రమ్య సాహితీ సంస్థ పెనుగొండ వారిచే జాతీయ ఉత్తమ కథా సాహిత్యం అవార్డు. కేంద్ర సాహిత్య అకాడమి ఢిల్లీ వారిచే 2004 సెప్టెంబర్లో తిరువనంతపురంలో దక్షిణ భారత స్థాయిలో నిర్వహించిన సమావేశంలో కథా రచయితగా పాల్గొన్న అరుదైన గౌరవం లభించింది. 'బహుముఖ ప్రజ్ఞాశాలి' అవార్డు లయన్స్ క్లబ్, సిద్ధిపేట వారు అందించారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, ఆంధ్రప్రదేశ్ వారిచే కీర్తి పురస్కారం (2011), నోముల సాహిత్య సమితి నల్లగొండ వారిచే నోముల కథా పురస్కారం, మచిలీపట్నం వారిచే పద్య సాహితీ పురస్కారం, మహబూబ్ నగర్ వారిచే బి.యన్. శాస్త్రి పురస్కారం, తెలుగు భాషా పరిరక్షణ సమితి వారిచే 'సాహిత్య కళారత్న' బిరుదు ప్రదానం, సోమ సీతారాములు తెలంగాణ రాష్ట్ర సాహితీ పురస్కారం (2014) తెలుగు సాహిత్య కళా పీఠం వారిచే 'అభినవ దాశరథి' బిరుదు ప్రదానం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వారిచే రంగారెడ్డి జిల్లా విశిష్ట సాహితీ పురస్కారం, తేజ ఆర్ట్ క్రియేషన్స్ వారి ఎస్.వి.ఆర్. పురస్కారం, సోమనాథ కళాపీఠం పాలకుర్తి వారి పాల్కూరికి సోమనాథ సాహిత్య పురస్కారం, 2021లో భానుపురి సాహిత్య వేదిక వారు కథారత్న పురస్కారం అందజేశారు. ఈవిధంగా దోరవేటి సాహిత్య సేవకు ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల నుంచి గుర్తింపు లభించింది.

సకల కళల పేటి గా అభివర్ణించ దగిన దోరవేటి కలం నుంచి మరిన్ని కావ్యాలు జాలువారాలని ఆశించడం అత్యాశ కాబోదు.



- శీల అవిలేను
ఫోన్: 91829 67423

# బురిడి కొట్టించాలని చూశాడు.. అడ్డంగా దొరికిపోయాడు..

- జీఎస్టీ రిటర్న్స్‌లో తప్పడు లెక్కలు చూపించి
- లలితా జువెల్లరీ అధినేత
- జీఎస్టీ విభాగం అధికారులు నోటీసులు
- జీఎస్టీ రిటర్న్స్ వివరాలను ఇవ్వాల్సిందిగా కాగ్ ఆదేశాలు

**విశ్వంభర, హైదరాబాద్:** ''డబ్బులు ఎవరికి ఊరికే రావు'' అంటూ ఈ ఒక్క డైలాగ్‌తో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఫుల్ పాపులర్ అయ్యారు లలితా జువెల్లరీ అధినేత కిరణ్ కుమార్.ఈ ఒక్క మాటతో బంగారం కొనుగోలు చేసే వారిని తన వైపు తిప్పుకునేలా చేశారాయన. మిగిలిన బంగారపు షాపులతో పోలిస్తే లలితా జువెల్లరీ షాపుల్లో తక్కువ ధర ఉంటేనే బంగారం కొనండి అంటూ బంపర్ ఆఫర్ కూడా ఇచ్చారు. అతి తక్కువ కాలంలోనే తనకంటూ సొంత బ్రాండ్ క్రియేట్ చేసుకున్నారాయన.

లలితా జువెల్లరీ అంటే ప్రజల్లో ఓ నమ్మకం కలిగించారు. అయితే అలాంటి కిరణ్ కుమార్ జీఎస్టీ విషయంలో అడ్డంగా దొరికిపోయారు.లలిత జువెల్లరీ అధినేత కిరణ్ కుమార్ జీఎస్టీ ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ పేరుతో ప్రభుత్వాన్ని బురిడి కొట్టించాలని చూశారు. జీఎస్టీ రిటర్న్స్‌లో మాత్రం తప్పుడు లెక్కలు చూపించి అధికారులకు దొరికిపోయారు. హైదరాబాద్ పంజాగుట్టలోని లలితా జువెల్లరీ 201718 సంవత్సరానికి జీఎస్టీ ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ పేరుతో రూ. 56.61 కోట్లను క్లెయిమ్ చేసుకున్నారు. కానీ ఆయన సమర్పించిన రిటర్న్స్ లెక్కల ప్రకారం రూ. 41.22 కోట్లే రావాల్సి ఉంది.

వాస్తవానికి రావాల్సన అమౌంట్‌కంటే రూ. 15.39 కోట్లు ఎక్కువ పొందినట్లు లెక్కల్లో తేలింది. ఇయర్ ఎండింగ్ లెక్కల్లో లలితా జువెల్లరీ అధినేత చేసిన స్కాం బయటపడటంతో స్టేట్ కమర్షియల్ టాక్స్ డిపార్టుమెంటులోని జీఎస్టీ విభాగం అధికారులు ఆయనకు నోటీసులు జారీ చేశారు. లలిత జువెల్లరీ సమర్పించిన జీఎస్టీ రిటర్న్స్ వివరాలను ఇవ్వాల్సిందిగా కాగ్ (కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) సైతం ఆదేశాలు జారీ చేసింది.

దీనిపై స్పందించిన స్టేట్ కమర్షియల్ టాక్స్ డిపార్టుమెంట్.. వాస్తవానికి రావాల్సన అమౌంట్‌కంటే రూ. 15.39 కోట్లు ఎక్కువ పొందినట్లు తేల్చారు. దీనిపై జీఎస్టీ విభాగం అధికారులు ఆయనకు నోటీసులు జారీ చేశారు. అదనంగా పొందిన రూ. 15.39 కోట్లలో రూ.



14.85 కోట్ల మేర తిరిగి వచ్చిందని సంబంధిత అధికారులు తెలిపారు. మిగిలిపోయిన రూ. 53.52 లక్షలకు సంబంధించి డిపార్టుమెంటు అధికారులు ఇప్పటివరకూ వివరణ ఇవ్వలేదని తన నివేదికలో కాగ్ పేర్కొంది. డబ్బులు ఊరికే రావు... అంటూ ప్రజలకు సూక్తులు చెప్పే లలిత జువెల్లరీ అధినేత, తాను మాత్రం తప్పుడు లెక్కలు చూపించి ఏకంగా రూ. 15.39 కోట్లను పొందడం ఇప్పుడు సంచలనంగా మారింది.



## సైబర్ నేరాలపై అవగాహన

**విశ్వంభర, కాళేశ్వరం :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం ఎస్సై చక్రపాణి ఆధ్వర్యంలో ప్రజలకు సైబర్ నేరాల పై అవగాహన కల్పించారు. అలాగే నూతన చట్టాల ట్రాఫిక్ నిబంధనల పాటించాలని అన్నారు. మద్యం సేవించి ఎవరు వాహనాలు నడిపిన ప్రమాదాలకు గురి కావద్దని అన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన తల్లితండ్రుల పై కఠిన చర్యలు తీసుకొని కేసులు నమోదుచేస్తామని, ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్స్ , వాహన పత్రాలు కలిగి ఉండాలని ఎస్సై చక్రఫాణి హెచ్చరించారు.

## సోమవారం ప్రజా దివాస్ రద్దు



**విశ్వంభర, భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లాలో ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా దివాస్ కార్యక్రమాన్ని అనివార్య కారణాలతో రద్దు వేస్తున్నట్లు జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి వచ్చే సోమవారం యధావిధిగా ఈ కార్యక్రమం కొనసాగుతుందని ఎస్పి కిరణ్ ఖరే స్పష్టం చేశారు.

## యువతే దేశానికి ఆదర్శం



**విశ్వంభర, మహాదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ పోలీస్ స్టేషన్ సర్కిల్ లో నేటి యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని మహాదేవపూర్ సిఐ రాంచంద్రా రావు సూచించారు. యువతే దేశానికి ఆదర్శంగా నిలవాలని అన్నారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలందరూ సహకరించాలని ఆయన అన్నారు. పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.

## బిఆర్ఎస్ నాయకుడు రమేశ్‌కి ఘన నివాళి




**విశ్వంభర, ఆమనగల్లు :** ఆమనగల్ మండల టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సీతారాం నగర్ నగర్ తండా గ్రామపంచాయతీ పులిగోని పల్లి తండా కు చెందిన బాణావత్ రమేష్ నాయక్ శుక్రవారం విటాయిపల్లి దగ్గర రోడ్డు ప్రమాదంలో మరణించారు. విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఫుడ్ కమిషన్ రాష్ట్ర చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, ఆమనగల్ కడ్తాల్ మాజీ జెడ్పిటిసి లు అనురాధ, దశరథ్ నాయక్ రమేష్ కు నివాళులర్పించారు. పార్టీ తరపున 35 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సరిత, లచ్చిరామ్ మాజీ సర్పంచ్ సోనా శీను, లక్ష్మణ్, , నాగులు, రమేష్ నాయక్, సోమ్లా రైసల్ తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటిన పల్లె బ్రదర్స్



**విశ్వంభర, కేశంపేట :** కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన బైండ్ల లింగం అనారోగ్యంతో శనివారం నాడు మరణించారు. ఆ కుటుంబాన్ని పరామర్శించడానికి వచ్చిన పల్లె బ్రదర్స్ ,పల్లె ఆనంద్ కుమార్, పల్లె బాలేశ్వర్ చనిపోయిన వ్యక్తి పిల్లల యొక్క పరిస్థితిని గమనించి లక్ష రూపాయలు ఆ కుటుంబానికి అందించారు. ఇద్దరు ఆడపిల్లల పేర్ల మీద లక్ష రూపాయలు ఫిక్సడ్ డిపాజిట్ చేయించి భవిషత్తులో ఏ అవసరం ఉన్న వారి ఐదారు ఆడపిల్లకు , ఒక అబ్బాయికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. గొప్ప మనసును చాటుకున్న పల్లె బ్రదర్స్ ను గ్రామ ప్రజలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పల్లె బాలేశ్వర్, పామ్ విజేందర్ రెడ్డి, సూరం శ్రీనివాస్,పెబ్బే శివకుమార్, బుర్రి మల్లేష్ గౌడ్, నలవోలు కరుణాకర్ రెడ్డి, వట్టేల శ్రీశైలం, వట్టేల మల్లేష్, బండ మల్లేష్, మావిళ్ళ రమేష్, బైండ్ల శ్రీను, బైండ్ల శ్రీశైలం, బైండ్ల శ్రీకాంత్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## కేహెచ్ఆర్ ఆర్థిక సాయం



**విశ్వంభర ,ఆత్మకూరు-(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్(ఎం)మండలం పల్లెర్ల గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబమైన కొమ్మిరి కన్నయ్యకి కాలు విరిగి పోయింది. చికిత్స నిమిత్తం కొరకు విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేహెచ్ఆర్ ఫౌండేషన్ అధినేత కొప్పుల హరిదీప్ రెడ్డి 5000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు.ఆపదలో ఉన్న వారికి అండగా కేహెచ్ఆర్ ఫౌండేషన్ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దండు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛదనం, పచ్చ దనం జయప్రదం చేయాలి

### మంత్రి పొన్నం ప్రభాకర్



**విశ్వంభర, కరీంనగర్ :** ఈ నెల 5 నుండి 9 వరకు ప్రభుత్వం నిర్వహించనున్న స్వచ్ఛదనం,పచ్చదనం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని మున్సిపల్ టౌన్ తో పాటు, అన్ని గ్రామాల్లో చెత్తను తొలగించి, మొక్కలు నాటాలని, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని, త్రాగునీరు కలుషితం కాకుండా, మురుగు ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, ప్లాస్టిక్ వాడకంతో వచ్చే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. ప్రజా ప్రతినిధులతో పాటు, యువజన స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ప్రజలు భాగస్వామ్యం కావాలన్నారు. వన మహోత్సవం ద్వారా ఖాళీ స్థలంలో మొక్కలు నాటాలన్నారు. మానవ మనుగడకు పర్యావరణమే కీలకమని, పర్యావరణాన్ని కాపాడుకోవడానికి స్వచ్ఛదనం, పచ్చదనం దోహదపడుతుందని మంత్రి పేర్కొన్నారు.

## బీసీ గర్ల్స్ హాస్టల్‌కు సొంత భవనం నిర్మించాలి



**విశ్వంభర, భూపాలపల్లి :** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనపూర్ మండల కేంద్రంలో ఉన్న బీసీ గర్ల్స్ హాస్టల్ ను ఎస్ఎఫ్ఐ భూపాలపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మరి రాజు సందర్శించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు స్వయంగా తెలుసుకోవడం జరిగింది.

హాస్టల్ కు సంబంధించి గత కొన్ని నెలలుగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మా దృష్టికి తీసుకువచ్చారని, అదేవిధంగా బీసీ గర్ల్స్ హాస్టల్ లో విద్యార్థు లు 50 మందికి పైగా ఉన్నారు. హాస్టల్లో ఉంటున్న సమయంలో వర్షాకాల ప్రభావంతో గోడలు కూలిపోవడం జరిగింది అదేవిధంగా వర్షాలు కొట్టిన తర్వాత బిల్డింగ్ షాక్ వచ్చి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకి గురవుతున్నారని అన్నారు . హాస్టల్ కు సంబంధించి విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు. తక్షణమే ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో డిమాండ్ చేసారు. లేనియెడల విద్యార్థులు అందరితో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని వారు హెచ్చరించారు.

## చెంగిచెర్ల లో ఘనంగా బోనాల పండుగ



**విశ్వంభర, బోడుప్పల్ :** మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చెంగిచెర్ల లో బోనాల పండగ అంగరంగ వైభవంగా పోచమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చెంగిచెర్ల గ్రామ పంచాయతీ మాజీ ఉపసర్పంచ్ కొత్త రవి గౌడ్ ఆధ్వర్యంలో మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి, బోడుప్పల్ కార్పొరేషన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంద సంజీవ రెడ్డి చెంగిచెర్ల లోని పోచమ్మ దేవాలయాన్ని సందర్శించి పోచమ్మతల్లినీ దర్శించుకున్నారు.

ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ చెంగిచెర్ల ప్రజలకు ముందుగా బోనాల పండగ శుభాకాంక్షలు తెలిపారు. అంగరంగ వైభవంగా తెలంగాణ లో ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న బోనాల పండుగ మన సాంస్కృతి సాంప్రదాయాలను ఉట్టిపడేలా బోనాల పండగ జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ కార్పొరేషన్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు, డివిజన్ అధ్యక్షులు మేక శ్రీనివాస్ యాదవ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే సబితారెడ్డి

**విశ్వంభర, గజ్వేల్ :** మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి ఆదివారం ఎర్రవెల్లిలోని ఫామ్ హౌస్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఎప్పటికప్పుడు ఎండకడుతూ ఉండాలని సూచించినట్లు ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. మాటల్లో తప్ప చేతల్లో ప్రభుత్వ పనితీరు కనబడతలేదని, రుణమాఫీ కొంతమంది రైతులకే లబ్ధి చేకూరిందని, వివిధ కారణాలతో వేలాది మంది రైతులకు రుణమాఫీ కాలేదన్నారు.ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురు కుంట్ల అరవింద్ శర్మ, ఆర్కే పురం డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, న్యాలకొండ శ్రీనివాస్ రెడ్డి, గొడుగు శ్రీనివాస్, సాజిద్, జగన్మోహన్ రెడ్డి, మహేందర్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, పెంబర్తి శ్రీనివాస్, మురళీధర్ రెడ్డి, నవీన్, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.





## వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు

**విశ్వంభర, షాద్ నగర్ :** అమవాస్యను పురస్కరించుకుని షాద్ నగర్ పట్టణంలోని శ్రీ శివమారుతి గీతా అయ్యప్ప మందిరం, శ్రీ వీరభద్రస్వామికి ఆదివారం వైభవంగా ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి విశేష పంచామృతాభిషేకలతో పాటు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ప్రతి నెల అమావాస్య రోజున విశేష పూజ కార్యక్రమాలను నిర్వహిస్తామని పూజారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు , భక్తులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ దవాఖానలో పండ్ల పంపిణీ



**విశ్వంభర, హుజూర్నగర్ :** డైనమిక్ లీడర్ శానంపూడి సైదిరెడ్డి ఎక్స్ ఎమ్మెల్యే భారతీయ జనతా పార్టీపార్లమెంట్ ఇంచార్జ్ పుట్టినరోజు సందర్భంగా హుజూర్నగర్ నియోజకవర్గంలోని ఏరియా హాస్పిటల్‌లో రోగులకు బాలింతలకు ఇతర వ్యాధిగ్రస్తులకు సుమారు 150 మందికి పాలు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రూరల్ అధ్యక్షుడు కొందరు కోటిరెడ్డి, హుజూర్నగర్ పట్టణానికి సంబంధించి గుండా గోపి, ఎల్లవల సోమరాజు, కంటూ నాగరాజు, బత్తుల ఉపేందర్, బల్వంత్ సింగ్, పురాణం గోపి, ములకలపల్లి ఉపేందర్, కర్నే సాయి, నల్లమల వెంకటేశ్వర్లు, చారి పిల్లినగేష్, మురళి తదితరులు పాల్గొన్నారు.

## 5వ తేదీ నుంచి స్వచ్ఛదనం-పచ్ఛదనం



**విశ్వంభర, భూపాలపల్లి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు భూపాలపల్లి జిల్లాలో ఆగస్టు 5వ తేదీ నుండి 9 వ తేదీ వరకు స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాలు, పట్టణాలు ప్రజలు, మహిళా సంఘాలు, యువత, ప్రముఖులతో కార్యక్రమం నిర్వహణ ప్రాధాన్యత తెలియచేస్తామని ,పెద్ద ఎత్తున అవగాహన ర్యాలీలు నిర్వహిస్తామని తెలిపారు. గ్రామ, మున్సిపల్ స్థాయిలో ప్రతి ఇంటి నుండి వ్యర్ధాలు సేకరించి, వ్యర్ధాలను వర్మీ కంపోస్టు ఎరువులు తయారు చేయాలని అధికారులకు సూచించారు. పారిశుధ్య కార్యక్రమాలు, మొక్కల పెంపకం, సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహిస్తామని అన్నారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమ నిర్వహణపై అవగాహన కల్పించి అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించి పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు.

## సీఐ రామిరెడ్డిపై బదిలీ వేటు

**విశ్వంభర, హైదరాబాద్:** షాద్నగర్ పోలీస్ స్టేషన్లో దళిత మహిళపై దాడి ఘటనకు సంబంధించి సీఐ రామిరెడ్డిపై బదిలీ వేటు పడింది. సీఐని సైబరాబాద్ హెడ్ క్వార్టర్స్కు అటాచ్ చేస్తూ సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి ఉత్తర్వులు జారీ చేశారు. సీఐపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేస్తున్నామని, విచారణ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుంటామని సీపీ వెల్లడించారు.గత నెల 24న షాద్నగర్ పట్టణంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన సునీత, భీమయ్య దంపతులుదొంగతనం చేశారని వారి ఇంటికి సమీపంలో ఉండే నాగేందర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు.కేసు నమోదు చేసుకున్న పోలీసులు సునీత, భీమయ్యతో పాటు వారి 13 ఏళ్ల కుమారుడిని స్టేషన్కు తీసుకెళ్లారు. అనంతరం భర్తను వదిలేసిన డిటెక్టివ్ సీఐ రామిరెడ్డి, అతని సిబ్బంది బాధితురాలు సునీతను కుమారుడి ముందే విచక్షణా రహితంగా కొట్టడంతో తీవ్రంగా గాయపడింది. పోలీసుల తీరుపై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో ఉన్నతాధికారులు స్పందించి విచారణకు ఆదేశించారు.

# వైభవంగా బోనాల జాతర

**విశ్వంభర,మేడిపల్లి :** ఆషాడ మాసంలో నిర్వహించే బోనాల పండుగ అనేది తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేషన్ లో అంగరంగ వైభవంగా బోనాల జాతర కన్నులు పండుగ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి, మేయర్ జక్క వెంకట్ రెడ్డి కుటుంబ సమేతంగా పాల్గొని అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీర్జాదిగూడలో బోనాల పండుగ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయని మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. ప్రజలంతా కులమతాలకు అతీతంగా ఎంతో సంతోషంగా ఈ బోనాల పండుగను జరుపుకుంటున్నారని, ఆ అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, ప్రజలంతా సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని ప్రార్థించినట్లు ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తరతరాలుగా వస్తున్న సంప్రదాయాల్ని కాపాడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. మన ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలను భావితరాలకు అందజేసే విధంగా అందరూ కలిసికట్టుగా ఈ సంప్రదాయాన్ని కొనసాగించడానికి కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, మధుసూదన్ రెడ్డి, దొంతిరి హరిశంకర్ రెడ్డి, నాయకులు లేతాకుల రఘుపతి రెడ్డి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి రఘువర్దన్ రెడ్డి, జావేద్ ఖాన్, మహిళా అధ్యక్షురాలు నిర్మల,యూత్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, ఆంజనేయులు, శంకర్ రావు, కిరణ్ తదితరులు.





## జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేయాలి

**విశ్వంభర, భూపాలపల్లి :** కేంద్రంలో బీజేపీ సర్కార్, రాష్ట్రాల్లో ఆయా ప్రభుత్వాలు జర్నలిస్టుల సంక్షేమానికి పాటుపడాలని,జర్నలిస్టుల హక్కులను కాపాడాలని తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టిఎస్ జేయు) నాయకులు కోరారు. బీహార్ రాష్ట్రంలోని సాసారమ్ జిల్లా కేంద్రంలోని గోపాల్ నారాయణ విద్యాలయ ప్రాంగణంలో శని,ఆదివారాలలో జాతీయ అధ్యక్షులు అశోక్ మాలిక్, సెక్రటరీ జనరల్ సురేష్ శర్మ,జాతీయ ఉపాధ్యక్షులు నారగౌని పురుషోత్తం ఆధ్వర్యంలో జరిగిన నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ఇండియా (ఎన్.యు.జె (ఇండియా) జాతీయ కార్యవర్గ సమావేశానికి తెలంగాణ రాష్ట్రం నుండి తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టిఎస్ జెయు) రాష్ట్ర అధ్యక్షులు మెరుగు చంద్రమోహన్,ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్,జాతీయ నాయకులు పావుశెట్టి శ్రీనివాస్,జయశంకర్ జిల్లా అధ్యక్షులు ఎడ్ల సంతోష్,ప్రధాన కార్యదర్శి జల్దీ రమేష్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కౌన్సిల్ సమావేశంలో సంతోష్, రమేష్,శ్రీనివాస్ లు జర్నలిస్టులు మాట్లాడారు.తెలంగాణలో జర్నలిస్టులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని కౌన్సిల్ దృష్టికి తీసుకు వచ్చారు.అర్హులైన జర్నలిస్ట్ లకు ఇళ్ల స్థలాలు కేటాయించి,వారికీ ఇండ్లు నిర్మించాలని కోరారు. జర్నలిస్ట్ హెల్త్ కార్డు లు పరిమితి నిబంధన లేకుండా అన్ని కార్పొరేట్ ఆసుపత్రిలో అమలయ్యేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు.అదేవిధంగా జర్నలిస్ట్ పిల్లలకు ప్రాథమిక,ఉన్నత విద్యతో పాటు వృత్తి,నైపుణ్య విద్య కోర్సుల్లో కార్పొరేట్,ప్రైవేటు,పాఠశాల,కళాశాలల్లో 50% ఫీజు రాయితీ కల్పించాలన్నారు.



## స్నేహితుల దినోత్సవం వేడుకలు

**విశ్వంభర, ఆత్మకూర్ :** 1988 89 సంవత్సరంలో చదివిన పదవ తరగతి బ్యాచ్ కి చెందిన పూర్వ విద్యార్థులు స్నేహితుల దినోత్సవం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆత్మకూర్ (ఎం) మండల్ కేంద్రములో స్నేహితుల దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకొని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి కందటి అనంతరెడ్డి, ఎలిమినేటి జహంగీర్, పైళ్ల గోపాల్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ ఏం ఏ మతిన్, ఎలిమినేటి నగేష్, లోడి భాస్కర్ గౌడ్, కారుపాటి యాదగిరి, వనం నరసింహ, పంజాల మల్లేశం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## క్వీన్స్ ల్యాండ్ తెలంగాణకు శుభాకాంక్షలు



**విశ్వంభర, న్యూఢిల్లీ :** తెలంగాణ రాష్ట్ర సాధన లో ముఖ్య భూమికి పోషించి,తెలంగాణ గొప్పతనాన్ని, మన సంస్కృతి సాంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పడంలో కృషి చేస్తున్నటువంటి క్వీన్స్ ల్యాండ్ తెలంగాణ అసోసియేషన్ మిత్రులందరికీ భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేసారు . మీరు ఆస్ట్రేలియాలో ఉంటూ కూడా మన తెలంగాణ బోనాలు, బతుకమ్మ పండుగను, మన జాతి గౌరవాన్ని కొనసాగిస్తూ మన పిల్లలకు, మన భావితరాలకు అందరికి గొప్పగా ప్రపంచానికి చాటి చెప్పే విదంగా చేస్తున్న తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ క్వీన్స్ ల్యాండ్ కార్యవర్గానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరుపున అభినందనలు తెలియజేస్తున్నాను.

## ఎంతకైనా పోరాడుతాం ఆర్యవైశ్య సంఘం నాయకులు


**విశ్వంభర, షాద్ నగర్ :** తెలుగు విశ్వవిద్యాలయానికి అమరజీవి పొట్టి శ్రీరాములు పేరును తొలగించడాన్ని షాద్ నగర్ పట్టణ ఆర్యవైశ్య సంఘం నాయకులు ఖండించారు. ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు కొరకు ఆమరణ నిరాహారదీక్ష చేసి, ప్రాణాలర్పించి,అమరజీవి యైన మహాపురుషుడు. జీవితాంతం కృషిచేసి, ఆనాటి మదరాసు రాష్ట్రం నుండి ఆంధ్రప్రదేశ్ వేరుకావడానికి ప్రాణత్యాగం చేసిన మహనీయుడు ఆర్య వైశ్య పొట్టి శ్రీరాములు అని గుర్తు చేసారు. ఈ నిర్ణయాన్ని విరమించుకోకపోతే ఎంతటి పోరాటానికైనా సిద్ధ పడతామనిప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇది ఆర్యవైశ్యుల ఆత్మగౌరవానికి సంభందించిన విషయం కావున అందరం ముక్తకంఠంతో ఈ నిర్ణయాన్ని ఖండిస్తూ, ఒకవేళ ప్రభుత్వం ఈ ప్రతిపాదనను విరమించుకోకుంటే ఎంతవరకైనా పోరాడుతామని ఆర్యవైశ్య సంఘం, అనుబంధ సంఘాల తరపున షాద్ నగర్ పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కల్వ యాదగిరి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## ఓపెన్ యూనివర్సిటీలో దరఖాస్తులకు ఆహ్వానం

**విశ్వంభర, షాద్ నగర్ :** ఇంటర్, ఓపెన్ ఇంటర్ పాసైన విద్యార్థులు డాక్టర్ బిఆర్ అంబెద్కర్ యూనివర్సిటీ ఓపెన్ డిగ్రీలో చేరుటకు అప్లై చేసుకోవాలని అడ్మిషన్స్ ప్రారంభం అయినట్లు షాద్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్ కమల ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ డిగ్రీ మొదటి సంవత్సరం లో చేరికకు అవకాశం ఉందని తెలిపారు.ఇంటర్, ఓపెన్ ఇంటర్, ఐ టి ఐ పాసైనవారు ఓపెన్ డిగ్రీ లో చేరవచ్చు అన్నారు.బి ఏ, బి కామ్, బి ఎస్సి లో ఆన్లైన్ లో ఆగస్టు 18 లోపు అప్లై చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. అదే విదంగా ఓపెన్, రెండవ, మూడవ సంవత్సరం విద్యార్థులు ఆన్ లైన్ లో ఫీజ్ చెల్లించేందుకు ఈ నెల 18 వ తేది వరకు అవకాశం ఉందని ఎవరికైనా సందేహాలు ఉంటే ఈ నెంబర్ కు 7382929657 ఫోన్ చైయ్యవచ్చని లేదా షాద్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లోని స్టడీ సెంటర్ లో సంప్రదించగలరని విజ్ఞప్తి చేశారు.




## స్వర్ణగిరి క్షేత్రాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య భువనగిరి మండలం లోని స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యని సంప్రదాయం ప్రకారం ఆలయ డైరెక్టర్ మురళి కృష్ణ అర్చకులతో ఘన స్వాగతం పలికారు.
ఆలయంలో స్వామి వారి దర్శనం అనంతరం ఆలయ అర్చకులు ప్రత్యేక ఆశీర్వచనం అందజేశారు. స్వామి వారి చిత్రపటం లడ్డు ప్రసాదం ఆలయ డైరెక్టర్ మురళి కృష్ణ అందజేశారు.ఆ తర్వాత ఆంజనేయ స్వామి వారిని, జలనారాయన స్వామివారిని, కళ్యాణ మండపాన్ని, సందర్శించారు. తిరుపతి తరహాలో భువనగిరి స్వర్ణగిరి ఆలయంలో ఆధ్యాత్మికం ఉట్టిపడేలా ఉందన్నారు.

## అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు



విశ్వంభర, షాద్ నగర్ : ఆదివారం అమావాస్య పురస్కరించుకొని షాద్ నగర్ పట్టణ శివారులోని సోలిపూర్ చౌడమ్మగుట్ట శ్రీ వీర ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రధాన అర్చకులు రఘుపతి రావు, రాఘవేంద్రాచార్య, కృష్ణ, ప్రమోద్ పంతులు ఆధ్వర్యంలో భజన భక్త బృందం సభ్యులు, పట్టణ ప్రముఖులు హోమం నిర్వహించారు. అనంతరం గోమాతకు పూజా కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా పట్టణానికి చెందిన మలిపెద్ది వెంకటరమణ కుటుంబ సభ్యులు తమ తల్లిదండ్రులు మలిపెద్ది రంగయ్య, మానెమ్మ జ్ఞాపకార్థం గోవులకు పచ్చ గడ్డిని దానం చేశారు.
ఈ కార్యక్రమంలో ఎంసాని నరసింహులు, మల్లిపెద్ది శ్రీనివాసులు, అన్నారం రఘు గౌడ్, కృష్ణయ్య, శిరీష, యాదగిరి, మాజీ వార్డు సభ్యులు సింగపాగ లక్ష్మయ్య, భజన భక్త బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ మోర్చా అధ్యక్షుల ఎన్నిక



**విశ్వంభర, ఎల్లారెడ్డి :** బీజేపీ పార్టీకి సంబందించిన వివిధ మోర్చా కమిటీల అధ్యక్షులును ఆదివారం రాజంపేట మండలంలోని కొండాపూర్ గ్రామంలో భారతీయ జనతా పార్టీ మండల కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేసి ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా చర్చలో బూతు స్థాయిలో పార్టీ బలోపేతం పై, స్థానిక ఎన్నికలలో పార్టీ గెలుపుకోసం పని చేసేలా విధివిధానాలు చర్చించుకున్నారు. మహిళా మోర్చా అధ్యక్షులు మెగావత్ రజిత, బీజేవైఎం మోర్చా అధ్యక్షులు అల్లకొండ అరుణ్ గౌడ్ , ప్రధాన కార్యదర్శి కృష్ణ , ఉపాధ్యక్షులు మంగలి రమేష్, ఎస్టీ మోర్చా అధ్యక్షులు మాలోత్ గణేష్ , ఎస్సి మోర్చా అధ్యక్షులు బండారి స్వామి,ఓబీసీ మోర్చా అధ్యక్షులు కుమ్మరి సురేష్, కిసాన్ మోర్చా అధ్యక్షులు శ్యామ్ రెడ్డి , ప్రధాన కార్యదర్శి సాదుల హనుమండ్లును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అంకాలపు శ్రీనివాస్,జిల్లా ప్రధాన కార్యదర్శి గరిడే రవీందర్ రావు,అసెంబ్లీ కన్వీనర్ లింగారావు, నరేందర్ , గొల్ల రమేష్ గారు, శ్రీశైలం, శ్రీనివాస్ గౌడ్ , అనిల్ రెడ్డి , కుమ్మరి రమేష్, వివిధ మోర్చాల అధ్యక్షులు భూత్ అధ్యక్షులు నాయకులు పాల్గొన్నారు.

## రాష్ట్ర బడ్జెట్ లో మైనారిటీలకు నిరాశ




**విశ్వంభర, కరీంనగర్ :** తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ లో ప్రవేశపెట్టిన బడ్జెట్ లో మైనారిటీలకు నిరాశ కలిగించిందని తెలంగాణ రాష్ట్ర సంచార ముస్లిం తెగల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండి షబ్బీర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో లో మైనారిటీ లకు ఇచ్చిన హామీలు మరిచిపోయి రూపొందించారా.? అంటూ ఆవేదన వ్యక్తం చేసారు . 5000 కోట్లు కేటాయింపులో కేవలం 3003 కోట్లు కేటాయించడం నిరాశ కలిగించిందని అన్నారు. మైనారిటీ లకు భరోసా ఇవ్వడం తో గడ్డుపరిస్తితుల్లో ఉన్న పార్టీ కి అండగా ఉండి అధికారం అందించి పూర్వవైభవాన్ని తీసుకొస్తే మైనారిటీలను విస్మరించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎండి షబ్బీర్, ఎండి షాదుల్లా, మౌల హుస్సేన్, ఎండి దావుద్ ,ఎండి రియాజ్, ఎండి ఆలీ పాషా, అజ్మాత్ , ఎండి మలాంగ్ పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**విశ్వంభర, ఫరూక్ నగర్ :** నూటయాభై సంవత్సరాల చరిత్ర గల రంగారెడ్డి జిల్లా ఫరూక్ నగర్ మండల, మొగిలిగిద్ద ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 19871988 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. దాదాపు 36 ఏళ్ల తరువాత 80 మంది పూర్వ విద్యార్థులు ఒక్కచోట కలుసుకున్నారు.ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సంతోషించారు. పాత స్నేహితులు ఎక్కడో ఒకచోట కలిస్తే ఆ సంతోషం ఎంతో మధురమైనది. అలాంటిది ఎప్పుడో చదువుకుని చాలా ఏళ్ల తర్వాత కలిస్తే ఆ సంతోషానికి అవధులు ఉండవు. విద్యార్థులు పరస్పరం ఆత్మీయంగా పలకరించుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ పాఠశాల క్రమశిక్షణకు మారుపేరు కనుకనే పూర్వ విద్యార్థులందరూ ఉన్నత పదవుల్లో ఉన్నారని కొనియాడారు.అనంతరం ఉపాధ్యాయులకు పూలమాలలు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయుల బృందం తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు ఘన సన్మానం

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ కి 50 కోట్లు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తు, ఇవే కాకుండా వంద కోట్ల రూపాయలను పరిషత్ కి కేటాయించాలంటూ, ఉమ్మడి తెలంగాణ జిల్లాలలో ప్రతి జిల్లాలలో బ్రాహ్మణ భవనం నిర్మించాలని తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సభ్యులు ప్రభుత్వ విప్ ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్యని కోరారు. ఈ సందర్భంగా దేవాలయాలను అభివృద్ధి చేస్తు అర్చకులకు సకాలంలో జీతభత్యాలు ఇస్తు వారికి కూడా ప్రభుత్వం చేదోడు వాదోడుగా ఉండాలంటు పేర్కొన్నారు. ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యను బ్రాహ్మణ సేవా సంఘం ఘనంగా సత్కరించారు . రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు మోత్కూరి రాము మాట్లాడుతూ మునుముందు బ్రాహ్మణ శ్రేయస్సు కోసం మీరు ముందుండాలని శాసన సభ్యుడిని కొనియాదారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు మోత్కూరి రాము, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ నమిలికొండ కిరణ్, ఆలేరు మాజీ సర్పంచ్ మోహన్ రావు, విష్ణుదాసు, వంశీధర్ రావు, శేషగిరి రావు తదితరులు పాల్గొన్నారు.






మల్కాజ్గిరి, మేడిపల్లి, కమల నగర్ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో బోనాల కార్యక్రమంలో మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ పాల్గొన్నారు, వారివెంట స్థానిక నాయకులు , కార్యకర్తలు ఉన్నారు.

- విశ్వంభర, మేడ్చల్

# ఘనంగా బోనాల పండుగ

**విశ్వంభర, వనస్థలిపురం :** హయత్‌నగర్‌లోని సూర్య నగర్ కాలనీ పరిధిలోని నల్ల పోచమ్మ దేవాలయంలో ఘనంగా బోనాల ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు అనంతుల వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని గ్రామ దేవతలకు బొడ్రాయికి నైవేద్యాన్ని సమర్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాసర్ల మహేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బుర్ర జయపాల్ రెడ్డి, మహేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సంజీవరెడ్డి, శ్రావణ్, ఐలయ్య, రాజేష్, రాజేంద్రరెడ్డి, వెంకట్రెడ్డి, నరసింహారెడ్డి, మహేందర్రెడ్డి, సూర్య నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

**సుబ్రహ్మణ్య కాలనీలో...**







హయత్ నగర్‌లోని సుబ్రమణ్య కాలనీ పరిధిలోని నల్ల పోచమ్మ దేవాలయంలో ఘనంగా బోనాల ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఏ భాస్కర్, జిహెచ్ఎంసి మాజీ కోఆప్షన్ నెంబర్ శాలిని ముఖ్యఅతిథిగా హాజరుకాగా రాములు గౌడ్, రాంప్రసాద్, డివి రాంప్రసాద్, రమేష్, కుమార్, రేవతి, కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

**వినాయకనగర్ కాలనీలో...**

వినాయకనగర్ కాలనీ పరిధిలోని దుర్గ పోచమ్మ దేవాలయంలో నిర్వహించిన బోనాల ఉత్సవాలలో ఆలయ కమిటీ అధ్యక్షుడు నక్క మురళీధర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి జట్ట మహేశ్వర్, నక్కవెంకటేష్‌గౌడ్, తమ్మడపైన విష్ణుమూర్తి, బత్తుల శ్రీనివాస్ గౌడ్, టి శ్రీనివాస్, మామిడాల అచ్యుత్ రెడ్డి, ఎల్కటి రవీందర్ రెడ్డి, ఉప్పు రాజారావు, కొలను విజయ, పార్టీ రమాదేవి, నాగమల్లేశ్వరి, శ్రీనివాసమూర్తి, నక్కల శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.







**రేణుక ఎల్లమ్మ దేవాలయం ఆధ్వర్యంలో...**

రేణుక ఎల్లమ్మ దేవాలయం ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పిట్టల జంగయ్య, గౌరవ అధ్యక్షులు, పరందస్వామి, ఎర్ర రవీందర్, ఉపాధ్యక్షులుముత్యం శ్రీకాంత్, జనరల్ సెక్రెటరీ, నాగభూషణం, శ్రీధర్, కోశాధికారి, శ్రీనివాస్ గౌడ్, వారందకృష్ణ, సాంస్కృతిక, దాస్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

### తెలుగు యూనివర్సిటీకి
## పేరు మార్చొద్దు



**విశ్వంభర, ఎల్బీనగర్ :**, తెలుగు యూనివర్సిటీ పేరు మార్చవద్దని రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు కొత్త రవి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ దేశంలోని ఆర్యవైశ్యులకు స్ఫూర్తిదాయకుడైన అమరజీవి పొట్టి శ్రీరాములు పేరును తెలుగు యూనివర్సిటీకి మార్చడం తగదన్నారు. అటువంటి ఆర్యవైశ్య జాతి నాయకున్ని స్ఫూర్తితో ఏర్పడినటువంటి తెలంగాణలో పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ పేరును మార్చుతాము అని అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపాడని, అందుకు మా మనోభావాలు దెబ్బతిన్నాయి అని అన్నారు. నిర్ణయాన్ని వెంటనే వెనెక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సురవరం ప్రతాపరెడ్డి పేరును ఒక యూనివర్సిటీకి పెట్టాలి అని అనుకుంటే నిజామాబాద్ జిల్లాలో ఉన్నటువంటి తెలంగాణ యూనివర్సిటీ కి పెట్టవలసిందిగా సూచిస్తున్నట్లు తెలిపారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**విశ్వంభర ,ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రానికి చెందిన పలువురు లబ్దిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను ఆదివారం ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పంపిణీ చేశారు. పబ్బతి అండమ్మ 60,000/, ఎల్లబోయిన లింగయ్య 60,000/, నంగునూరి రమేష్ 60,000/, చిత్తర్ల చంద్రకళ 22,000/లు , కోల లక్ష్మయ్య 10,500/లకు చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యాస లక్ష్మారెడ్డి, తాజా మాజీ సర్పంచ్ జన్నాయికోడె నగేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు పోతగాని మల్లేష్, బీసీ సెల్ పట్టణ అధ్యక్షులు ఎలగందుల శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ నాయకులు చిత్తర్ల అనిల్, ఎన్ఎస్యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తొండల అనిల్ కుమార్, ఎన్ఎస్యూఐ పట్టణ అధ్యక్షులు లోడి మహేష్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## మాలల వాటా మాలలకు దక్కాలి

**విశ్వంభర, ఎల్బీనగర్ :** జనాభా లెక్కలు చేసి ఎవరి వాటా ఎంతో ప్రభుత్వమే చేయాలంటూ, మాల మాదిగలను విడదీయడానికి కొంతమంది ప్రయత్నిస్తున్నారంటూ, మాలలు మీద అగ్రవర్ణాలు దాడి చేస్తున్నాయి అని శాసనమండలిలో జరిగిన చర్చల్లో గోరేటి వెంకన్న ప్రసంగిస్తూ ఎస్సీ వర్గీకరణ భారత పార్లమెంట్ ద్వారా జరగాలని, ఒకవేళ జరిగిన రాజ్యాంగం పరిధిలో ఉండాలని మాలల వాటా మాలలకు దక్కాలి అని అన్నారు. మాలల్లో,మాదిగల్లో ఉపకులాలు అణగారిన వర్గాలు వారికి కూడా సమాన వాట దక్కాలని అని తెలిపారు. శాసనమండలిలో మాలల తరపున మాట్లాడిన గోరేటి వెంకన్న తన ఆవేదనను వెల్లడించారు. అందుకు ఎల్బీనగర్ నియోజకవర్గం మాల మహానాడు కార్యకర్తలు పెద్ద ఎత్తున వచ్చి ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న రంగారెడ్డి జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు చేపూరి,శంకరయ్య, నరసింహారావు , శ్రీనివాస్, శంకరయ్య, వరిజాల రమేష్, ఆర్ కృష్ణ, కాశీనాథ్, శ్రీధర్, వాసు దేవరావు, కృష్ణ, చేపూరి రాజు, రాజు, చేపూరి. నరసింహ, శంకర్, నరేష్, సత్యనారాయణ, శ్రీనివాస్, లింగయ్య, ప్రవీణ్ కుమార్,జయరాజ్ , నరేష్, అరుణ్ కుమార్, జనార్ధన్, అజయ్ కుమార్, మాల మహానాడు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## స్కూల్ బ్యాగ్స్ , నోట్ బుక్స్ పంపిణీ



**విశ్వంభర, నాంపల్లి :** సామాజిక కార్యకర్త సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో శ్రీ శారద సేవ ట్రస్ట్, మణికొండ, హైదరాబాద్ వారి సహాయంతో సంస్థ మేనేజింగ్ ట్రస్టీ శారద, సేవా ట్రస్ట్ ,ట్రస్టీలు దక్షిణామూర్తి, త్యాగరాజు, శ్రీలక్ష్మి లు ఒక లక్ష ఇరవై రూపాయలు విలువ గల స్కూల్ బ్యాగ్స్ ,నోట్ బుక్స్, స్టేషనరీ వస్తువులును దామెర, నెవిళ్ళ గూడెం, పెద్దాపురం, వడ్డేపల్లి గ్రామాలలోని పేద విద్యార్థులు, ప్రతిభగల విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ మేనేజింగ్ ట్రస్ట్ శారద మాట్లాడుతూ గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న బాలికలు, పేద విద్యార్థులు, ప్రతిభగల విద్యార్థులకు సహకారం అందించడం తమ అదృష్టంగా భావిస్తున్నామని, ఈ సామాగ్రిని విద్యార్థులు ఉపయోగించుకొని భవిష్యత్తులో మంచి ఉద్యోగాలలో స్థిరపడి తల్లిదండ్రులను బాగా చూసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సేవా సంస్థ సభ్యులు అప్పారావు ,కళ్యాణ్ రామ్ ,ప్రసన్న రమణ, ఉపేంద్ర ,మల్లేశ్వర రావు ,వెంకటేష్ సంతోషి ,ప్రమీల, ప్రభుత్వ ఉపాధ్యాయులు సామాజిక కార్యకర్త గురిజ మహేష్ , రమేష్, వట్టి కోటి చంద్రమౌళి, జడ ప్రశాంత్ , సత్యావతి, విద్యార్థుల తల్లి దండ్రులు , విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

### నల్ల బ్యాడ్జీలతో
## తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ నిరసన



**విశ్వంభర, ఎల్బీనగర్ :** ప్రైవేటు ఉపాధ్యాయులపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టే నాగరాజు యాదవ్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో శుక్రవారం ప్రభుత్వ ఉపాధ్యాయులతో ముఖాముఖి సమావేశంలో ప్రైవేట్ పాఠశాలలలో ఇంటర్, డిగ్రీ ఫెయిల్ అయిన ఉపాధ్యాయులు ఉన్నారనడం శోచనీయమన్నారు. పట్టణంలోని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ సభ్యులందరూ నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొట్టే నాగమణి యాదవ్, నియోజకవర్గ అధ్యక్షులు మన్నెం నాగరాజు, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కృష్ణకుమారి, నియోజకవర్గం వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్, నియోజకవర్గ ప్రచార కార్యదర్శి చికాకుల శ్రీనివాసచారి, డివిజన్ అధ్యక్షులు ప్రకాష్, డివిజన్ ప్రధాన కార్యదర్శి గొట్టే ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## మందకృష్ణ కృషి చిరస్మరణీయం




**విశ్వంభర, బోడుప్పల్ :** అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో బాబా సాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి జ్ఞానమాల సమర్పించే కార్యక్రమం 285 ఆదివారాలుగా బోడుప్పల్ లో విజయవంతంగా కొనసాగుతుంది. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం సభ్యులు పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి జ్ఞానమాల సమర్పించి నివాళులర్పించారు.ఈ సందర్భంగా నత్తి మైసయ్య మాట్లాడుతూ మాదిగల వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా అలుపెరుగని పోరాటం చేసిన మందకృష్ణ మాదిగ కృషి, ఎంతోమంది అమరులైన మాదిగల త్యాగ ఫలితంగా సుప్రీంకోర్టు లోని ఏడుగురు సభ్యుల ధర్మాసనం మాదిగల వర్గీకరణ న్యాయబద్ధమని తీర్పునివ్వడం హర్షనీయమని నత్తి మైసయ్య అన్నారు.ఈ కార్యక్రమంలో భూపరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుగ్గ మైసయ్య,గరుగుల యాకయ్య,ఈల అంజయ్య,సగ్గు నరసింహ మూర్తి, కంచి సతీష్, దానగళ్ళ చిన్న యాదయ్య,సవరపు బయన్న జై భీమ్ అజయ్ తదితరులు పాల్గొన్నారు.




### వయనాడ్ బాధితుల కోసం
## విరాళాలు సేకరణ

**విశ్వంభర, ఎల్బీనగర్ :** కేరళ వయనాడ్ బాధితులకు ప్రజల నుండి విరాళాలు సేకరణ రామకృష్ణాపురం డివిజన్లోని ఎన్టీఆర్ నగర్ కూరగాయల మార్కెట్ , గడ్డి అన్నారం లో షాప్ టు షాప్ తిరిగి బాధితులకు విరాళాలు సేకరించారు. ఈ సేకరణకు రంగారెడ్డి జిల్లా సిపిఎం పార్టీ కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం చంద్ర మోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రమోహన్ మాట్లాడుతూ ప్రకృతి విపత్తు వల్ల వయనాడ్ లో వందల మంది ప్రాణాలు కోల్పోయారని అన్నారు. ప్రాణ నష్టంతోపాటు, ఆస్తి నష్టం కూడా అధికంగా జరిగిందని వారిని ఆదుకునేందుకే సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో విరాళాలు సేకరణ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సరూర్ నగర్ సర్కిల్ సిపిఎం పార్టీ కార్యదర్శి సిహెచ్ వెంకన్న, సర్కిల్ కమిటీ సభ్యులు ఎం వీరయ్య, కే శ్రీనివాస్, ఎం గోపి నాయక్, జి మనోహర్, జి చైతన్య, కె కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ నగర్ లో బోనాలు




**విశ్వంభర, ఎల్బీనగర్ :** మహేశ్వరం నియోజకవర్గం ఆర్కే పురం డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ లోని కురుమ సంఘం ఆధ్వర్యంలో బీరప్ప స్వామి, అక్క మహంకాళి బోనాలు పండుగ వేడుకలకు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతికి బోనాల పండుగ ప్రతీక అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్కే పురం డివిజన్ కురుమ సంఘం చైర్మెన్ నరసింహ, సెక్రటరీ కోరే ఐలయ్య, చంద్రయ్య, ఐలయ్య, అగ్గే వెంకటేష్, మహేష్, భూమండ్ల మహేష్, శ్రవణ్ , తోటకూర లింగ స్వామి, బర్మా శ్రీధర్, శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి, ఇద్దరికీ గాయాలు



**విశ్వంభర, ఆమనగల్లు :** గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి చెందగా, ఇద్దరికి గాయాలు అయినా సంఘటన ఆమనగల్లు మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఆమనగల్ పట్టణానికి చెందిన సామల మణికంఠ అతని స్నేహితులు శ్రీనివాస్, మణికిరణ్, విఠాయిపల్లి దగ్గరలోని టీ స్టాల్ దగ్గరకు వెళుతుండగా కాటన్ మిల్లు సమీపంలో హైదరాబాదు నుండి శ్రీశైలం వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ముగ్గురు అపస్మారక స్థితిలోకి వెళ్లారు విషయం తెలుసుకున్న కుటుంబీకులు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించగా అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సామల మణికంఠ (18) మరణించాడు.
మిగతా ఇద్దరూ చికిత్స పొందుతున్నారు మణికంఠ తండ్రి సామల హరిప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వెంకటేష్ తెలిపారు

## భారీగా గంజాయి పట్టివేత

**విశ్వంభర, శంషాబాద్ :** 800 కేజీల భారీ గంజాయిని కంటైనర్ లో తరలిస్తుండగా రంగారెడ్డి జిల్లా శంషాబాద్ ఓ ఆర్ ఆర్ పెద్ద గోల్కొండ వద్ద ఎస్ ఓ టి పోలీసులు పట్టుకున్నారు.వీటి విలువ దాదాపు 2 కోట్ల 94 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. సైబరాబాద్ ఎస్ ఓ టి డీసీపీ డి.శ్రీనివాస్ పర్యవేక్షణ లో శంషాబాద్ డీసీపీ రాజేష్, అడిషనల్ డీసీపీ శోభన్ కుమార్, కె ఎస్.రావు ఏసీపీ శంషాబాద్, శివకుమార్ ఇన్స్పెక్టర్ శంషాబాద్, ఎస్ ఓ టి బాలానగర్, టిజిఏఎన్ బి టీం పాల్గొని చాకచక్యంగా గంజాయి తరలిస్తున్న డీసీఎం కంటైనర్ ను పట్టుకున్నారు.800 కేజీల గంజాయి కంటెయినర్ లో ఓ వాహనం ఒడిశా నుంచి మహారాష్ట్రకు హైదరాబాద్ మీదుగా వెళ్తున్నట్లుగా విచారణలో పోలీసులు గుర్తించారు.ఈ స్థాయిలో గంజాయి తరలిస్తూ పట్టుబడటం ఇదే తొలిసారి అని పోలీసులు తెలిపారు.ఈ వ్యవహారంలో ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.డీసీఎం డ్రైవర్ లు సంజీవ్ విఠల్ రెడ్డి ,హోల్లప్ప,సప్లయర్ సునీల్ ఖోస్లా,జాగ సునాలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరకుకు చెందిన వ్యక్తి గంజాయి సరఫరాదారుగా ఉన్నాడని, అతని పేరు రాము అని తెలిపారు. అతను ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు మీడియాకు విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు.



# రుచికి చేదు.. ఆరోగ్యానికి అమృతం..

కాకరకాయను తలచుకోగానో దీని చేదు స్వభావం ముందుగా కళ్ల ముందు కదలాడుతుంది. చేదుగా ఉంటే కాకరను ఎలా తింటాంరా బాబూ అని చాలా మంది దూరం పెడుతుంటారు. అయితే కొంతమందికి మాత్రం కాకరకాయ పిచ్చిపిచ్చిగా నచ్చుతుంది. రోజువారీ ఆహారం కాకరను తప్పనిసరిగా వినియోగిస్తారు. రుచికి చేదు అయినా ఆరోగ్యానికి అమృతం లాంటింది. ఎంతో మందికి కాకర వల్ల కలిగే ప్రయోజనాలు తెలియవు. దానిలో ఉండే పోషక విలువలు తెలిస్తే ఇక వదులుకోరు. కాకర ఆస్తమా, జలుబు, దగ్గు వంటి మొదలైన శ్వాస సంబంధిత సమస్యల నివారణకు అద్భుతవమైన ఔషధంగా పనిచేస్తుంది. కాకర జ్యూస్ తాగితే లివర్ సమస్యలు తగ్గుతాయి.

**అసలు మనిషి ఆరోగ్యానికి కాకరకాయ ఎలా ఉపయోగపడుతుంది అనే విషయంలో అనేక క్లినికల్ అధ్యయనాలు జరిగాయి. ఈ అధ్యయనాలలో దీనిని తినడం ఆరోగ్యానికి ఎక్కువ మేలు చేస్తుందని వెల్లడైంది. మనలో చాలా మంది కాకరను రుచి కారణంగా తినడానికి పెద్దగా ఆసక్తి చూపకపోయినా, సమృద్ధిగా ఉన్న ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలుసుకున్న తర్వాత, మీరు బహుశా మీ ఆలోచనను మార్చుకోవచ్చు. దీనితో కడుపు నొప్పి, మధుమేహం, కాన్సర్, గుండె జబ్బులు వంటి సర్వ రోగాలకు నివారిణిగా పనిచేస్తుంది. ఎంతో మేలు చేస్తుంది.**





## మలబద్దకం, జీర్ణాశయం వ్యాధులు నివారణ



కాకరను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఆరోగ్యంపై సానుకూల ప్రభావాన్ని చూపుతుంది. ఇది మలబద్ధకం, కడుపు నొప్పి వంటి పేగు రుగ్మతలను నయం చేయడమే కాకుండా, జీర్ణవ్యవస్థలోకి ప్రవేశించే పరాన్నజీవులను చంపడానికి సహాయపడుతుంది. అంతేకాక ఇది యాంటీఆక్సిడెంట్లను కలిగి ఉంటుంది. జీర్ణ ఎంజైమ్లను ప్రేరేపించడానికి, జీర్ణక్రియకు ఉపకరిస్తుంది. అధిక ఫైబర్ ఉన్నందు వల్ల మంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి కాకరను వైద్యులు సిఫార్సు చేస్తారు.

## డయాబెటిస్



కాకర డయాబెటిస్ నిర్వహణకు సహాయపడుతుంది. డయాబెటిస్‌తో బాధపడుతున్న ఎవరికైనా దీనిని తరచుగా తీసుకోవాలని సూచిస్తారు. ఇందులో యాంటీ-డయాబెటిక్ లక్షణాలతో కూడిన మూడు క్రియాశీల పదార్థాలు ఉన్నాయి. అవి పాలీపెప్టైడ్-పి, వైసిన్, చరణి. ఇవి ఇన్సులిన్ లాంటి లక్షణాలు కలిగి రక్తంలో గ్లూకోజ్ విలువలను తగ్గించే ప్రభావాలను కలిగి ఉంటాయని నిర్ధారణ జరిగింది. రక్తంలో షుగర్ లెవల్స్‌లను తగ్గించడంలో చురుకుగా పనిచేస్తాయి. అంతేకాక కాకరలో లెక్టిన్ ఉందని, ఇది ఆకలిని అణచివేయడం,పరిధీయ కణజాలాలపై పనిచేయడం ద్వారా శరీరంలోని రక్తంలో గ్లూకోజ్ లెవల్స్‌ను తగ్గించడానికి సహాయపడుతుంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం రోజూ ఉదయం కాకర జ్యూస్‌ను ఖాళీ కడుపుతో తీసుకోవడం వల్ల మీ డయాబెటిస్‌ను అదుపులో ఉంచుకోవచ్చు. దీనిలో పీచు లక్షణాలు అధికంగా కలిగిఉండడం వల్ల తేలికగా అరుగుతుంది. ఈ ఆహారం అరుగుదలకు, మలబద్ధకం, అజీర్తి సమస్యల నివారణలో సహాయపడి శరీరం నుండి చెత్తను తొలగిస్తుంది.


## రోగనిరోధక శక్తిని పెంచుతుంది.

కాకరలో విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. దీనిలో యాంటీఆక్సిడెంట్ లక్షణాలు పుష్కలంగా లభిస్తాయి. మానవ శరీరానికి యాంటీఆక్సిడెంట్లు అవసరం. ఇది రోగనిరోధక కణాలు,తెల్ల రక్త కణాలు (డబ్ల్యూసీ) పెంచడానికి సహాయపడుతుంది. రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడమే కాకుండా, అలెర్జీని నివారించడంలో సహాయపడుతుంది. కాకర కాయలు, ఆకులను నీటిలో ఉడకించి తీసుకోవడం వల్ల అంటు రోగాలు దరిచేరకుండా ఉంటాయి.



## క్యాన్సర్ నుండి రక్షిస్తుంది

ఫ్రీ రాడికల్స్ క్యాన్సర్‌కు ప్రధాన కారణం. అవి మన శరీరం పనిచేసే విధానాన్ని ప్రభావితం చేస్తాయి. నిందుకు మన శరీరాన్ని ఫ్రీ రాడికల్స్ లేకుండా చూసుకోవాలి. ఫ్రీ రాడికల్స్.. ధూమపానం, కాలుష్యం,ఒత్తిడితో అధికంగా పెరుగుతుంది. కావున కారలో లైకోపీన్, లిగ్నన్స్, కెరోటినాయిడ్లు ఉంటాయి. ఎక్కువ మొత్తంలో విటమిన్ ఎ, జియా-శాంథిన్,లుటిన్ ఉన్నాయి. ఇవి ప్రాధమిక యాంటీ ఆక్సిడెంట్లు, పోషకాలు ఫ్రీ రాడికల్స్‌తో పోరాడతాయి. దీంతో చివరకి మన శరీరంలో కణితులు ఏర్పడటాన్ని తగ్గిస్తుంది.




## కొలెస్ట్రాల్‌ను నియంత్రిస్తుంది

అధిక స్థాయిలో కొలెస్ట్రాల్ ఉండటం వల్ల ధమనులలో కొవ్వు ఫలకం ఏర్పడుతుంది, ఇది గుండె రక్తాన్ని పంప్ చేయడానికి కష్టపడి పనిచేస్తుంది. హృదయ సంబంధ వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుంది. కాకర చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది. పుష్టి ఆరోగ్యానికి తోడ్పడటానికి మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది. కాకరలో పొటాషియం, మెగ్నీషియం, కాల్షియం అధిక మొత్తంలో ఉంటాయి. ఇవన్నీ గుండెపై సానుకూల ప్రభావాన్ని చూపుతాయి.



## అధిక బరువును తగ్గిస్తుంది

కాకరలో గొప్ప పోషకాలు ఉండటం వల్లగా బరువు తగ్గించే ఆహారంగా సహకరిస్తుంది. 100 గ్రాముల కాకరలో 16 కేలరీలు, 0.15 గ్రాముల కొవ్వు, 0.93 గ్రాముల ప్రోటీన్, 2.6 గ్రాముల ఫైబర్ మాత్రమే ఉంటాయి. అందువల్ల, మన బరువుకు అదనపు పౌండ్లను జోడించకుండా తగ్గిస్తుంది. పోషకాలు జీవక్రియను పెంచడంలో సహాయపడతాయి. జంక్, అనారోగ్యకరమైన స్నాక్స్ మీద ఆధారపడకుండా చేస్తుంది. కాకర రసం తాగడం ద్వారా ఉబకాయం తగ్గుముఖం పడుతుంది. కాకరలో విటమిన్ సి, పొటాషియం, మెగ్నీషియం, ఐరన్, మంచి ప్రోటీన్, ఫైబర్ ఉన్నాయి. ఇవన్నీ మిమ్మల్ని రోజంతా ఉల్లాసంగా ఉంచుతాయి.





## చర్మాన్ని అందంగా చేస్తుంది

మొటిమలు, మచ్చలు, చర్మ అంటు వ్యాదులను తొలగిస్తుంది. నిమ్మరసంతో కాకరను ప్రతిరోజు పరగడుపున 6 నెలలు తీసుకుంటే సరైన ఫలితాలు పొందుతారు. చర్మాన్ని ముడతలు లేకుండా ఉంచడంలో, అకాల వృద్ధాప్యాన్ని నివారించడంలో విటమిన్ సి ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఇది కొల్లాజెన్ ఉత్పత్తికి సహాయపడుతుంది. ఇది చర్మం సున్నితత్వానికి కారణమవుతుంది. ఇంకా సోరియాసిస్ , తామర చికిత్సకు సహాయపడుతుంది.సూర్యుడి నుంచి హానికరమైన యూవీ కిరణాల నుండి చర్మాన్ని రక్షిస్తుంది.

## రక్తాన్ని శుద్ధి చేస్తుంది కాలేయాన్ని శుభ్రపరుస్తుంది

కాకరకు గల యాంటీమైక్రోబయల్, యాటీఆక్సిడెంట్ లక్షణాలు మన శరీరంలోని చెత్తను తొలగించడంలో సహాయపడతాయి. అంతేకాక ఇది మీ కాలేయంలో స్థిరపడిన అన్ని రకాల మత్తులను తుడిచిపెట్టడానికి దోహదపడుతుంది. అందువల్ల ఇది అనేక కాలేయ సమస్యలను నయం చేస్తుంది. అలాగే మీ పేగును శుభ్రపరుస్తుంది. ఇది మూత్రాశయం సరైన పనితీరుకు సహాయపడుతుంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. మీరు హ్యాంగోవర్ అయితే, చేదుకాయ రసం తీసుకోవడం వల్ల మన శరీరం నుంచి ఆల్కహాల్ మత్తును తగ్గించి చురుకుగా ఉంటారు.



## కళ్ళను ఆరోగ్యంగా ఉంచుతుంది

కంటి చూపు, కంటిశుక్లం వంటి దృష్టి సంబంధిత సమస్యలను నివారించడంలో కాకర సహాయపడుతుందని వైద్యులు, ఆరోగ్య నిపుణులు అంటున్నారు. దీనిలో విటమిన్ ఏ, బీటా కెరోటిన్ నిండి ఉంటాయి. ఇవి కళ్ళకు ఆరోగ్యంగా ఉంటాయి. అంతేకాక కళ్ల కింద నల్లడి వలయాలను తగ్గించేందుకు మంచి నివారణగా ఉపకరిస్తుంది.



## జుట్టుకు మెరుపు అందిస్తుంది.

కాకర జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. జుట్టు మంచి ఆరోగ్యానికి తోడ్పడుతుంది. దీనిలో ప్రోటీన్, జింక్.విటమిన్ సి వంటి భాగాలు జుట్టును ఆరోగ్యంగా, బలంగా ఉంచుతాయి. జుట్టుకు కాకర జ్యూస్‌ను రాయడం వల్ల మూలాలు బలోపేతం అవుతాయి. స్ప్లిట్ ఎండ్స్, హెయిర్ ఫాల్ వంటి సమస్యలు చికిత్స అందుతుంది. ఇది జుట్లును షైన్‌గా ఉండటంలో సహాయపడుతుంది.

## ఆహారపు అలవాట్లతో ఇమ్యూనిటీ పెరగొచ్చా?

ప్రపంచ వ్యాప్తంగా కరోనా వైరస్ దెబ్బతో అన్ని దేశాలు అల్లాడుతున్నాయి. ఈ నేపథ్యంలో కరోనాను నియంత్రించేందుకు రోగనిరోధక శక్తి(ఇమ్యూనిటీ)పెంచుకోవడమే ఏకైక మార్గమని మెజారిటీ ప్రజలు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇమ్యునాలజీ నిపుణులు రోగనిరోధక శక్తిపై ప్రజలకు అవగాహన కలిగించే ప్రయత్నం చేశారు. ప్రజలు రోగనిరోధకశక్తిను పెంచుకునేందుకు మార్కెట్లలో రకరకాల పండ్ల జ్యూస్‌లు, విటమిన్ ట్యాబ్లెట్లు వాడుతున్నారు. నిజంగా ఆహారపు అలవాట్లు, విటమిన్ ట్యాబ్లెట్లతో కరోనాను నివారించవచ్చా తెలుసుకుందాం. రోగనిరోధక శక్తి అనేది సంక్లిష్టమైన అంశమని, ప్రజలకు ఇంకా పూర్తిగా ఈ అంశంపై అవగాహన రాలేదని సీఎస్ఐఆర్ (కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్) మాజీ డైరెక్టర్, ఇమ్యునాలజీ నిపుణులు రామ్ విశ్వకర్మ తెలిపారు. ఆయన స్పందిస్తు.. ముఖ్యంగా మనిషి తీవ్రంగా రోగగ్రస్తులను చేసే యాంటిజన్స్(వ్యాధి కారకం)ను ఎదుర్కొనేందుకు సహజసిద్ధంగా శరీరంలో యాంటిబాడీస్(యాంటీజన్స్‌ను ఎదుర్కొనేవి) ఉంటాయి. మరోవైపు సహజ రోగనిరోధక శక్తి (ఇన్నేట్ ఇమ్యున్ రెస్పాన్స్) మానవుని నిరంతరం కాపాడుతూ ఉంటుంది.

సహజ రోగనిరోధక శక్తిలో తెల్లరక్తకణాల, న్యూట్రోఫిల్స్, టీసెల్స్(కణాలు), బీసెల్స్(కణాలు), యాంటిబాడీస్‌లతో కూడిన రక్షణాత్మక వ్యవస్థ కాపాడుతూ ఉంటుంది. కాగా ఈ కణాలను సైటోకైన్స్ ఉత్పత్తి చేస్తాయి. సైటోకైన్స్ అనేది ప్రొటీన్ ఇమ్యూన్ కణాలకు సిగ్నలింగ్ వ్యవస్థ లాంటిది. ఆహారపు అలవాట్ల ద్వారా రోగనిరోధక శక్తిని పెంచుకోలేమని అన్నారు. సాధారణంగా కొందరు తమకు రోగనిరోధక శక్తి తక్కువగా ఉందని చెబుతుంటారు. వారికి ఎక్కువగా వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంటుంది. విటమిన్ సీ, జింక్ ట్యాబ్లెట్లతో రోగనిరోధకశక్తి పెంచుకోవచ్చనే అపోహలు ఉన్నాయి. మరోవైపు ఈ ట్యాబ్లెట్ల ద్వారా కిడ్నీ, లివర్ తదితర వ్యాధులతో చాలా మంది సతమతమవుతున్నారని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడమే మేలైన మార్గమని రామ్ విశ్వకర్మ పేర్కొన్నారు. 1962లో నోబెల్ బహుమతి పొందిన పాలింగ్ కూడా విటమిన్ సీ, జింక్ ట్యాబ్లెట్లు ఏ మాత్రం ప్రభావం చూపవని తెలిపారు. కానీ ఆహారం ద్వారానే రోగనిరోధక శక్తి లభిస్తుందని ప్రకృతి, ఆయుర్వేద నిపుణులు గట్టిగా చెబుతున్నారు.

కానీ అందరు ఏకీభవించేది మాత్రం వ్యాయామం. జీవనశైలి మార్పులతో ఇమ్యూనిటీ పెంచుకోవచ్చని అందరు ఏకీభవీస్తున్నారు. మానవ శరీరంలో రక్షణాత్మక వ్యవస్థను బలంగా ఉంచే సైటోకైన్స్, న్యూట్రోఫిల్స్, టీకణాలు, బీకణాలు వ్యాయామంతో బలోపేతమవుతాయని అల్లోపతి, ఆయుర్వేద, అన్ని రంగాల నిపుణులు ఏకీభవిస్తున్నారు. రోజుకు ఒక గంట వ్యాయామంతో రక్షణాత్మక వ్యవస్థను బలోపేతం చేసే అన్ని కణాలు ఉత్తేజితమవుతాయని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.



# అరటితో కలిగే లాభాల గురించి తెలుసా!

**సీజన్‌తో సంబంధం లేకుండా ఎల్లప్పుడూ లభించే పండు అరటి. ఈ పండ్లతో బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని మీకు తెలుసా. అరటి పండు తినడం వల్ల బరువు పెరుగుతారని చాలా మంది అభిప్రాయపడుతుంటారు. కానీ బరువు తగ్గేందుకు ఇది చక్కటి ఔషధంగా పనిచేస్తోందని ఫిట్‌నెస్ నిపుణులు అంటున్నారు. కేవలం బరువు తగ్గడం మాత్రమే కాకుండా ఆరోగ్యానికి అరటి ఎంతో మేలు చేస్తుంది. రోజువారీ తీసుకునే ఆహారంలో కనీసం ఒక అరటిపండు చేర్చడం వల్ల ఎన్నో సత్ఫలితాలను ఇస్తుంది. అలాగే వీటి ధర కూడా సామాన్యుడికి అందుబాటులోనే ఉంటుంది. త్వరగా జీర్ణం అవుతుంది కాబట్టి ప్రతిరోజు వీటిని స్వీకరించవచ్చు.**




## అరటితో ప్రయోజనాలు

ఉదయం అరటిపండును తింటే మెదడు చురుగ్గా పనిచేస్తుంది. అరటిలో శరీరానికి సరిపడా కాల్షియం, ఐరన్ ఉంటుంది. ఇందులో ఉండే పొటాషియం బీపీని తగ్గించి గుండె పనితీరును మెరుగుపరుస్తుంది. అరటి పండ్లలో విటమిన్ ఎ,బి,సి పుష్కలంగా ఉంటాయి. పరగడపున అరటి తీసుకోవడం వల్ల శక్తి వస్తుంది. తిన్న తక్షణమే శరీరానికి శక్తి అందుతుంది. కడుపులో పుండ్లకు అరటిపండు మంచి ఔషధంలా పనిచేస్తుంది. అరటి శక్తి సంపదగా పనిచేస్తుంది. జీర్ణాశయాన్ని మెరుగు పరిచేందుకు సహకరిస్తుంది. వ్యాధి నిరోధక శక్తి పెంపొందడంలో.. అల్సర్లను తగ్గించడంలో అరటి పండు కీలక పాత్ర పోషిస్తుంది. కండరాల బలహీనతను నివారించడంలో సహకరిస్తుంది.

పండిన అరటి పండ్లలో పీచు పదార్థాలు అధికంగా ఉండటం వల్ల మలబద్ధకం నుంచి ఉపశమనం లభిస్తుంది. డయేరియాతో బాధపడేవారు ఇవి తింటే మంచిది. అరటి పండు కండరాలు పట్టివేయడాన్ని, కీళ్ళ నొప్పిని నివారిస్తుంది. అరటిని అ?ల్పాహారంగా తీసుకోవడం వల్ల ఆకలిని తగ్గిస్తుంది. దీనికి అరటిలో ఉంటే ఫైబర్ కారణం. కాబట్టి అతిగా ఆహారం తీసుకోవడం తగ్గించవచ్చు. వ్యాయాయం తర్వాత అరటి పండు తీసుకోవడం వల్ల వర్కౌట్ల సమయంలో కలిగే నొప్పిని తగ్గిస్తుంది. ది అమెరికన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ న్యూట్రిన్‌లో ప్రచురించబడిన అధ్యయనంలో ఇది తేలింది. అరటిపండు తినడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచి తరచూ అనారోగ్యానికి గురికావడం తగ్గిస్తుంది.

అరటి పండ్లలో మెగ్నీషియం, పొటాషియం పుష్కలంగా ఉంటాయి. ఇవి కండరాలకు విశ్రాంతినిచ్చి చక్కటి నిద్రపట్టేలా చేస్తాయి. నిద్రిస్తున్నపుడు రక్తపోటుని అరటి పండు నియంత్రిస్తుంది. అరటిలోని పొటాషియం శరీరంలోని టాక్సిన్లను తొలగిస్తుంది. అరటి పండు తినడం వల్ల ఒత్తిడి తగ్గుతుంది. రాత్రిపూట పాలు, అరటిపండు తీసుకుంటే నిద్ర బాగా పడుతుంది. వీటిని తినడం వల్ల రక్తపోటు తగ్గుతుంది. క్యాన్సర్, ఉబ్బసం ప్రమాదాన్ని తగ్గించవచ్చు.

ఇక అరటితో ఆరోగ్యానికే కాకుండా అందానికి కూడా లాభాలు పుష్కలంగా ఉన్నాయి. అరటి వృద్ధాప్య ఛాయలను దరిచేరనీయదు. బాగా మగ్గిన అరటి పండును మెత్తగా చేసి కొద్దిగా తేనె కలిపి.. ఆ మిశ్రమాన్ని ముఖానికి రాసుకుంటే చర్మం కాంతివంతంగా మెరుస్తుంది. అరటి రక్తప్రసరణను మెరుగు పరుస్తుంది. మగ్గిన అరటి పండును నలిపి మాడుకు, జుట్టుకు పట్టించి ఇరవై నిమిషాల ఆగాక షాంపూ చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల జుట్టు ఆరోగ్యవంతంగా తయారవుతుంది.



## లవ్ జిహాద్ కేసుల్లో యావజ్జీవ ఖైదు విధించేలా నూతన చట్టం: హిమంత బిశ్వ శర్మ



**గువహటి:** లవ్ జిహాద్ కేసుల్లో జీవిత ఖైదు విధించేలా తమ ప్రభుత్వం చట్టాన్ని తీసుకొస్తుందని అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ పేర్కొన్నారు. గువహటిలో ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ లవ్ జిహాద్ గురించి తాము ఎన్నికల సందర్భంగా మాట్లాడామని, త్వరలో దీనిపై చట్టాన్ని తీసుకొస్తామని చెప్పారు. ఇలాంటి కేసుల్లో యావజ్జీవ కారాగార శిక్ష విధించేలా చట్టంలో పొందుపరుస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే నూతన నివాస విధానాన్ని తీసుకొస్తుందని, ఈ విధానం ప్రకారం అసోంలో జన్మించిన వారికే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు పొందే అర్హత ఉంటుందని చెప్పారు.ఎన్నికల హామీల ప్రకారం లక్ష ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామని, వాటిలో స్థానిక యువతకే అత్యంత ప్రాధాన్యత లభిస్తుందని స్పష్టం చేశారు. హిందూ, ముస్లింల మధ్య భూ విక్రయాలపై కూడా రాష్ట్ర ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకుందని చెప్పారు. ఈ తరహా లావాదేవీలను ప్రభుత్వం నిరోధించకపోయినా వీటిపై ముందుకెళ్లే ముందు సీఎం అనుమతి తీసుకోవడం తప్పనిసరి చేసిందని హిమంత బిశ్వ శర్మ పేర్కొన్నారు.

## వక్ఫ్ బోర్డ్ స్వయం ప్రతిపత్తిని తొలగించేందుకు మోదీ సర్కార్ కుయుక్తులు

- బీజేపీ తొలి నుంచీ ఈ బోర్డులకు, వక్ఫ్ ఆస్తులకు వ్యతిరేకం
- ఏఐఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఓవైసీ



**విశ్వంభర, హైదరాబాద్:** వక్ఫ్ బోర్డ్ చట్టాన్ని సవరించేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నద్ధమవుతున్న వార్తలపై ఏఐఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఓవైసీ స్పందించారు. వక్ఫ్ బోర్డు స్వయం ప్రతిపత్తిని తొలగించి దాన్ని తమ చెప్పుచేతల్లోకి తీసుకోవాలని మోదీ సర్కార్ యోచిస్తోందని ఆరోపించారు. వక్ఫ్ బోర్డు వ్యవహారాల్లో జోక్యం చేసుకోవాలని కేంద్రం భావిస్తున్నదని అన్నారు.పార్లమెంట్ సమావేశాలు జరుగుతుండగా కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ ఔన్నత్యం, హక్కులకు భిన్నంగా పార్లమెంట్‌లో వెల్లడించని విషయాలపై మీడియాకు సమాచారం అందిస్తున్నదని ఓవైసీ మండిపడ్డారు. మీడియా కథనాల ప్రకారం వక్ఫ్ బోర్డు స్వయం ప్రతిపత్తిని మోదీ ప్రభుత్వం తొలగించాలని యోచిస్తోందని వెల్లడవుతున్నదని చెప్పారు. బీజేపీ తొలి నుంచీ ఈ బోర్డులకు, వక్ఫ్ ఆస్తులకు వ్యతిరేకమని, కాషాయ పాలకులు హిందుత్వ అజెండాపై పనిచేస్తున్నారని ఆరోపించారు.ప్రస్తుతం వక్ఫ్ చట్టానికి సవరణలు చేపడితే నిర్వహణ పరమైన ఇబ్బందులు ఎదురవుతాయని వక్ఫ్ బోర్డు ప్రభుత్వం నియంత్రణలోకి వెళ్లిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వక్ఫ్ బోర్డు స్వతంత్ర ప్రతిపత్తి దెబ్బతింటుందని పేర్కొన్నారు. వివాదాస్పద ఆస్తులు ఏమైనా ఉంటే బీజేపీ పాలకులు, సీఎంలు వాటిపై సర్వే చేయిస్తామని చెబుతారని, ఆపై వీరి సర్వే ఎటు దారితీస్తుందనేది తెలిసిన విషయమేనని పేర్కొన్నారు.దేశంలో ఎన్నో దర్గాలు అసలు దర్గాలు, మసీదులు కాదని బీజేపీ-ఆరెస్సెస్ చెబుతున్నాయని అన్నారు. న్యాయవ్యవస్థ అధికారాలను కార్యనిర్వాహకవర్గం లాగేసుకునేందుకు ప్రయత్నిస్తోందని ఓవైసీ దుయ్యబట్టారు. కాగా, వక్ఫ్ చట్టానికి సవరణలు తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తోందని వార్తలు వెల్లడయ్యాయి. కాగా, రానున్న పార్లమెంట్ సమావేశాల్లో ఈ చట్టానికి దాదాపు 40 సవరస్త్రణలు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నద్ధమవుతున్నదని చెబుతున్నారు.

## లాలూ, నితీష్, బీజేపీ నుంచి బిహారీలకు విముక్తి

### జన్ సురాజ్ పార్టీ ఏర్పాటుపై ప్రశాంత్ కిషోర్



**పాట్నా:** జన్ సురాజ్ మిషన్‌పై ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ కీలక వ్యాఖ్యలు చేశారు. అక్టోబర్ 2న ప్రశాంత్ కిషోర్ రాజకీయ పార్టీని స్థాపించడం లేదని, కోటి మంది బిహార్ ప్రజలు తమ పిల్లల భవితవ్యం కోసం, 30 ఏండ్ల లాలూ, నితీష్, బీజేపీల పాలనకు పాతరేసేందుకు నూతన పార్టీతో ముందుకొస్తారని స్పష్టం చేశారు.ఈ పార్టీల నుంచి బిహారీలకు విముక్తి ప్రసాదించడమే జన్ సురాజ్ లక్ష్యమని తెలిపారు. ప్రశాంత్ కిషోర్ పాత్ర గతంలో మాదిరే ఉంటుందని చెప్పారు. కోటి మంది బిహారీలు పార్టీ ఏర్పాటు చేసేందుకు ఏకమవడం ఇదే తొలిసారని ఆయన పేర్కొన్నారు. కాగా, ప్రముఖ రాజకీయ స్ట్రాటజిస్ట్ ప్రశాంత్ కిషోర్ 'జన్ సురాజ్ అభియాన్' రాజకీయ పార్టీగా మారేందుకు ముహుర్తం ఖరారైంది.అక్టోబర్ 2న జన్ సురాజ్ ఆవిర్భవించనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు యుద్ధప్రాతిపదక సాగుతున్నాయి. పార్టీ ఏర్పాటు దిశగా ఎనిమిది రాష్ట్ర స్థాయి సమావేశాలను జన్ సురాజ్ నిర్వహించనుంది. ఈ సమావేశాల తేదీల వివరాలు కూడా త్వరలో ఖరారు కానున్నాయి. బీహార్ వ్యాప్తంగా 1.5 లక్షల మందిని సమీకరించాలని ప్రశాంత్ కిషోర్ సారథ్యంలోని జన్ సురాజ్ నిర్ణయించింది.

# స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి




**విశ్వంభర, నల్లగొండ:** ఈనెల 5 నుండి 9 వరకు నిర్వహించనున్న స్వచదనం-పచ్ఛదనం కార్యక్రమానికి అవసరమైన అన్నిఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. స్వచదనంపచ్ఛదనం కార్యక్రమం పై ఆదివారం అయన ఆర్డీవోలు, నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు,ఎంపిడివోలు, పంచాయతీరాజ్ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 5 నుండి 9 వరకు జిల్లాలోని అన్ని గ్రామాలు, మున్సిపాలిటీలలో స్వచ్ఛదనం-పచ్ఛదనం కార్యక్రమం నిర్వహించేందుకు ఇదివరకే ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు. స్వచ్ఛదనం- పచ్ఛదనం కార్యక్రమంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ వివరిస్తూ పరిశుభ్రతలో భాగంగా మురికి కాలువలను శుభ్రం చేయాలని, మురికి కాలువలలో పూడిక తీయాలని, పిచ్చి మొక్కలు తొలగించాలని చెప్పారు. మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటడం, గుబురుగా పెరిగిన మొక్కలను కత్తిరించి అందంగా తీర్చిదిద్దడం, కొత్త మొక్కలను నాటే కార్యక్రమాలను చేయాలన్నారు. తాగునీరు, నీటి సంరక్షణ నిర్మాణాలలో భాగంగా గ్రామీణ ప్రాంతాలలో ప్రతి 1000 మంది జనాభాకు ఒక కమ్యూనిటీ సోక్ పిట్,10 వ్యక్తిగత సోక్ పిట్ల నిర్మాణం చేపట్టాలని,పట్టణ ప్రాంతాలలో వార్డ్ కు 5 చొప్పున నిర్మించాలన్నారు డ్రైడే ఫ్రైడే , సీజనల్ వ్యాధులపై ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్, స్ప్రే చేయాలని, గ్రామ పంచాయతీ , మున్సిపాలిటీ వాహనాలకు జిపి ఎస్ మిషన్లు ఏర్పాటు చేయాలని, వారసత్వ ,చారిత్రక కట్టడాలను సంరక్షించాలని ఆదేశించారు సోమవారం ప్రారంభించే ప్రారంభ కార్యక్రమానికి ఆయా నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాలలో పార్లమెంట్ సభ్యులు,శాసన మండలి సభ్యులు ,శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులందరినీ ఆహ్వానించాలని, ఏర్పాట్లన్ని ఆదివారమే పూర్తి చేయాలని, ప్రత్యేకించి నియోజకవర్గ నోడల్ అధికారులు,మండలాల ప్రత్యేక అధికారులు ఈ విషయంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని అన్నారు. కార్యక్రమం ప్రారంభం సందర్భంగా "స్వచ్ఛదనం పచ్ఛదనం" ప్రాముఖ్యతను ప్రజలకు వివరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు ,ఉపాధి హామీ పథకం కూలీలు, యువత, విద్యార్థులు, ఆశ, అంగన్వాడిలు అందర్నీ భాగస్వాములు చేయా లని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమం పై విస్తృత ప్రచారం కల్పించాలని, ఇందుకు మీడి యాను సైతం భాగస్వామ్యం చేయాలని సూచించారు.కళాజాత ద్వారా ప్రజలకు ప్రచారం కల్పించాలన్నారు. 5 రోజులపాటు పూర్తి నిబద్ధతతో కార్యక్రమాన్ని నిర్వహించాలని చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు,వార్డ్ అధికారుల సేవలు తీసుకోవాలన్నారు. అన్ని స్థాయిలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని అన్నారు స్థానిక సంస్థల అధనపు కలెక్టర్ టీ. పూర్ణచంద్ర,అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు, ఆర్డీవోలు తదితరులు ఈ టెలికాన్ఫరెన్స్ లో మాట్లాడారు.



## డిండి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను ఆమోదించి పనులు పూర్తి చేయాలి

- నల్లగొండ జిల్లా కేంద్రంలో ఆగస్టు 9న జరిగే సదస్సును జయప్రదం చేయండి
- సిపిఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి పిలుపు
- మర్రిగూడ మండల కేంద్రంలో కరపత్రాల ఆవిష్కరణ

**విశ్వంభర, మర్రిగూడ:** నల్లగొండ జిల్లాలో దుర్భిక్షనికి గురయ్యే మునుగోడు, దేవరకొండ ప్రాంతాలకు సాగునీరు ఇవ్వడంలో పాలక పార్టీలు తీవ్ర నిర్లక్ష్యం చేశాయని ప్రాజెక్టుల డిపిఆర్ ను ఆమోదించి నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలని కోరుతూ ఆగస్టు 9న నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగే సదస్సు కు వేలాదిగా పాల్గొని జయప్రదం చేయవలసిందిగా సిపిఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈరోజు సిపిఎం ఆధ్వర్యంలో మర్రిగూడ మండల కేంద్రంలో కరపత్రాలు ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ అత్యధిక ఫ్లోరిన్ ఈ ప్రాంతంలోనే ఉన్నదని దీనివల్ల ప్రజల తీవ్రమైన అనారోగ్యాన్ని గురవుతున్నారని అన్నారు. సాగునీరు లేకపోవడం వలన భూములు బీడులుగా మారాయని తెలిపారు. కూలీలు,ప్రజలు గ్రామాలకు గ్రామాలు వలసలు పోయే పరిస్థితి దాపురించిందని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం గత పది సంవత్సరాల అధికారంలో కొనసాగిన ఫ్లోరిన్ బాధితుల గురించి ఉపన్యాసాలు ఇచ్చినప్పటికీ తాగునీరు, సాగునీరు అందించడానికి అవసరమైన డిండి ఎత్తిపోతల పథకాన్ని డిపిఆర్ ఆమోదించకపోవడం చాలా అన్యాయం అన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు జీవోఎంఎస్ నెంబర్ 105 ద్వారా డీపీఆర్ ను ఆమోదించారని కానీ 107 జీవో ద్వారా డిండి ఎతిపోతుల పథకం డీపీఆర్ ను ఆమోదించలేదని తెలిపారు. మునుగోడు న దేవరకొండ నియోజకవర్గం ప్రజలకు తీరని అన్యాయం జరిగిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు గడిచినప్పటికీ డిండి ప్రాజెక్టు విషయంలో దృష్టి సారించలేదని ప్రభుత్వం ఇప్పటికైనా వెంటనే డిపిఆర్ ను ఆమోదించి తగినన్ని నిధులు విడుదల చేసి ప్రాజెక్టులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు పూర్తి కోసం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఇటీవల సిపిఎం ఆధ్వర్యంలో ప్రాజెక్టుల పరిశీలన చేయడం జరిగిందని అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని ప్రాజెక్టుల మంత్రి ఉత్తమకుమార్ రెడ్డి కలిసి వినతి పత్రం అందించినట్లు తెలియజేశారు ఈ ప్రాజెక్టుల పూర్తి కి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఆగస్టు 9న శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగే సదస్సుకు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని జయప్రదం చేయవలసిందిగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు నాగార్జున బండ శ్రీశైలం మరిగూడ మండల కార్యదర్శి వేర్పుల యాదయ్య నాంపల్లి మండల కార్యదర్శి నాంపల్లి చంద్రమౌళి సిపిఎం నాయకులు బొట్టు శివకుమార్ మైల సత్తయ్య కొమ్ము లక్ష్మయ్య నీలకంఠం రాములు కొట్టం యాదయ్య దామెర లక్ష్మి మల్లేటి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

### చేనేత సెల్ జిల్లా కన్వీనర్ వర్కాల శ్రీనివాస్



**విశ్వంభర, మునుగోడు:** మునుగోడు నియోజకవర్గం గట్టుప్పల మండల కేంద్రము నందు చేనేత కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, భారతీయ జనతా పార్టీ చేనేత సెల్ జిల్లా కన్వీనర్ వర్గాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మహాధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఓబీసీ మోర్చా మాజీ అధ్యక్షులు అలె భాస్కర్ రాజ్ ,చేనేత సెల్ రాష్ట్ర కన్వీనర్ మచ్చా సుధాకర్ రావు,నల్లగొండ జిల్లా అధ్యక్షులు నాగం వర్థిత్ రెడ్డి,ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సంజయ్,చేనేత మాజీ రాష్ట్ర కో కన్వీనర్ మిర్యాల వెంకటేశం పాల్గొనటం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ,తెలంగాణ ప్రభుత్వం వెంటనే చేనేత కార్మికులను అలాగే కష్ట కాలం లో ఉన్న...చేనేత రంగాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని, చేనేత కార్మికులకు రుణ సహాయాన్ని అందించాలని అన్నారు.1.చేనేత కార్మికులకు అందుతున్న ప్రస్తుత పథకాలను కొనసాగించాలని కోరటం.... 2.చేనేత సంఘాలలో... పేరుకుపోయినఉత్పత్తి ని కొనడం,చ 3 త్రిఫ్ట్ ఫండ్ ను విడుదల చేయటం, 4.చేనేత సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించాలి డిమాండ్ చేయటం జరిగింది ...ఇట్టి కార్యక్రమం లో బిజెపి జిల్లా కార్యదర్శి బొడిగె అశోక్ గౌడ్ జిల్లా, అధికార ప్రతినిధి మాదగోని నరేందర్ గౌడ్ ,నల్లగొండ జిల్లా ఓబీసీ మోర్చ అధ్యక్షులు పిట్టల శ్రీనివాస్, చేనేత సెల్ రాష్ట్ర మాజీ కన్వీనర్ ఎన్నం శివకుమార్, మునుగోడు మండల పార్టీ అధ్యక్షులు పెంబళ్ల జానయ్య, జిల్లా పదాధికారులు,జిల్లా వివిధ మోర్చా నాయకులు..మండల అధ్యక్షులు జిల్లా,మండల కార్యవర్గ సభ్యులు,వివిధ మోర్చా నాయకులు, కార్యకర్తలు,చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## కుర్చీ లాగడంతో కింద పడిన మహిళా పోలీస్.. కాంగ్రెస్ నేతపై కేసు



**అహ్మదాబాద్:** ఒక కాంగ్రెస్ నేత కుర్చీని పక్కకు లాగారు. దీంతో తిరిగి కూర్చోబోయిన దళిత మహిళా పోలీస్ అధికారిణి కిందపడింది. ఆమె స్వల్పంగా గాయపడింది. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ సంఘటన నేపథ్యంలో ఆ కాంగ్రెస్ నేతపై పోలీసులు కేసు నమోదు చేశారు. గుజరాత్‌లోని కచ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శనివారం భుజ్‌లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే జిగ్నేష్ మేవానీ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఆ రాష్ట్ర ఇంటెలిజెన్స్ బ్యూరోకు చెందిన మహిళా పోలీస్ అధికారిణి రీనా చౌహాన్ సివిల్ డ్రెస్‌లో విధుల్లో పాల్గొన్నది. కుర్చీ నుంచి పైకి లేచిన ఆమె వేదికపై కూర్చొన్న వారిని ఫొటో తీసింది.కాగా, కాంగ్రెస్ కిసాన్ సెల్ కోఆర్డినేటర్ హరేష్ అహిర్ మహిళా పోలీస్ అధికారిణి కుర్చీని వెనక్కి లాగారు. దీంతో ఆ కుర్చీపై తిరిగి కూర్చోబోయిన రీనా చౌహాన్ కిందపడింది. స్వల్పంగా గాయపడిన ఆమె పైకి లేచిన తర్వాత హరేష్ అహిర్ చర్యపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆమె ఫిర్యాదుతో ఆయనపై ఎస్సీ, ఎస్టీ చట్టంతోపాటు పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు.మరోవైపు హోంశాఖ సహాయ మంత్రి హర్ష్ సంఘవి ఈ ఘటనను ఖండించారు. ఈ వీడియో క్లిప్‌ను ఎక్స్‌లో షేర్ చేశారు. మహిళలు, దళితులకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకమని విమర్శించారు. అయితే దళితులపై హత్యలు, అత్యాచారాలు, వారి భూముల కబ్జాపై నోరు ఎత్తని, కేసులు నమోదు చేయని హోంమంత్రిని బట్టబయలు చేసేందుకు కాంగ్రెస్ కార్యకర్త ప్రయత్నించారని ఎమ్మెల్యే జిగ్నేష్ మేవానీ తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయనను టార్గెట్ చేసేందుకు మహిళా ఐబీ అధికారిని బీజేపీ ప్రభుత్వం వినియోగించిందని ఆయన ఆరోపించారు.

## తెలంగాణ ప్రభుత్వం నుంచి ఎలాంటి ఇంటి స్థలం అక్కర్లేదు :అంబటి రాయుడు



**విశ్వంభర, అమరావతి :** తెలంగాణ రాజకీయాల్లో కూడా అంబటి రాయుడు హాట్ టాపిక్‌గా మారారు. అంబటి రాయుడుకు హైదరాబాద్‌లో ఇంటి స్థలాన్ని కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని హుజురాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కోరారు. క్రికెటర్ మహ్మద్ సిరాజ్, షూటర్ ఇషా సింగ్, బాక్సర్ నిఖత్ జరీన్ కు 600 చదరపు గజాల చొప్పున హైదరాబాద్‌లో ఇంటి స్థలాలు ఇవ్వాలని నిర్ణయించారు. దీనికి తెలంగాణ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలో అంబటి రాయుడు, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి గుత్తా జ్వాల, క్రికెటర్ ప్రజ్ఞాన్ ఓజాలకు కూడా ఇంటి స్థలాలు ఇవ్వాలని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన డిమాండ్ పై అంబటి రాయుడు స్పందించారు. తనకు తెలంగాణ ప్రభుత్వం నుంచి ఎలాంటి ఇంటి స్థలం అక్కర్లేదని ఆయన స్పష్టం చేశారు. తనకు కూడా ఇంటి స్థలం ఇవ్వాలని తన పేరును చేర్చడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇతర క్రీడాకారులకు ఇంటి స్థలాలు కేటాయించడం పట్ల అంబటి రాయుడు సంతోషం వ్యక్తం చేశారు. ఇప్పుడే కాదు గతంలోనూ తాను ఏ ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం ఆశించలేదని అంబటి రాయుడు గుర్తు చేశారు. తనకు ఇంటి స్థలం అవసరం లేదన్నారు. ఇంటి స్థలం అవసరం ఉన్న ఇతర క్రీడాకారులకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.



# శ్రావణ మాసంలో విధులు ఫలితాలు

ఈ మాసంలో ప్రాతః స్నానం చేసిన వారు సంవత్సరమంతా ప్రాతః స్నానం చేసిన ఫలితాన్ని పొందుతారు. ధన్వంతరి క్షేత్రంలో భక్తులకు సూచన చేశారు. మహా దేవ దయాసింధో శ్రావణేమాసి ఉషస్వహం ప్రాతః స్నానం కరిష్యమి. నిర్విఘ్నం కురుమే ప్రభో అవి సంకల్పం చెప్పుకుని ప్రాతః స్నానం చేయాలి. మంత్ర పునఃశ్చరణకు చాలా యోగ్యమైనది. పంచసూక్త పరాయణాదులు అధిక ఫలాన్ని ఇస్తాయి. ఈ ఒక్క మాసంలో నక్త వ్రతం చేసిన వారికి సంవత్సరమంతా నక్త వ్రతం చేసిన ఫలితం కల్గుతుంది. గృహస్తులు సంధ్యా సమయం తరువాత మొదటి నక్షత్రం కనిపించిన వెంటనే ఆహారం స్వీకరణ నక్త వ్రతం అనబడుతుంది. యతులు, వైధవ్యం పొందిన స్త్రీలు సూర్యుడు ఉండగానే నక్త వ్రతం, నక్త భోజనం చేయాలి. ఈ మాసంలో లక్ష పత్రి పూజ, లక్ష బిల్వ దళములతో పూజించిన ఐశ్వర్య ప్రాప్తి. శాంతి కోరుకొనే వారు లక్ష దుర్వా దళములతో పూజించవలెను. సంపెంగ పూలతో పూజించిన ఆయుష్షు పెరుగును. మల్లెలి, జాజి పూలతో పూజించిన విద్యా ప్రాప్తి. తులసితో పూజించిన హరి హరులు ఇద్దరు ప్రసన్నులు అవుతారు. (తులసితో విష్ణువును పూజించవచ్చు.) దుఃస్వప్నములు దోషములు పోవడానికి ధాన్యంతో పూజించవలెను. బ్రహ్మచర్య వృక్తం ఆచరించిన వారికి వీర్య వృద్ధి జరగడమే కాక ఓజస్సు, తేజస్సు, దేహ దారుఢ్యం కలుగుతాయి. మౌన వ్రతం ఆచరించిన వారు మహా వక్త కాగలరు. శనివారం రావి చెట్టుకి పూజ చేసి ఆలింగనం చేయుట వల్ల సర్వ సంపద సంవృద్ధి కలుగును. సాధారణంగా శ్రావణ మాసంలో వచ్చే శనివారంలలో బ్రాహ్మణులకు ఏ దానం చేసినా దానికి వెయ్యి రెట్లు అధిక ఫలితం ప్రాప్తిస్తుంది.

— మంగళగిరి మాధవ శేషు స్వామి
V3 న్యూస్ ఛానల్ ఆధ్యాత్మిక వేత్త


తప్పుడు కేసులో కేజ్రీవాల్‌ను

# జైలుకు పంపిన మోదీ: సునీతా కేజ్రీవాల్




ఢిల్లీ: ఢిల్లీలో ప్రభుత్వ స్కూళ్ల పరిస్థితి మెరుగుపరిచి, మొహల్లా క్లినిక్‌లను ఏర్పాటు చేసి ఉచిత విద్యుత్‌ను అందించిన ఘనత ఢిల్లీ సీఎం, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌దేనని ఆయన భార్య సునీతా కేజ్రీవాల్ అన్నారు. హరియాణలోని సోహ్నాలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో సునీతా కేజ్రీవాల్ మాట్లాడారు.దేశంలో ఈ తరహా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కేజ్రీవాల్ ఒక్కరే చేయగలిగారని, ప్రధాని మోదీ ఇలాంటి అభివృద్ధి పనులను చేపట్టలేదని ఆమె పేర్కొన్నారు. అరవింద్ కేజ్రీవాల్ చేపట్టిన అభివృద్ధి పనులను నిలిపివేసేందుకు ప్రధాని మోదీ కుట్రపూరితంగా తప్పుడు కేసులో కేజ్రీవాల్‌ను జైల్లో పెట్టించారని ఆరోపించారు.హరియాణ బిడ్డ కేజ్రీవాల్ ఎన్నటికీ ప్రధాని మోదీ ముందు తలవంచబోరని ఆమె స్పష్టం చేశారు. 2014లో నరేంద్ర మోదీ ప్రధాని అయిన సమయంలో గుజరాత్ ప్రజలు ఆయనకు అండగా నిలిచారని గుర్తుచేశారు. ఇక దేశంలోనే హరియాణను గర్వకారణంగా నిలిపిన అరవింద్ కేజ్రీవాల్‌కు రానున్న హరియాణ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఆదరిస్తారని, బీజేపీకి ఒక్క ఓటు కూడా వేయరని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు.

# క్యాన్సర్ గురించి అవగాహన అవసరం



**అవగాహన..**


**క్యాన్సర్ కష్ట నష్టాల గురించి ప్రజలకు తెలియజేసి అవగాహన కల్పిచాలి. వ్యాధిని నయం చేయడానికి శస్త్ర చకిత్స, రేడియేషన్, కీమోథెరపీ అవసరం. ఆరోగ్యపు అలవాట్లను, ఆహారపు అలవాట్లను 30 నుంచి 40 ఏళ్ల వయస్సు నుంచే ప్రారంభించాలి. తొలిదశలోనే గుర్తించి చికిత్స పొందాలి. ధూమపానం, సురాపానం, గుట్కా, జర్దా కిళ్లీలు మానాలి. పండ్లు, కూరగాయలు పీచు పదార్థం ఎక్కువగానూ, కొవ్వు తక్కువగానూ వుండే ఆహారాన్ని తీసుకోవాలి. కాన్సరు బారినుండి శరీరాన్ని రక్షించు కోవాలి. దీనికి స్క్రీనింగ్ పరీక్షలు జరపాలి.**

ఫీచర్

క్యాన్సర్ మహమ్మారి ఏటా రూ.41,17,000 కోట్లు హరిస్తూ ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. మూడింట రెండొంతుల క్యాన్సర్ మరణాలు పేద, మధ్యతరగతి దేశాల్లోనే సంభవిస్తున్నాయి. అందులో ఎక్కువ భాగం ముందుగా గుర్తించి చికిత్స అందించడం ద్వారా నయం చేసే అవకాశం ఉందని డబ్ల్యూహెచ్ఓ(WHO) వెల్లడించింది. క్యాన్సర్ అనేది ఏ వయస్సు వారి కైనా రావచ్చును. ఆడవారికి, మగవారికి కూడ రావచ్చును. శరీరంలో నోరు, గొంతు, ఎముకలు, రొమ్ము, చర్మం, మున్నగు ఏ భాగానికి అయినా రావచ్చును.

సాధారణంగా మన శరీరంలో కణ విభజనలు ఒక క్రమ పద్ధతిలో నియంత్రించ బడతాయి. కొన్ని సందర్భాలలో కణాల పెరుగుదలలో నియంత్రణ లేనందువల్ల కణాలు చాలా వేగంగా అస్తవ్యస్తంగా విభజన చెంది కణ సమూహాలను ఏర్పరుస్తాయి. ఈ కణ సమూహాలను 'కంతి' (ట్యూమర్) అంటారు. అటువంటి కొన్ని ప్రమాదకరమైన వాటిని క్యాన్సర్ అని వ్యవహరిస్తారు. ఈ రకమైన పెరుగుదలకు ఒక స్పష్టమైన విధి ఉండదు. క్యాన్సర్ గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని 'ఆంకాలజీ' అంటారు. క్యాన్సర్ ప్రపంచం లోనే అత్యంత ఖరీదైన వ్యాధి.

శరీరంలో ఏదైనా అవయవానికి క్యాన్సర్ సోకితే తొలిదశలో లక్షణాలు అంతగా కనిపించవు. వ్యాధి సోకిన అవయవాన్ని బట్టి దీని నిర్ధరణ పరీక్షలు కూడా వేర్వేరుగా ఉంటాయి. కొన్ని రకాల క్యాన్సర్లనూ ఒకే విధమైన పరీక్షతో తెలుసు కోవడం సాధ్యం కాదు. క్యాన్సర్ అంటువ్యాధి కాదు. అలాగే వంశపారంపర్యంగా వచ్చే అవకాశం కూడా తక్కువే. అయితే, రొమ్ము, థైరాయిడ్, పెద్దపేగు, పాంక్రియాస్ క్యాన్సర్లు జన్యు పరంగా సంక్రమిస్తాయి. కుటుంబంలో ఎవరికైనా ఈ క్యాన్సర్లు వస్తే వచ్చే ప్రమాదం ఉంది. క్యాన్సర్‌ను తొలి దశలో గుర్తించక పోతే ఇతర భాగాలకూ వ్యాపించి, చికిత్సకు సైతం ఏమాత్రం తగ్గుముఖం పట్టవు. కాబట్టి దీనిపై అవగాహనతో ఎదుర్కొవాలి. క్యాన్సర్‌కు కారణాల్లో ఆధునిక జీవన శైలి ప్రధానమైంది. మద్యం, పొగతాగడం, ఆహార పదార్థాల్లో రంగులు వినియోగం, రసాయనాలు వాడటం, హార్మోన్లు అధికంగా వాడటం, అధిక బరువు, కాలుష్యం,




క్రిమిసంహారకాలు, చికిత్సలో భాగంగా లేదా ప్రమాదవశాత్తు రేడియేషన్‌కు గురికావడం, తరచూ వేధించే ఇన్ఫెక్షన్లు.. ఇవన్నీ క్యాన్సర్‌కు కారకాలు. కొన్ని రకాల క్యాన్సర్లను రాకుండా వ్యాక్సిన్ వేసుకోవచ్చు. వాటిలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కు ప్రధాన కారణం హెచ్‌పీవీ వైరస్. కాబట్టి దీనికి వ్యాక్సిన్ వేసుకుని నివారించ వచ్చు. 9 ఏళ్లు పైబడిన బాలికల నుంచి 40 ఏళ్ల మహిళల వరకు ఈ వ్యాక్సిన్ వేయించు కోవచ్చు. అలాగే అండాశయం, గొంతు క్యాన్సర్ రాకుండా కూడా ఇది అడ్డుకుంటుంది.

క్యాన్సర్ కణం ఒక్కొక్కరిలో ఒక్కోలా ఉంటుంది. క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తించడం, దానికి ఇతర అవయవాలకు విస్తరించే గుణం ఉందా అనే అంశాలపై ఆధారపడి ఉంటుంది. సర్జరీ, మందులు, థెరపీలు కూడా దీనిపైనే ఆధారపడి ఉంటాయి. క్యాన్సర్‌ను జయించడం, త్వరగా గుర్తించడంతో పాటు ఆ కణితులు పరిమాణం, దశ, గ్రేడింగ్ కూడా చాలా ముఖ్యం. క్యాన్సర్‌కు వయసుతో సంబంధం లేదు. అన్ని వయసుల వారూ దీని బారిన పడే అవకాశాలు మెండుగా ఉంటాయి. కానీ చిన్నపిల్లల్లో వచ్చే క్యాన్సర్లను చాలా వరకు పూర్తిగా నయం చేయ గలిగినవే. అయితే, వయస్సు పెరిగేకొద్ది క్యాన్సర్ వచ్చే ముప్పు ఎక్కువ. ఈ సమయంలో వచ్చే క్యాన్సర్ల తీవ్రత చాలా ఎక్కువగా ఉంటుంది.

అందుకే క్యాన్సర్ చికిత్సను కూడా వయస్సును బట్టి నిర్ధరిస్తారు. క్యాన్సర్ కణాలను నిర్వీర్యం చేయడానికి కీమోథెరఫీ, రేడియో థెరఫీలతో పాటు ల్యాప్రోస్కోపిక్ పద్ధతిలో చేసే కీహోల్ సర్జరీలు కూడా నేడు అందుబాటులో ఉన్నాయి. సర్జరీ తర్వాత రేడియో, కీమో, హార్మోన్ థెరఫీ లాంటివి చేసినా, లేక థెరఫీల తర్వాత సర్జరీ చేసినా చికిత్స అంతటితో అయి పోయిందని భావించరాదు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించు కోవాలి. క్యాన్సర్ కణం శరీరంలో ఎక్కడుందనే విషయం తెలుసు కోవడం కష్టం. ఏ అవయవానికి సోకిందనే అనుమానం ఉంటే దానికి సంబంధించిన పరీక్షలు వేర్వేరుగా ఉంటాయి. వీటిలో బయాప్సీ, యఫ్‌యన్‌ఏ టెస్ట్, బ్లడ్ మార్కర్స్, ఎక్స్‌రే, సీటీ స్కాన్, యంఆర్ఐ, పీఈటీ స్కాన్ వంటివి అవసరాన్ని బట్టి చేస్తారు. అయితే సర్వైకల్ క్యాన్సర్‌ను పాప్‌స్మియర్ ద్వారా ముందుగా గుర్తించవచ్చు.

ప్రభుత్వాలు చర్యలలో భాగంగా పొగాకు వాడకంపై యుద్ధం ప్రకటించడం, సిగరెట్ తయారీ కంపెనీలు వ్యాపార ప్రకటనలు ఇవ్వటాన్ని నిషేధించాయి. అదే విధంగా బీడీ కట్టల మీద పుర్రె గుర్తు ముద్రణతో క్యాన్సర్ భయాన్ని ప్రజలలోకి తీసుకువెళ్ళ గలిగారు. మత్తు పానీయ ప్రకటనల మీద నిషేధం తీసుకు వచ్చారు. మన దేశంలో నోటి క్యాన్సర్ కేసులు అధికంగా నమోదవటానికి కారణం గుట్కా వాడకమే. భారత దేశంలో 80 శాతం మందికి క్యాన్సర్ ముందుగా గుర్తు పట్టలేక పోతున్నారు. క్యాన్సర్ పై అవగాహన పెరగాలి. లేటు వయస్సు వారికి ఎక్కువగా క్యాన్సర్ వస్తున్నది. నేడు లైఫ్ స్టైల్ మారింది. పొగాకు సంబంధిత వస్తువులు వాడటం వల్ల 40శాతం మందికి క్యాన్సర్ వస్తున్నదని తెలుస్తోంది.

చికిత్సకు సంబంధించి... శరీర సాధారణ స్థితి, ఇతర జబ్బులు, కాన్సరు దశ, రోగి కోరిక, సమ్మతి. తొలిదశలో వున్న కాన్సర్లలో 70 నుంచి 90 శాతం కేసుల్లో నయం అయ్యే అవకాశం వుంది. క్యాన్సర్ లో 19వ శతాబ్దం చివరిదశలో శస్త్ర చికిత్స ప్రారంభమైంది. అయితే శస్త్ర చికిత్స రానురాను వయస్సు పెరిగిన కొద్దీ తగ్గిపోతున్నది. రేడియేషన్ చికిత్స ను ఎక్స్ రే ను కనుగొన్న 1895 నుండి చేస్తున్నారు.వృద్ధుల్లో క్యాన్సర్ జబ్బుకు రేడియేషన్ చికిత్సను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. మందులతో చికిత్స 1950 నుండి ప్రారంభమైంది. వృద్ధుల్లో చికిత్సకు మందులను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు.







# సముద్రతీర నగరాలకు హెచ్చరికలు

## వేగంగా పెరుగుతున్న నీటిమట్టం

### సముద్రంలో మునగనున్న చెన్నైలోని 7.29 శాతం భూభాగం ప్రమాద జోన్లుగా పలు ప్రాంతాలు

ప్యారిస్:

వాతావరణ మార్పుల కారణంగా సముద్ర నీటిమట్టం వేగంగా పెరుగుతుండటంతో చెన్నై, తూత్తుక్కుడిలోని కొన్ని ప్రాంతాలు సముద్రంలో కలిసిపోయే ప్రమాదం ఉందని అధ్యయనాలు చెబుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ మార్పులు అతి పెద్ద సమస్యగా మారాయి. భూతాపం పెరగడమే ఇందుకు కారణం. పరిశ్రమలు, వాహనాల పొగ, గ్రీన్ హౌస్ వాయువుని విడుదలచేసే విద్యుత్తు పరికరాల ఉపయోగంతో భూ ఉష్ణోగ్రత పెరుగుతోంది. భూమి వేడెక్కడంతో అంటార్కిటికా, ఆర్కిటిక్ ఖండాల్లోని ధృవ ప్రాంతాల్లో ఉన్న మంచు వేగంగా కరుగుతోంది. దీంతో ప్రపంచ వ్యాప్తంగా సముద్ర నీటిమట్టం వేగంగా పెరుగుతోంది. అంతేకాకుండా ముందుగానే అంచనా వేయలేని విధంగా వాతావరణ మార్పులు కలుగుతున్నాయి. ఓ వైపు వరదలు, మరో వైపు భరించలేని ఎండలు తలెత్తుతున్నాయి. ఇవన్నీ వాతావరణ మార్పుల కారణంగా జరుగుతున్నట్లు శాస్త్రవేత్తలు తెలుపుతున్నారు. ఈ నేపథ్యంలో బెంగళూరుకి చెందిన సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సైన్స్ టెక్నాలజీ అండ్ పాలసీ (సీఎస్టిఈపీ) చెన్నై మొదలైన సముద్రతీర నగరాలకు హెచ్చరికలు జారీచేసింది.

సముద్ర నీటిమట్టం పెరుగుదల కారణంగా 2040లో చెన్నైలోని మొత్తం విస్తీర్ణంలో 7.29 శాతం (86.6 చదరపు కిలోమీటర్లు) సముద్రంలో మునిగిపోతుందని ఓ అధ్యయనం హెచ్చరించింది. అంతేకాకుండా పెరుగుతున్న భూతాపం కారణంగా 2100 నాటికి ప్రపంచస్థాయిలో సముద్రమట్టం 1.3 నుంచి 1.6 మీటర్ల వరకు పెరుగుతుందని ఇంటర్ గవర్నమెంటల్ ప్యానల్ ఆన్ క్లైమెట్ చేంజ్ (ఐపీసీసీ) అంచనా వేసింది. సముద్రమట్టం పెరుగుదల కారణంగా సముద్రతీరాల్లో ఉండే నగరాలకు పెను ముప్పు పొంచి ఉందని ఐపీసీసీ ఇదివరకే హెచ్చరించింది. ఈ నేపథ్యంలో సహజ నౌకాశ్రయాలు, సాంస్కృతిక కేంద్రాలు, మతపరమైన స్మారక చిహ్నాలు ఉన్న దేశ ఆర్థిక వ్యవస్థలో ముఖ్యపాత్ర పోషిస్తున్న చెన్నై మొదలైన సముద్రతీర మహానగరాలు తీవ్ర ప్రభావానికి గురవుతాయని ఓ నివేదిక తెలిపింది. సీఎస్టీఈపీ జరిపిన అధ్యయన ఫలితాలు ప్రస్తుతం వెలువడి దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయి.

**ప్రమాదపు అంచున తూత్తుకుడి**

అందులో గ్లోబల్ వార్మింగ్ ఫలితంగా చెన్నైలో సముద్రమట్టం 1987 నుంచి 2021 వరకు మొత్తం. 0.679 సెం.మీ వరకు పెరిగినట్లు వివరించింది. ఇదే పరిస్థితి కొనసాగితే 2040 కల్లా చెన్నైలో నీటిమటం 17.4 సెం.మీ వరకు పెరిగే ప్రమాదం ఉందని తెలిపింది. దీని ఫలితంగా 86.6 చదరపు కిలోమీటర్లు అంటే 7.29 శాతం చెన్నై భూభాగం కనిపించకుండా పోయే ఆస్కారముందని పేర్కొంది. చెన్నైలోని అడయారు ఎకో పార్క్, అశోకచక్ర స్మారక చిహ్నం. ఐలాండ్ గ్రౌండ్, పళ్లికరణైచిత్తడి నేలలు, హార్బర్ మొదలైన పలు ముఖ్య ప్రాంతాలను అధిక ప్రమాదం కలిగిన జోన్లుగాగుర్తించారు. 2040 నాటికి చెన్నైలోని 7.29 శాతం (86.6 చ.కి.మీ), 2060 నాటికి 9.65 శాతం(114.31 5.5.2), 2100 □ 16.9 (207.04 5.5.)మునుగుతుందని అంచనా వేసింది. అంతేకాకుండా తూత్తుక్కుడి 10 శాతానికి పైగామునిగిపోతుందని, 2100 నాటికి కన్నియాకుమరిలో 74.7 సెం.మీ వరకు సముద్రపు నీరుచేరుతుందని వెల్లడించింది.

సీఎం రేవంత్ ప్రైవేటు స్కూల్స్

# ఉపాధ్యాయులపై చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి

విశ్వంభర, హైదరాబాద్



ప్రైవేటు స్కూల్స్ ఉపాధ్యాయులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీ వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమ్మేళనంలో సీఎం చేసిన వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ స్కూల్స్ పదో తరగతి ఫెయిల్ అయిన వారు ఉపాధ్యాయులు ఉన్నారని సీఎం రేవంత్‌రెడ్డి అంటున్నారని.. విద్యాహక్కు చట్టం కింద శిక్షణ ఉపాధ్యాయులు ఉండాలన్నారు. చాలా స్కూల్స్‌లో శిక్షణ ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. సీఎం రేవంత్ ఎక్కడికి వెళ్లినా అక్కడ ఉన్నవారందరినీ మునగ చెట్టు ఎక్కిస్తారంటూ సెటైర్లు వేశారు.పోటీ ప్రపంచంలో చాలామంది తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపుతున్నారని తెలిపారు. సీఎం రేవంత్ సైతం తన మనవలు, మనవరాళ్లను ప్రైవేటు స్కూల్స్‌కే పంపే పరిస్థితి ఉంటుందన్నారు. తాను ప్రభుత్వ, ప్రైవేటు టీచర్స్‌ను వేరుగా చూడడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుల మెప్పు కోసం ప్రైవేటురంగం ఉపాధ్యాయులను కించపరిచేలా సీఎం వ్యాఖ్యలు చేశానన్నారు. ప్రభుత్వ మెప్పు కోసం ప్రైవేట్ రంగంలో ఉన్న ఉపాధ్యాయ మిత్రులను కించపరిచే విధంగా సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో పని చేసే ఉపాధ్యాయులే కాకుండా.. కేజీ టూ పీజీ వరకు అన్ని విద్యాసంస్థల్లో పని చేసే బోధన, బోధనేతర సిబ్బంది కోసం ఓ చట్టాన్ని తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. 2009 ఆగస్టులో విద్యాహక్కు చట్టం వచ్చిందని గుర్తు చేశారు.రాజ్యాంగ సవరణ ద్వారా విద్య ప్రాథమిక హక్కుగా మారిందని పేర్కొన్నారు. ప్రవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో కలిపి మొత్తం 50లక్షల మంది విద్యార్థులు ఉంటే.. అందులో ప్రైవేటులోనే 51శాతం ఉన్నారన్నారు. ఈ విద్యా సంవత్సరంలో 2 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేటుబడులకు వెళ్లారన్న ఆయన.. ఈ విషయంలో సీఎం దృష్టి పెట్టాలని సూచించారు. త్వరలోనే లక్ష మంది ప్రైవేట్ ఉపాధ్యాయులతో సభ పెట్టి సంరక్షణ చట్టం కోసం బీఆర్ఎస్ తరఫున ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. గతంలో మాజీ స్పీకర్ జీ నారాయణరావు చొరవతో న్యాయవాదులకు సంక్షేమ చట్టం వచ్చిందని తెలిపారు. అది అన్ని రాష్ట్రాల్లో అమలవుతోందన్న ఆయన.. ప్రైవేటు ఉపాధ్యాయులకు సైతం సంరక్షణ చట్టం రావాల్సిందేన్నారు.




## ఎయిర్ ఇండియా
# బంపర్ ఆఫర్

విశ్వంభర, బిజినెస్ : 77వ స్వాతంత్ర్య దినోత్సవం ఆగస్టు 15న భారతదేశంలో జరుపుకోబోతోంది. ఇందుకోసం భారతదేశం అంతటా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎయిర్ ఇండియా ఫ్రీడమ్ సేల్‌ను ప్రకటించింది. దీని ప్రకారం రూ.1,947కి విమాన టిక్కెట్టు ప్రకటించింది. ఇది దేశీయ, అంతర్జాతీయ విమానాలకు వర్తిస్తుంది. ఎయిర్ ఇండియా ఈ అద్భుతమైన ఆఫర్‌ను పొందాలనుకునే వారు ఎయిర్ ఇండియా అధికారిక వెబ్‌సైట్ ద్వారా తమ టిక్కెట్‌లను బుక్ చేసుకోవచ్చు. ఈ ఆఫర్ కింద ప్రయాణించే ప్రయాణికులకు 3 కిలోల వరకు ఉచిత బ్యాగేజీ భత్యం అనుమతించబడుతుంది. అదేవిధంగా 15 కిలోల వరకు లగేజీపై రూ.1,000, 20 కిలోల వరకు లగేజీపై రూ.1,300 తగ్గింపును అందిస్తోంది. ఎయిర్ ఇండియా వెబ్‌సైట్ ద్వారా టిక్కెట్లు బుక్ చేసుకునే లాయల్టీ సభ్యులకు 8% న్యూకాయిన్స్ ఇవ్వనున్నట్లు ఎయిర్ ఇండియా ప్రకటించింది. అంతే కాకుండా, ప్రైమ్ సీట్లు, ఆహారం, పానీయాలపై 47% తగ్గింపు అందించబడుతుంది. ఎయిర్ ఇండియా అధికారిక వెబ్‌సైట్ ద్వారా విమాన టిక్కెట్లను బుక్ చేసుకునే వారికి మాత్రమే ఈ ఆఫర్‌లు అందుబాటులో ఉంటాయి. సెప్టెంబర్ 30 వరకు ఫ్రీడమ్ సేల్ టిక్కెట్‌లను బుక్ చేసుకోవడానికి ఆగస్టు 5 చివరి రోజు అని గుర్తుంచుకోండి. అంతే కాకుండా ఎయిర్ ఇండియా ఫ్రీడమ్ సేల్ ఢిల్లీ, జైపూర్, బెంగళూరు మీదుగా 12 అంతర్జాతీయ విమానాలు, 32 దేశీయ విమానాల్లో ప్రయాణించడానికి మిమ్మల్ని అనుమతిస్తుంది.

## కోచ్‌గా గంభీర్ ఎక్కువ కాలం ఉండడు
### వరల్డ్ కప్ హీరో సంచలన వ్యాఖ్యలు

**విశ్వంభర, స్పోర్ట్స్ :**



గౌతమ్ గంభీర్ ఇప్పుడు టీమిండియా ప్రధాన కోచ్. శ్రీలంక పర్యటనతో భారత జట్టుకు నాయకత్వం వహించనున్నాడు. శ్రీలంకతో జరిగిన టీ20 సిరీస్‌ను భారత్ క్లీన్ స్వీప్ చేయడంతో గౌతమ్ గంభీర్ తన కోచ్ కెరీర్‌ను విజయంతో ప్రారంభించాడు. అయితే, వీటన్నింటి మధ్య టీమిండియా ప్రపంచకప్ విజేతగా నిలిచిన ఓ మాజీ ఆటగాడు చేసిన షాకింగ్ స్టేట్‌మెంట్ వైరల్ అవుతోంది. అతని ప్రకారం, గౌతమ్ గంభీర్ టీమ్ ఇండియాను నిర్వహించగలడు. అయితే ఇక్కడ కోచ్‌గా ఎక్కువ కాలం కొనసాగలేదని అభిప్రాయపడ్డాడు. గౌతమ్ గంభీర్ కోచింగ్ కెరీర్‌ను 2007 టీ20 ప్రపంచకప్ హీరో జోగిందర్ శర్మ అంచనా వేశాడు. అప్పుడు గంభీర్ సహచరుడిగా ఉన్న జోగిందర్ ఇప్పుడు ఆశ్చర్యకరమైన ప్రకటనతో దృష్టిని ఆకర్షించాడు. గౌతమ్ గంభీర్ తీసుకున్న కొన్ని నిర్ణయాలు చాలా మందికి నచ్చవు. ఎందుకంటే సూటిగా మాట్లాడే వ్యక్తిత్వం ఆయనది. నేరుగా మాట్లాడితే ఇబ్బంది అవుతుంది. గౌతమ్ గంభీర్ ఎవరి జోలికి వెళ్లడు. ఇతరులతో కలిసిపోయే అలవాటు లేదు. కాబట్టి ఇది కూడా సమస్యను సృష్టిస్తుంది. గౌతమ్ గంభీర్ తన పనిని నమ్ముతాడు. కానీ, అతను దాని క్రెడిట్ తీసుకునే వ్యక్తి కాదు. అందుకే టీమిండియా కోచ్‌గా ఎక్కువ కాలం కొనసాగడని జోగిందర్ శర్మ తెలిపాడు.

# సెమీస్‌కు దూసుకెళ్లిన భారత హాకీ జట్టు

**విశ్వంభర, స్పోర్ట్స్ :**

పారిస్ ఒలింపిక్స్‌లో భాగంగా తాజాగా జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో 1 (4) 1 (2) తేడాతో టీమ్‌ఇండియా విజయం సాధించింది. ఈ గెలుపుతో నేరుగా సెమీస్‌కు చేరుకుంది. తొలుత ఈ మ్యాచ్ 11తో టై అవ్వగా, ఆ తర్వాత షూటౌట్‌లో భారత్ 42తో గెలుపొందింది. తొలి క్వార్టర్‌లో ఇరు జట్లు ఒక్క గోల్ కూడా స్కోర్ చేయలేదు. అయితే రెండో క్వార్టర్‌లో భారత్ డిఫెండర్ అమిత్ రోహిదాస్ మ్యాచ్‌కు దూరమయ్యాడు. హాకీ స్టిక్‌తో బ్రిటన్ ఆట గాడిని ఉద్దేశపూర్వకంగా కొట్టాడని అక్కడి రిఫరీలు రోహిదాస్‌ను రెడ్ కార్డ్ ద్వారా గేమ్ నుంచి బయటికి పంపించారు. దీంతో భారత్ 10 మందితోనే ఆడాల్సి వచ్చింది. సరిగ్గా 22వ నిమిషంలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ పెనాల్టీ కార్నర్ ద్వారా ఓ గోల్ సాధించి భారత్‌ను ఆధిక్యంలో నిలిపాడు. ఇక 27వ నిమిషంలో బ్రిటన్ ప్లేయర్ మోర్టన్ లీ గోల్ చేయడం వల్ల స్కోర్ సమం అయింది. ఆ తర్వాతి రెండు క్వార్టర్స్‌లోనూ ఇరు జట్లు గోల్ చేయలేకపోయాయి. దీంతో మ్యాచ్ షూటౌట్‌కు దారితీసింది.

మరోవైపు భారత హాకీ జట్టు ఇప్పటివరకూ ఒలింపిక్స్‌లో 12 పతకాలను గెలుచుకుంది. అందులో 8 స్వర్ణాలు, 3 కాంస్యాలు, ఓ రజత పతకం ఉంది. దీంతో ఈ పారిస్ ఒలింపిక్స్‌లోనూ కూడా అదరగొట్టి మరో పతాకాన్ని ఖాతాలో వేసుకోవాలని భారత్ హాకీ జట్టు ఉవ్విళ్లూరుతోంది.




# లక్ష్యం తప్పింది
## సెమీ ఫైనల్‌లో నిరాశపర్చిన లక్ష్యసేన్

**విశ్వంభర, స్పోర్ట్స్ :**

పారిస్ ఒలింపిక్స్ 2024లో సంచలన ప్రదర్శనతో సెమీఫైనల్ వరకూ దూసుకొచ్చిన యువ కెరటం, భారత బ్యాడ్మింటన్ ఆటగాడు లక్ష్యసేన్.. నిరాశపరిచాడు. ఈ క్రీడల్లో వరుస విజయాలు సాధించిన 22 ఏళ్ల షట్లర్.. సెమీఫైనల్‌లో మాత్రం తేలిపోయాడు. డెన్మార్క్ ఆటగాడు ప్రపంచ రెండో ర్యాంకర్ విక్టర్ అక్సెల్సెన్ చేతిలో వరుస సెట్లలో ఓడిపోయాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ సెమీస్‌లో 2022, 1421 తేడాతో ఓటమి చవిచూశాడు. ఈ ఫలితంతో లక్ష్యసేన్ స్వర్ణం లేదా రజతం గెలుచుకునే అవకాశాన్ని మిస్ చేసుకున్నాడు. వాస్తవానికి గేమ్ ప్రారంభంలో లక్ష్యసేన్ ఆధిక్యం కనబర్చాడు. తొలి గేమ్‌లో ఓ దశలో 1511తో ఆధిక్యంలో నిలిచాడు. కానీ ప్రపంచ రెండో ర్యాంకర్‌గా ఉన్న డెన్మార్క్‌కు చెందిన విక్టర్.. తనదైన శైలిలో రెచ్చిపోయాడు. క్రమంగా జోరు పెంచుతూ లక్ష్యసేన్‌ను ఒత్తిడిలోకి నెట్టాడు. ఈ క్రమంలోనే 2220తో తొలి సెట్‌ను గెలుచుకున్నాడు. అయితే తొలి సెట్‌ను కోల్పోయినా.. వరుస సెట్లలో విజయం సాధించే అలవాటున్న లక్ష్యసేన్.. రండో సెట్‌లోనూ శుభారంభం చేశాడు. ఓ దశలో 70తో ఆధిక్యంలో నిలిచాడు. కానీ ఆ తర్వాత మాత్రం తేలిపోయాడు . డెన్మార్క్ షట్లర్ వరుసగా పాయింట్లు సాధించాడు. లక్ష్యసేన్ 7 నుంచి 14 పాయింట్లను సాధించేలోపు.. 0 నుంచి 21 పాయింట్లను నమోదు చేశాడు. రెండో సెట్‌తో పాటు మ్యాచ్‌ను కూడా సొంతం చేసుకున్నాడు. ఈ ఫలితంతో లక్ష్యసేన్ ఫైనల్‌కు చేరి స్వర్ణం లేదా రజతం గెలుచుకునే అవకాశాన్ని చేజార్చుకున్నాడు. అయితే ఇప్పటికీ లక్ష్యసేన్ కాంస్య పతకం సాధించే అవకాశం ఉంది. రేపు జరిగే కాంస్య పతక పోరులో ఈ భారత షట్లర్ మలేషియాకు చెందిన లీ జియాతో తలపడనున్నాడు. ఇందులో గెలిస్తే కాంస్య పతకాన్ని సాధించనున్నాడు. అంతకుముందు బాక్సర్ లవ్లీనా బోర్గొహెయిన్ కూడా నిరాశపర్చింది. టోక్యో 2020 ఒలింపిక్స్‌లో కాంస్యం సాధించిన ఈ బాక్సర్.. ఈ సారి అంతకమించిన పతకం తేవాలని పట్టుదలతో పారిస్‌లో అడుగుపెట్టింది. అంచనాలకు తగ్గట్లుగానే క్వార్టర్స్ వరకూ చేరింది. కానీ అనూహ్యంగా క్వార్టర్ ఫైనల్‌లో ఓడి.. నిరాశపర్చింది. ఆదివారం జరిగిన 75 కిలోల బాక్సింగ్ విభాగంలో చైనాకు చెందిన లి కియాన్ చేతిలో లవ్లీనా.. 14తో పరాజయం పాలైంది.







## నీరజ్ గోల్డ్ మెడల్ కొడితే
# అందరికీ ఉచిత వీసా

**విశ్వంభర, స్పోర్ట్స్ :**

పారిస్ ఒలింపిక్స్ 2024లో భారత అథ్లెట్లు ఇప్పటి వరకు మూడు కాంస్య పతకాలు గెలుచుకున్నారు. అయితే, స్వర్ణం కోసం భారత్ దేశం మొత్తం ఎదురు చూస్తోంది. స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజన్ చోప్రా బంగారం పతకం సాధిస్తాడని అభిమానులు నమ్మకంతో ఉన్నారు. టోక్యో ఒలింపిక్స్ లో నీరజ్ స్వర్ణం సాధించాడు. ఇప్పుడు పారిస్ లోకూడా అదే ఫలితం పునరావృతం అవుతుందని ఆశగా ఎదురు చూస్తున్నారు. దీనికితోడు నీరజ్ చోప్రా స్వర్ణం గెలిస్తే భారత దేశంలోని పౌరులందరికీ ప్రపంచంలో ఏ దేశానికైనా వెళ్లేందుకు ఉచిత వీసా ఇవ్వడం జరుగుతుందని భారతీయ సంతతికి చెందిన వీసా స్టార్టప్ అట్లాస్ సీఈవో మోహక్ నహ్తా హామీ ఇచ్చారు. మోహక్ నహ్తా తన లింక్డ్ ఇన్ లో పోస్ట్ ద్వారా ఆఫర్ గురించి చెప్పారు. అయితే, ఈ ఆఫర్ ప్రాసెస్ ఏంటో చెప్పాలంటూ లింక్డ్ ఇన్ యూజర్లు పెద్దెత్తున రీ పోస్టులు చేశారు. దీనికి స్పందించిన మోహక్ నెహ్తా ఆఫర్ ప్రొసిజర్ ను వివరంగా చెప్తూ పోస్ట్ చేశారు. నీరజ్ గోల్డ్ మెల్ సాధిస్తే అందరికీ ఫ్రీ వీసా ఇస్తానని నేను జులై 30న చెప్పాను. ఆగస్టు 8న జావెలిన్ త్రో ఫైనల్ జరుగుతుంది. ఇందులో నీరజ్ స్వర్ణ పతకం గెలిస్తే నేను చెప్పినట్లుగా అందరికీ మా కంపెనీ తరపున ఒక్కరోజు ఫ్రీ వీసా ఇప్పిస్తాం. ప్రపంచంలో ఏ దేశానికి వెళ్లాలనుకున్నా వీసా ఖర్చు మేమే భరిస్తామని క్లారిటీ ఇచ్చారు. మీ ఈ మెయిల్ కామెంట్ బాక్స్ లో పెట్టండి. వీసా పొందేందుకు వీలుగా మీకు ఓ అకౌంట్ క్రియేట్ చేస్తాం అని మెహక్ మరో పోస్ట్ లో క్లారిటీ ఇచ్చారు. భారత్ స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రా ఆగస్టు 6న పారిస్ ఒలింపిక్స్ 2024లో జావెలిన్ త్రో ఈవెంట్ లో పాల్గొంటాడు. గ్రూప్ ఏ క్వాలిఫికేషన్ రౌండ్ మధ్యాహ్నం 1:50 గంటలకు ప్రారంభమవుతుంది, తర్వాత గ్రూప్ బీ 3:20 PMకి ప్రారంభమవుతుంది. అదే రోజు నీరజ్ క్వాలిఫికేషన్ రౌండ్ నుండి విజయవంతంగా బయటపడితే.. ఆగస్టు 8న ఫైనల్ లో పోటీ పడతారు. ఫైనల్ పోటీ 8వ తేదీ రాత్రి 11.55 గంటలకు ప్రారంభమవుతుంది.


# రూ.7 లక్షలకే కొత్త టాటా కారు

**విశ్వంభర, బిజినెస్ :**




దేశంలోని అత్యధికంగా విక్రయమవుతున్న కార్లలో టాటా పంచ్ ఒకటి. ఈ కారుకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. బడ్జెట్ ధరలో మంచి కారు కోసం చూసే వారు ఎక్కువగా ఈ టాటా పంచ్ కారునే కొనుగోలు చేస్తున్నారు. మీరు కూడా ఈ టాటా పంచ్ డిస్కౌంట్ ధరలో కొనుగోలు చేయవచ్చు. ఈ ఆగస్టు నెలలో టాటా మోటార్స్ సంస్థ టాటా పంచ్ కారుపై రూ.25 వేల డిస్కౌంట్ అందిస్తోంది. ఈ డిస్కౌంట్ అనేది పెట్రోల్ వేరియంట్ టాటా పంచ్ కార్లతో పాటు సీఎన్‌జీ వేరియంట్లపైనా లభిస్తుంది. మైక్రో ఎస్‌యూవీ కారుగా పేరు గాంచిన టాటా పంచ్ ఈ ఆర్థిక ఏడాదిలో నెల నెలకు సేల్స్ పెంచుకుంటూ దూసుకెళ్తోంది. దేశంలో పండగల సీజన్ మొదలవుతోంది. అంతకు ముందే టాటా మోటార్స్ తమ కస్టమర్లకు బంపర్ ఆఫర్ ప్రకటించింది. టాటా పంచ్ పెట్రోల్ వేరియంట్‌పై రూ.25 వేల తగ్గింపు ఇస్తోంది. అలాగే సీఎన్‌జీ పై రూ.20 వేల డిస్కౌంట్ ఇస్తోంది. దీంతో తమ సేల్స్ మరింత పెరుగుతాయని టాటా మోటార్స్ భావిస్తోంది. అలాగే జులై డిస్కౌంట్ ఆఫర్‌తో పోలిస్తే ఆగస్టులో అదనంగా మరో రూ.7 వేల డిస్కౌంట్ కల్పిస్తుండడం గమనార్హం. ఈ ఆఫర్లు 2023తో పాటు 2024లో తయారైన కార్లపై ఉంటాయని కంపెనీ వర్గాలు చెబుతున్నాయి. పెట్రోల్ వేరియంట్ పై ఇస్తున్న ఈ డిస్కౌంట్ ఆఫర్‌లో రూ.20 వేలు నేరుగా క్యాష్ డిస్కౌంట్ ఇస్తుండగా.. రూ.5 వేలు కార్పొరేట్ డిస్కౌంట్ ఇస్తోంది. అలాగే టాటా పంచ్ సీఎన్‌జీ డిస్కౌంట్‌లో రూ.15 వేల క్యాష్ డిస్కౌంట్ వస్తుండగా రూ.5 వేలు కార్పొరేట్ రిబేట్ లభిస్తోంది. టాటా పంచ్‌లో 1.2 లీటర్ల టర్బో పెట్రోల్ రివొట్రాన్ ఇంజిన్ ఉంది. ఇది 5 స్పీడ్ మాన్యువల్, ఆటోమేటిక్ వేరియంట్లలో లభిస్తోంది. టాటా పంచ్ ధరల విషయానికి వస్తే పెట్రోల్ వేరియంట్ ధర రూ. 7 లక్షలు (ఎక్స్ షోరూమ్) నుంచి మొదలవుతుంది. గరిష్ఠంగా రూ.10.20 లక్షల వరకు ఉంది. అలాగే సీఎన్‌జీ వేరియంట్ టాటా పంచ్ కారు ధర రూ. 7.23 లక్షల నుంచి మొదలై రూ. 9.85 లక్షల మధ్య ఉంది. కారు ఆఫర్స్ అనేవి ప్రాంతాలు, డీలర్లను బట్టి మారుతుంటాయి. మీరు కారు కొనుగోలు చేసే ముందే మీ సమీపంలోని కారు షోరూమ్‌కి వెళ్లి డిస్కౌంట్ ఆఫర్ల గురించి తెలుసుకోవడం మంచిది. లేదంటే తర్వాత ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

# ఆగస్ట్ 8 నుంచి ఎస్తటిక్ ఇంజనీర్స్ ఐపీవో ప్రారంభం




విశ్వంభర, బిజినెస్ : ఆగస్టు నెలలో కొత్త ఐపీఓల సందడితో ప్రైమరీ మార్కెట్ కళకళలాడుతోంది. ఇప్పటికే ఆగస్టు నెల ఓలా ఎలక్ట్రిక్ ఐపీఓ ప్రారంభం అవ్వగా, ప్రస్తుతం మరికొన్ని ఐపీవోలు కూడా ప్రైమరీ మార్కెట్లోకి ప్రవేశించేందుకు సిద్ధమవుతున్నాయి. తాజాగా ఆగస్టు 8వ తేదీ నుంచి ఈ స్తటిక్ ఇంజనీర్స్ ఐపీఓ మార్కెట్లోకి ప్రవేశించేందుకు సిద్ధమయింది. ఈ కంపెనీ 26.47 కోట్ల రూపాయలను ఐపిఓ ద్వారా సమీకరించాలని సిద్ధం అయింది. మొత్తం 45.64 లక్షల షేర్ లను ఆఫర్ ఫర్ సేల్ కింద విక్రయించనున్నారు. ఈ షేర్లకు సంబంధించి కీలకమైన తేదీల విషయానికి వస్తే, ఐపిఓ ఆగస్టు 8వ తేదీ ప్రారంభం కానుంది అలాగే ఆగస్టు 12వ తేదీన ఈ ఐపీఓ ముగియనుంది. ఇంకా ఆగస్టు 13వ తేదీన షేర్ల అలాట్మెంట్ జరుగుతుంది. షేర్లు ఎవరికైతే లభిస్తాయో వారికి ఆగస్టు 14వ తేదీన డిమార్ట్ అకౌంట్ లలో క్రెడిట్ అవుతాయి. అయితే ఎవరికైతే షేర్లు దక్కవో వారికి అదే రోజు రిఫండ్ లభిస్తుంది. ఇక స్టాక్ మార్కెట్లో ఈ కంపెనీ ఆగస్టు 16వ తేదీన లిస్టింగ్ జరుపుకోనున్నాయి. ఈ షేర్ల ప్రైస్ బ్యాండ్ విషయానికి వస్తే పది రూపాయల ముఖ విలువ గల ఈ షేర్లను కనిష్ఠంగా 55 రూపాయలు గరిష్ఠంగా 58 రూపాయలు వరకు వెడ్డింగ్ వేసుకోవచ్చు మినిమం ఒక లాట్ సైజులో కనీసం 2000 షేర్లను కొనుగోలు చేయాల్సి ఉంటుంది అంటే ఒక లక్ష 16 వేల రూపాయల ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. కంపెనీ విషయానికి వస్తే: ఈస్థెటిక్ ఇంజనీర్స్ లిమిటెడ్ 2003లో ప్రారంభించారు. కంపెనీ ఇంటీరియర్ డిజైన్ సేవలను అందిస్తుంది, మాన్యుఫాక్చర్, అలాగే ఇన్‌స్టాలేషన్ విభాగంలో సేవలు అందిస్తోంది. కంపెనీ ఉత్పత్తి కేంద్రం కోల్‌కతాలోని హౌరాలో ఉంది. కంపెనీ యూనిట్ మొత్తం 3,000 చదరపు మీటర్లకు పైగా విస్తరించి ఉంది. జూన్ 30, 2024 నాటికి, కంపెనీలో 52 మంది శాశ్వత ఉద్యోగులు ఉన్నారు. ఈక్విటీ మార్కెట్లలో పెట్టుబడులు రిస్కుతో కూడుకున్నవి. ఈ కథనంలో ఇక్కడ వ్యక్తీకరించిన అభిప్రాయాలు/సూచనలు/సలహాలు కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. జీ తెలుగు ఎలాంటి షేర్ మార్కెట్ రికమండేషన్స్ ఇవ్వదు. ఏదైనా ఆర్థిక నిర్ణయం తీసుకునే ముందు నిపుణులైన సర్టిఫైడ్ ఇన్వెస్ట్ మెంట్ ఫైనాన్షియల్ అడ్వైజర్లను సంప్రదించాలని జీ తెలుగు పాఠకులను సూచిస్తుంది.


# భారతీయుడు2 ఓటీటీలోకి వస్తున్నాడు




**విశ్వంభర, సినిమా :** లోక నాయకుడు కమల్ హాసన్ ప్రధాన పాత్రలో నటించిన కొత్త చిత్రం 'భారతీయుడు 2'. దాదాపు 28 ఏళ్ల (1996) క్రితం వచ్చిన సూపర్ హిట్ సినిమా భారతీయుడు సీక్వెల్‌గా దీన్ని తెరకెక్కించారు. సెన్సేషనల్ డైరెక్టర్ శంకర్ తెరకెక్కించిన ఈ సినిమాలో సిద్ధార్, రకుల్‌ప్రీత్ సింగ్, బాబీ సింహా, బ్రహ్మానందం, ప్రియా భవానీ శంకర్, కాజల్ అగర్వాల్ తదితరులు కీలకపాత్రలలో మెరిశారు. భారీ అంచాలతో జులై 12న థియేటర్లలో విడుదలైన భారతీయుడు 2 సినిమాకు మొదటి షో నుంచే నెగెటివ్ టాక్ వచ్చింది. మొదటి పార్ట్ మ్యాజిక్ ను కొనసాగించలేక చతికిలపడింది. భారీ తారాగణం, ఆకట్టుకునే యాక్షన్ సీక్వెన్స్, విజువల్స్ ఉన్నప్పటికీ నీరసమైన కథా, కథనాలు భారతీయుడు 2 సినిమాను దెబ్బ తీశాయని రివ్యూలు వచ్చేశాయి. అయితే తమిళంలో ఈ సినిమాకు భారీగానే వసూళ్లు వచ్చాయి. కానీ తెలుగుతో సహా ఇతర భాషల్లోనూ భారతీయుడు 2 సినిమా డిజాస్టర్ గా నిలిచింది. ఫ్లాఫ్ టాక్ రావడంతో చాలామంది ఓటీటీలో ఈ సినిమాను చూద్దామని ఫిక్స్ అయ్యారు. ఇప్పుడు వారి కోసమే భారతీయుడు 2 సినిమా అఫీషియల్ స్ట్రీమింగ్ డేట్ వచ్చేసింది. ప్రముఖ ఓటీటీ ప్లాట్ ఫామ్ నెట్ ఫ్లిక్స్ ఇండియన్ 2 సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో ఆగస్టు 9 నుంచి కమల్ సినిమాను ఓటీటీలోకి తీసుకురానున్నారు. తమిళ్ తో పాటు తెలుగు, కన్నడ, మలయాళ భాషల్లోనూ భారతీయుడు 2 సినిమా స్ట్రీమింగ్ కు అందుబాటులోకి రానుంది. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా అధికారికంగా ప్రకటించింది నెట్ ఫ్లిక్స్. అలాగే సినిమాకు సంబంధించి ఒక కొత్త పోస్టర్ ను విడుదల చేసింది. ప్రతిష్ఠాత్మక లైకా ప్రొడక్షన్స్ బ్యానర్ పై సుభాస్కరన్ సుమారు రూ. 250 కోట్లతో భారతీయుడు 2 సినిమాను నిర్మించారని టాక్. అయితే ఓవరాల్ గా ఈ సినిమా రూ.130 కోట్లను మాత్రమే రాబట్టిందని సమాచారం.మొదట ఈ సినిమాను స్వాతంత్ర్య దినోత్సవం కానుకగా ఆగస్టు 15న ఓటీటీలోకి తీసుకురానున్నట్లు వార్తలు వచ్చాయి. అయితే థియేటర్లలో పెద్దగా రెస్పాన్స్ లేకపోవడంతో ఇప్పుడీ తేదీ మార్చారు. ఒక వారం ముందుగానే స్ట్రీమింగ్ కు తీసుకొచ్చారు.








# పింక్ శారీలో అదరగొట్టిన కాజల్

విశ్వంభర, సినిమా : చందమామ సినిమా అప్పుడు ఎంత బ్యూటిఫుల్‌గా ఉందో ప్రెజెంట్ ఇప్పటికీ కాజల్ అగర్వాల్ అదే అందం. అదే ఫిట్ నెస్‌ని మైంటైన్ చేస్తుంది. పెళ్ళైపోయింది, బాబు పుట్టాడు.. కాజల్ ఇప్పటికి కెరీర్‌ని కొనసాగిస్తుంది. అందుకే సోషల్ మీడియాలో మాత్రం గ్లామర్ పిక్స్ వదులుతూనే ఉంటుంది. ఈమధ్యన కాజల్ అగర్వాల్ చేసిన సినిమాలన్నీ వరసగా నిరాశపరిచి సినిమాలే. ఇండియన్ 2 అయితే కాజల్ ప్రస్తావన కూడా విమర్శకులు తియ్యలేదు. సత్యభామతో ఫాంలోకి రావాలనుకుంటే అది కూడా కాజల్‌కి హ్యాండ్ ఇచ్చింది. ప్రస్తుతం తెలుగు, తమిళ సీనియర్ హీరోలేమైనా కాజల్ అగర్వాల్ వైపు చూస్తారేమో చూడాలి. ఇక తాజాగా కాజల్ అగర్వాల్ ఓ షాప్ ఓపెనింగ్‌కి చీర కట్టులో బ్యూటిఫుల్‌గా హాజరైంది. హైదరాబాద్ లో ఓ షాప్ ఓపెనింగ్ కి కాజల్ పింక్ ట్రాన్స్పరెంట్ శారీ లో చాలా అందంగా కనిపించింది. మెడలో హెవీ జ్యువలరీతో కాజల్ మెరిసిపోయింది. ప్రస్తుతం కాజల్ శారీ పిక్స్ నెట్టింట్లో చక్కర్లు కొడుతున్నాయి.




## ప్యాన్ ఇండియా రేంజ్‌లో

# అఖండ-2

**విశ్వంభర, సినిమా :** నందమూరి నట సింహం బాలకృష్ణ ఉగ్రరూపం చూపించిన సినిమా అఖండ. మాస్ పుల్స్ బాగా తెలిసిన బోయపాటి శ్రీను దర్శకత్వం వహించిన ఈ మూవీ.. టాలీవుడ్ రికార్డ్స్ బద్దలు కొడుతూ భారీ హిట్ సాధించింది. బాలకృష్ణ రీసెంట్ కెరీర్‌లో అందరినీ మెస్మరైజ్ చేసిన సినిమాల్లో అఖండ ఒకటి. హిందీ ఆడియన్స్‌కి కూడా ఈ సినిమా బాగా కనెక్ట్ అయింది. కలెక్షన్స్ పరంగా దూసుకెళ్లి బాక్సాఫీస్ షేక్ చేసింది.అయితే ఎన్నికలు ముగిసిన తర్వాత తన తదుపరి ప్రాజెక్ట్‌ను ప్రకటిస్తానని బోయపాటి చెప్పారు. అలానే 'అఖండ 2'పై కూడా రియాక్ట్ అయ్యారు. అఖండ సీక్వెల్‌లో ఏం చూపించబోతున్నారంటూ అడిగిన ప్రశ్నకి "ఈ సీక్వెల్‌లో సమాజానికి ఏం అవసరమో అదే చూపిస్తాను" అంటూ బోయపాటి బదులిచ్చారు. దీంతో ఈ సినిమాకు సీక్వల్ వస్తే ఆ లెక్కే వేరుగా ఉంటుందని ఆశపడ్డ నందమూరి అభిమానుల కోసం ఓ దిమ్మతిరిగే న్యూస్ బయటకొచ్చింది. ఇండస్ట్రీ షేక్ అయ్యే సినిమా రావాలంటే బోయపాటి శ్రీను- బాలకృష్ణ కలవాల్సిందే అన్నట్టుగా ట్రెండ్ క్రియేట్ చేసుకుంది ఈ కాంబో. అంతకుముందు వీళ్లిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన సింహా, లెజెండ్ సినిమాలు భారీ హిట్స్ సాధించాయి. ఆ తర్వాత అఖండ మూవీతో హ్యాట్రిక్ కొట్టారు. అందుకే ఎలాగైనా పార్ట్ 2 సౌండ్‌ని ప్యాన్ ఇండియా రేంజ్‌లో వినిపించాలని కంకణం కట్టుకున్నారు బోయపాటి శ్రీను. బాలయ్య- బోయపాటి కాంబినేషన్ అనగానే క్రేజ్ పెంచుకున్నారు నందమూరి అభిమానులు. సినిమాల షూటింగ్ విషయంలో ఆలస్యం జరుగుతుందంటే బోలెడన్ని కారణాలుంటాయి. హీరో, హీరోయిన్ల కాల్షీట్ సర్దుబాటు కాక కావచ్చు... లొకేషన్లు కుదరక కావచ్చు... స్క్రిప్ట్ పక్కాగా కుదరకపోవడం వల్లా కావచ్చు. కానీ అన్నీ పర్ఫెక్ట్ గా ప్లాన్ చేసుకున్న తర్వాత టోటల్ థీమ్‌నే మార్చాల్సి వస్తే... అప్పటిదాకా అనుకున్నదాన్ని ఇంకో రకంగా మార్చుకోవాల్సి వస్తే..అలాంటి ఒక కాన్సెప్ట్ బాలయ్య మువీ లో మారబోతుంది. బోయపాటి డైరెక్షన్‌లో బాలయ్య సినిమా చేస్తున్నారంటేనే ఫ్యాన్స్ కి ఫుల్ మీల్స్ రెడీ అవుతోందని అర్థం. అయితే ఈ సారి మాత్రం వంట దినుసులు మారుతున్నాయన్నది టాక్. ఆల్రెడీ యాంటీ గవర్నమెంట్ థీమ్‌తో కథను సిద్ధం చేశారట. కానీ ఇప్పుడు ప్రభుత్వం మారింది. అందుకే థీమ్‌ని కూడా మార్చే పనిలో పడ్డారట బోయపాటి. అందుకే అఖండ 2 సెట్స్ మీదకు వెళ్లడానికి ఆలస్యం అవుతుందన్నది టాక్. అయితేఅఖండ మూవీ సంచలన విజయం సాధించడంలో థమన్ పాత్ర ఎంతో ఉంది. థమన్ ఈ సినిమాకు ఇచ్చిన మ్యూజిక్, బీజీఎం ఈ సినిమా సక్సెస్‌లో కీలక పాత్ర పోషించాయి. గత కొన్నేళ్లుగా బాలయ్య సినిమాలకు వరుసగా థమన్ మ్యూజిక్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. గతంలో థమన్ అఖండ సీక్వెల్ కు కొన్ని అప్ డేట్స్ సైతం ఇవ్వడం జరిగింది. 14 రీల్స్ ఎంటర్టైన్మెంట్ బ్యానర్ పై అఖండ సీక్వెల్ తెరకెక్కనుండగా ఈ సినిమాకు హర్షవర్ధన్ రామేశ్వర్ మ్యూజిక్ డైరెక్టర్ అని ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తోంది. యానిమల్ సినిమాతో మ్యూజిక్ డైరెక్టర్ గా మంచి పేరు సొంతం చేసుకున్న హర్షవర్ధన్ రామేశ్వర్‌కు ఎంతోమంది ఫ్యాన్స్ ఉన్నారు. అయితే అఖండ సీక్వెల్‌కు మాత్రం థమన్‌కే ఛాన్స్ ఇస్తే బాగుంటుందని కామెంట్లు వినిపిస్తున్నాయి.

# లంగ్స్ క్యాన్సర్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు

**విశ్వంభర, ఫిచర్ :** క్యాన్సర్ మహమ్మారితో ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రపంచవ్యాప్తంగా వారి సంఖ్య రోజు రోజుకి పెరుగుతూనే ఉంది. ముఖ్యంగా ఊపిరితిత్తుల(లంగ్స్) క్యాన్సర్‌తో ఎందరో ప్రాణాలు కోల్పోవా ల్సి వస్తుంది. అందుకే ఈ క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు ఏటా ఆగస్ట్ 1 వ తేదీన ప్రపంచ ఊపిరితిత్తుల క్యాన్సర్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. లంగ్స్ క్యాన్సర్ కారకాలు, నివారణ, చికిత్స వంటి విషయాలపై అవగాహన కల్పించేందుకు దీనిని ప్రపంచవ్యాప్తంగా చేస్తున్నారు. లంగ్స్ క్యాన్సర్ అనేది అత్యంత సాధారణమైన క్యాన్సర్. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న క్యాన్సర్ మరణాలకు ఇదే ప్రధానకారణమవుతుంది. దాదాపు 1.6 మిలియన్ల మంది ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో చనిపోతున్నారు. దీనికి ప్రధానకారణం స్మో కింగ్ (ధూమపానం) అయినా.. స్మోకింగ్ అలవాటు లేనివారు కూడా దీనిబారిన పడి ప్రాణాలు వదులుతున్నారు. దాదాపు 15 శాతం మందికి పొగాకు అలవాటు లేకపోయినా ఈ క్యాన్సర్ వస్తున్నట్లు పరిశోధనల్లో గుర్తించారు. గాలి కాలుష్యం, ధూమపానం చేసే చోట ఎక్స్ పోజర్ కావడం, వివిధ కారణాల వల్ల ఈ క్యాన్సర్ వస్తుంది.



**క్యాన్సర్ కారకాలు**

ధూమపానం, పొగాకు వాడకం అతి ముఖ్యమైన, ప్రధానమైన కారకాలు. స్మోకింగ్ చేసేవారిలో ఎక్కువమంది ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు గురి అవుతున్నారు. రాడాన్, ఆస్బెస్టాస్ లకు గురికావడం, వాయుకాలుష్యం కూడా లంగ్స్ క్యాన్సర్‌కు కారణమవుతుంది. కొందరికి ఫ్యామిలీ నుంచి కూడా వచ్చే అవకాశముంది. రేడియేషన్ థెర పీ, హ్యూమన్ పాపిల్లోమావైరస్ (HPV) ఇన్‌ఫెక్షన్లు కూడా ఈ క్యాన్సర్‌ను ప్రేరేపిస్తాయి. క్రానిక్ అబ్స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ (COPD) కూడా క్యాన్సర్‌కు ట్రిగర్ పాయింట్ అవుతుంది.

**నివారణ చర్యలు**

ధూమ పానం చేసే అలవాటు ఉంటే వీలైనంత తొందరగా మానేయాలి. అలాగే స్మోకింగ్ చేసేవారికి దూరంగా ఉండాలి. HPV, ఇన్ ఫ్లూఎంజా టీకాలు వేయించుకోవాలి. ఇవి క్యాన్సర్ రాకుండా కాపాడే సత్తా కలిగి ఉంటాయి. పండ్లు, కూరగాయలను ఎక్కువగా డైట్‌లో తీసుకోవాలి. సమతుల్యమైన హెల్తీ ఆహారాన్ని తీసుకోవాలి. ఇమ్యూనిటీని పెంచే ఫుడ్స్‌ని తీసుకోవడంతో పాటు రెగ్యూలర్‌గా వ్యాయామం చేయాలి. ప్రపంచ వ్యాప్తంగా క్యాన్సర్ మరణాలకు ఊపిరితిత్తుల క్యాన్సర్ ప్రధాన కారణమవుతుంది. కాబట్టి దీనిని ముందుగా గుర్తించడం చాలా అవసరం. కాబట్టి రెగ్యూలర్ చెకప్స్ చేయించుకోవాలి. ముందుగానే క్యాన్సర్ ను గుర్తించడం వల్ల చికిత్స త్వరగా అందుతుంది. ఇది లైఫ్ స్పామ్‌ని పెంచుతుంది. రోగనిర్ధారణ ఎంత త్వరగా చేస్తే ప్రాణాలు అంత త్వరగా కాపాడుకోవచ్చు.

# తోటకూరతో ఈ సమస్యలకు చెక్

**విశ్వంభర, ఫిచర్ :**

ఆకుకూరలు ఆరోగ్యానికి చాలా మంచివి. అందులో బచ్చలికూర, మెంతి కూర, తోటకూర, గోంగూర చాలానే ఉంటాయి. ఇందులో తోటకూర, దానిని తినడం వల్ల కలిగే లాభాల గురించి తెలుసుకుందాం. తోటకూర చాలా రుచికరమైన హెల్దీ ఫూడ్. ఇది ఎరుపు, ఆకుపచ్చ, ఊదా రంగుల్లో కూడా కనిపిస్తుంది. దీనిలో కాల్షియం, మెగ్నీషియం, జింక్, ఐరన్, విటమిన్ ఎ వంటి అవసరమైనన్నీ పోషకాలు ఉన్నాయి. దీనిని తీసుకోవడం వల్ల రక్త ఉత్పత్తి పెరిగి ఎముకలు దృఢంగా మారతాయి. అంతేకాకుండా షుగర్ వ్యాధి కంట్రోల్‌లో ఉంటుంది. ఎముకల్ని బలాన్ని అందించంలో, కీళ్ళనొప్పులని దూరం చేయడంలో ఆకుకూరలు హెల్ప్ చేస్తాయి. మరీ ముఖ్యంగా, కాల్షియం, మెగ్నీషియం, జింక్, కాపర్ వంటి ఖనిజాలు ఎముకల్ని దృఢంగా చేసి సమస్యల్ని తగ్గిస్తుంది. రక్తంలో షుగర్ లెవల్స్‌ని తగ్గించడంలో మెంతులు హెల్ప్ చేస్తాయి. ఈ ఆకుల్లోని పదార్థాలు శరీరంలో ఇన్సులిన్‌ని సరైన మొత్తంలో బ్యాలెన్స్ చేస్తాయి. చక్కెర జీవక్రియని మెరుగ్గా చేస్తాయి. దీని వల్ల రక్తంలోని అదనపు చక్కెర శరీరంలోని కణాల్లోకి వెళ్ళి షుగర్ లెవల్స్‌ని ఒక్కసారిగా పెంచదు. దీంతో షుగర్ పేషెంట్స్ రక్తంలో చక్కెర కంట్రోల్ అవుతుంది. తోటకూరలో ఐరన్, విటమిన్ సి, బి9 వంటి పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఇది రక్త హీనత సమస్యని దూరం చేస్తుంది. దీనిని రెగ్యులర్‌గా తీసుకుంటే అలసట, బలహీనత, కళ్ళు తిరగడం, శ్వాస ఆడకపోవడం వంటి సమస్యలు తగ్గుతాయి. ఈ తోటకూరని తీసుకుంటే జీర్ణక్రియ మెరుగవుతుంది. దీనిని తినడం వల్ల కడుపు నొప్పి, అజీర్ణం, మలబద్ధకం, గ్యాస్, గుండెల్లో మంట, విరోచనాలు, యాసిడ్ రిఫ్లక్స్ వంటి అనేక జీర్ణ సమస్యలు దూరమవుతాయి. ఇది జీర్ణ వ్యవస్థని బలంగా చేసి పోషకాలను అందిస్తుంది. దీంతో పాటు గ్యాస్ట్రిక్ సమస్యని కూడా దూరం చేస్తుంది. తోటకూర ఆరోగ్యానికి చాలా మంచిది. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్స్ గుండెని ఆరోగ్యంగా ఉంచి గుండె సంబంధిత సమస్యల్ని దూరం చేస్తాయి. రక్తపోటుని కంట్రోల్ చేస్తుంది. గుండె కండరాలని బలంగా చేసి రక్త కొలెస్ట్రాల్‌ని తగ్గిస్తుంది. దీంతో గుండెపోటు, రక్తం గడ్డకట్టే ప్రమాదం తగ్గుతుంది.




Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com